www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

14న రెండో విడత సమీకృత గురుకులాల శంకుస్థాపన

- వచ్చే విద్యాసంవత్సరంలోపు తొలి విడత స్కూళ్ల పూర్తి
- ఉపాధి కల్పించే విద్య రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం
- విద్యార్థులతో ముఖాముఖిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2


సచివాలయంలో విద్యార్థులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి

గురువారం | 7-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 219

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: షష్ఠి రా. 12.35 తదుపరి సప్తమి; నక్షత్రం: పూర్వాషాఢ ఉ. 11.47 తదుపరి ఉత్తరాషాఢ; వర్జ్యం: రా.7.52-9.29; దుర్ముహూర్తం: ఉ.10.05-10.50, మ.2.36-3.21; అమృతఘడియలు: ఉ.6.49-8.28, రాహుకాలం: మ.1.30-3.00, సూర్యోదయం: 6.19, సూర్యాస్తమయం: 5.37

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్వేతసౌధం మళ్లీ.. ట్రంప్‌దే


ఎన్నికల ఫలితాల అనంతరం సతీమణి మెలానియాతో కలిసి ట్రంప్ అభివాదం

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయం

- ఉత్కంఠ పోరులో.. ట్రంప్‌కే జైకొట్టిన ఓటర్లు
- స్వింగ్ రాష్ట్రాల్లో కూడా రిపబ్లికన్లదే హవా
- ట్రంప్‌నకు 292 స్థానాలు.. కమలకు 224
- అమెరికన్లను ఉద్దేశించి ప్రసంగించిన ట్రంప్
- ఉష ఇక అమెరికా రెండో మహిళ అని వ్యాఖ్య
- గెలిచి.. ఓడి.. మళ్లీ గెలుపొంది..
- 131 ఏళ్ల తర్వాత రికార్డు సమం చేసిన ట్రంప్
- మిత్రమా.. కలిసి పనిచేద్దాం: ప్రధాని మోదీ

న్యూయార్క్, నవంబరు 6: అగ్రరాజ్యం అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ఘన విజయం సాధించారు. తన ప్రత్యర్థి, డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలాహ్యారిస్‌తో ఆద్యంతం ఉత్కంఠగా.. 'నువ్వా-నేనా' అన్నట్లుగా సాగిన పోరులో ట్రంప్ అప్రతిహత విజయాన్ని సాధించారు. 538 ఎలక్టోరల్ కాలేజీ ఓట్లకు గాను.. అధ్యక్ష పదవిని చేపట్టడానికి మ్యాజిక్ ఫిగర్ 270ని సునాయాసంగా దాటేసిన ట్రంప్.. కడపటి వార్తలందేసరికి 292 చోట్ల విజయాన్ని నమోదు చేసుకున్నారు. ఆ సమయానికి ట్రంప్ ప్రత్యర్థి, భారత సంతతికి చెందిన డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హ్యారిస్ 224 ఎలక్టోరల్ సీట్లను కైవసం చేసుకున్నారు. ముందు నుంచి సర్వేలు ట్రంప్‌నకు అటూఇటుగానే ఉన్నా.. ఓటర్లు మాత్రం ఆయనకు అండగా నిలిచారు. ఈ ఘన విజయంతో ట్రంప్ మరో అరుదైన రికార్డును సాధించారు. అమెరికా అధ్యక్షుడిగా పనిచేసి, తదుపరి ఎన్నికల్లో ఓడిపోయి అనంతరం మరో పర్యాయం అధ్యక్షుడిగా ఎన్నిక కావడం 131 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. కోర్టుల్లో క్రిమినల్

మిగతా 13వ పేజీలో...

విదేశీయుల పిల్లలకు ఆటోమేటిక్ పౌరసత్వం రద్దు.. భారత్‌పై ప్రభావం?

ఎవరూ ఊహించని విజయం ఇది. భవిష్యత్తులో కూడా ఇలాంటి విజయం ఉంటుందని అనుకోను. అమెరికా బంగారు భవిత కోసం పరితపిస్తా. నాపై హత్యాయత్నం జరిగాక.. దేవుడు పునర్జన్మనిచ్చాడని చాలా మంది అన్నారు. నా ఊపిరి ఉన్నంత వరకు అవిశ్రాంతంగా అమెరికన్ల కోసం పనిచేస్తా. - డొనాల్డ్ ట్రంప్

ఫలించని పోరాటం!

- చివరి వరకూ తప్పుకోని బైడెన్..
- లభించింది 3 నెలల సమయమే
- జాతి వివక్ష, పురుషాధిక్యత ప్రభావం
- హక్కుల ప్రచారం.. తటస్థ ఓటర్లు దూరం
- కమలా హ్యారిస్ ఓటమికి పలు కారణాలు



13



తెలుగింటి అల్లుడు.. వాన్స్

అమెరికా ఉపాధ్యక్షుడి భార్య చిలుకూరి ఉష.. మూలాలు ఏపీలో



టార్గెట్ కేటీఆర్

ఫార్ములా-ఈ కేసులో బిగుస్తున్న ఉచ్చు!

- మంత్రిగా ఉన్నప్పుడు కేటీఆర్ మౌఖిక ఆదేశాలతోనే విదేశీ కంపెనీలకు నిధులు
- రూ.55 కోట్లు బదిలీ చేసిన మునిసిపల్ శాఖ
- గవర్నర్ అనుమతితో కేసులో ముందుకు అడుగులు!

హైదరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ రేసింగ్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ చుట్టూ ఉచ్చు బిగుస్తోందా? అప్పటి మునిసిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్‌కుమార్.. నాడు మంత్రిగా ఉన్న కేటీఆర్ మౌఖిక ఆదేశాలతోనే విదేశీ కంపెనీలకు రూ.55 కోట్లు బదిలీ చేశామని చెప్పడం ఇప్పుడు కేటీఆర్‌కు చుట్టుకోనుందా? నేడోరేపో అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు కేటీఆర్‌కు నోటీసులు ఇచ్చి, విచారిస్తారా? గవర్నర్ అనుమతి కోసం ప్రభుత్వం ప్రయత్నిస్తోందా? ఈ ప్రశ్నలకు బుధవారం చోటుచేసుకున్న కొన్ని పరిణామాలు

మిగతా 2వ పేజీలో...

గవర్నర్‌తో సీఎం భేటీ

- కీలక సదస్సు వాయిదా వేసుకొని మరీ సమావేశం
- ఫార్ములా-ఈ వ్యవహారంలో కేటీఆర్ పాత్రపై వివరణ?
- రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన కులగణన గురించి వెల్లడి

2



స్పీకర్‌పై హైకోర్టు అజమాయిషీ చెల్లదు

- హైకోర్టుకు శాసనసభాపతి సబార్డినేట్ కాదు
- ఎమ్మెల్యేల అనర్హతపై 4 వారాల్లో విచారణ చేపట్టాలని బెదిరించినట్లుగా ఉత్తర్వులు
- లేదంటే ఉరి తీస్తా అన్నట్లుగా ధోరణి ఉంది
- సింగిల్ జడ్జి.. పరిధి మీరి వ్యవహరించారు
- స్పీకర్ తీర్పు ఇచ్చేదాకా న్యాయసమీక్ష వీల్లేదు
- హైకోర్టు ఎదుట రాష్ట్ర ప్రభుత్వం వాదనలు

హైదరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం ట్రిబ్యునల్ చైర్మన్‌గా వ్యవహరించే శాసనసభ స్పీకర్.. హైకోర్టుకు సబార్డినేట్ కాదని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. స్పీకర్‌పై హైకోర్టు అజమాయిషీ చేస్తానంటే కుదరదని, స్పీకర్ విశేషాధికారాల్లో జోక్యం చేసుకోవడానికి వీల్లేదని పేర్కొంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్‌లపై హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును

మిగతా 2వ పేజీలో...



కేశవాపురం వద్దు.. మేఘా కాంట్రాక్టు రద్దు

- రిజర్వాయర్ టెండర్లు రద్దు చేసిన రేవంత్ సర్కార్
- జలాశయం నిర్మాణ ప్రతిపాదన విరమణ
- తక్కువ ఖర్చుతో కొత్త ప్రాజెక్టుకు రూపకల్పన
- మల్లన్నసాగర్ నుంచి నేరుగా జంట జలాశయాలకే!
- బీఆర్ఎస్ హయాంలో కేశవాపురం డిజైన్
- రూ.4,777.59 కోట్లకు పరిపాలన అనుమతి
- రూ.3,918 కోట్లకు పనులు దక్కించుకున్న మేఘా
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అంచనాలను ప్రస్తుత ధరల ప్రకారం పెంచాలని కోరిన సంస్థ
- తిరస్కరిస్తూ టెండరును రద్దు చేసిన సర్కారు
- కొత్త ప్రతిపాదనతో ప్రభుత్వానికి 2వేల కోట్ల ఆదా


కేశవాపురం రిజర్వాయర్‌ను నిర్మించాలనుకున్నది ఇక్కడే..

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మేఘా ఇంజనీరింగ్ కంపెనీకి అప్పగించిన కేశవాపురం రిజర్వాయర్ నిర్మాణ పనుల ఒప్పందాన్ని రేవంత్ సర్కారు రద్దు చేసింది. ఈ రిజర్వాయర్ నిర్మాణం అధిక వ్యయంతో కూడుకున్నది కావడంతో మొత్తంగా కేశవాపురం జలాశయం ప్రతిపాదనను కూడా రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. తక్కువ ఖర్చుతోనే హైదరాబాద్ జంట నగరాలకు తాగునీరు అందించేలా కొత్త ప్రాజెక్టు చేపట్టేందుకు సిద్ధమైంది. గత ప్రభుత్వం.. హైదరాబాద్ జంట నగరాలకు

మిగతా 14వ పేజీలో...

ముగ్గురూ కలిసి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు

- కాంట్రాక్టులు అన్నీ ఆ 2 సంస్థలకే కట్టబెడతారా?
- 'కొడంగల్‌లో సీఎం రేవంత్ వాటా ఎంత? ఢిల్లీ వాటా ఎంత?
- సీఎం చెప్పినట్లే చేస్తే అధికారుల ఉద్యోగాలు ఊడతాయ్: కేటీఆర్

14



పీఎం-విద్యాలక్ష్మి

విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం కొత్త పథకం

- ఉన్నత చదువులకు సర్కారు హామీతో రుణాలు
- పథకం పరిధిలోకి ఏటా 22 లక్షల మంది
- రూ.3,600 కోట్లు కేటాయించనున్న సర్కారు
- కేంద్ర మంత్రివర్గ భేటీలో నిర్ణయం

న్యూఢిల్లీ, నవంబరు 6: విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పీఎం-విద్యాలక్ష్మి పథకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పథకం వల్ల ప్రతిభావంతులైన విద్యార్థులు నాణ్యమైన ఉన్నత చదువులు చదివేందుకు ఇకపై ఆర్థిక ఇబ్బందులు ఉండబోవని కేంద్రం పేర్కొంది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 860 'నాణ్యమైన ఉన్నత విద్యా సంస్థ (క్యూహెచ్ఈఐ)'ల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు పీఎం-విద్యాలక్ష్మి పథకం కింద ఎలాంటి హామీలు లేకుండా బ్యాంకులు, ఆర్థిక సంస్థలు రుణాలు అందించనున్నాయి. ట్యూషన్ ఫీజు, ఇతర ఖర్చుల కోసం

మిగతా 12వ పేజీలో...

సచివాలయంలో వాస్తు మార్పులు!

- ఈశాన్యం వైపు ప్రధాన ద్వారం.. ఇకపై ఈ గేటు నుంచే సీఎం రాకపోకలు
- 2వ గేటు నుంచి 4వ గేటు దాకా కొత్త రోడ్డు.. రూ.3.20 కోట్లతో పనులు


సచివాలయం 2వ గేటు నుంచి 4వ గేటు వరకు రోడ్డు కోసం తవ్వుతున్న దృశ్యం

హైదరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయంలో వాస్తు ప్రకారం పలు మార్పులు జరుగుతున్నాయి. ప్రస్తుతం తూర్పు దిశగా ఉన్న సచివాలయ ప్రధాన మహా ద్వారం ఈశాన్యం వైపునకు మారనుంది. దీంతోపాటు ప్రస్తుతం సచివాలయంలోని ఆగ్నేయంవైపు ఉన్న గేటు నంబర్-2 నుంచి ఎన్టీఆర్ గార్డెన్ వైపున్న గేటు నంబర్-4 వరకు నేరుగా వెళ్లేలా రహదారిని నిర్మిస్తున్నారు. సచివాలయంలో ప్రధాన ద్వారానికి ఎదురుగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఈ మార్పులను చేపట్టినప్పటికీ.. అన్నీ వాస్తు ప్రకారం ఉండేలా చేస్తున్నారు. ఇందులో భాగంగానే ప్రస్తుత

మిగతా 3వ పేజీలో...



రాత్రికిరాత్రే బుల్డోజర్లతో రాలేరు

- నోటీసులు ఇవ్వకుండా చాటింపు వేస్తారా?
- ఇది అహంకారం, అరాచకం
- ఆక్రమణల పేరుతో ఇలా ఇళ్లను కూల్చలేరు
- నిర్దేశిత నిబంధనలు పాటించాల్సిందే
- యూపీ సర్కారుపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- అధికారులపై చర్యలు తీసుకోవాలి
- బాధితుడికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలంటూ ధర్మాసనం ఆదేశాలు

12

హైడ్రా గురించి ఆందోళన వద్దు

- నిర్మాణ అనుమతులకు దానికి సంబంధం లేదు
- ఆక్రమణలను అడ్డుకోవడానికే హైడ్రా
- భవన నిర్మాణాలకు బ్యాంకులు అప్పులు ఇవ్వొచ్చు
- రియల్టర్లు, బ్యాంకర్లతో డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణాల కోసం రుణాలు మంజూరు చేసే క్రమంలో హైడ్రా గురించి బ్యాంకర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. భవన నిర్మాణాల అనుమతుల్లో హైడ్రాకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ, టౌన్ ప్లానింగ్ వంటి ప్రత్యేక విభాగాలు అన్ని అంశాలను పరిశీలించి నిర్మాణ అనుమతులిస్తాయని తెలిపారు. పార్కులు, కుంటలు, చెరువులను ఆక్రమించకుండా హైడ్రా పరిరక్షిస్తుందని చెప్పారు. హైడ్రా కారణంగా నిర్మాణాలకు అనుమతులు

మిగతా 2వ పేజీలో...


యాదగిరిగుట్ట కొండపైన దక్షిణ భాగంలోని ప్రాకార మండపం వెలుపల కుంగిన ఫ్లోరింగ్

యాదగిరిగుట్ట ఆలయంలో కుంగిన ఫ్లోరింగ్!

- దక్షిణ భాగం ప్రాకార మండప తిరువీధుల్లో ఘటన
- గుడిలో మరోసారి బయటపడ్డ నిర్మాణ లోపాలు
- మ్యాట్లు, ఇసుక, కట్టెలతో నిండిన ప్రాకార మండపం
- రిటైనింగ్ వాల్‌కు ఊడిన రాళ్లు

యాదాద్రి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తిరుపతిగా విరాజిల్లుతున్న యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణంలో నాణ్యతా లోపాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. ఆలయం దక్షిణ భాగంలోని తిరువీధుల్లో ప్రాకార మండపం వెలుపల ఉన్న ఫ్లోరింగ్ కుంగిపోయింది. 50 మీటర్ల మేర ఫ్లోరింగ్ రెండు అంగుళాల వరకు కుంగింది. దీంతో ప్రధానాలయానికి ఎటువంటి ప్రమాదం లేదని ఆలయ అధికారులు

మిగతా 14వ పేజీలో...



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న మంత్రి తుమ్మల

కొత్తగూడెం ఇంజనీరింగ్ కాలేజీని ఎర్త్ సైన్సెస్ వర్సిటీగా అప్‌గ్రేడ్ చేయండి

» మంత్రి తుమ్మల వినతి.. సీఎం సానుకూల స్పందన

ఖమ్మం, నవంబరు6(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కొత్తగూడెంలోని ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలను ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేయాలని సీఎం రేవంత్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో సీఎంను కలిసి వినతిపత్రం అందించారు. ఇంజనీరింగ్ కళాశాలను ఎర్త్ సైన్సెస్ యూనివర్శిటీగా మార్పు చేయడంతో పాటు యూజీ, మాస్టర్స్, పీహెచ్‌డీలలో భూగర్భశాస్త్రం, ఎన్విరాన్‌మెంటల్ సైన్సు, జియోఫిజిక్స్, జియోకెమిస్ట్రీ వంటి ప్రోగ్రాంలు అదనంగా చేర్చాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించిన సీఎం.. త్వరలోనే కళాశాలను వర్శిటీ ఆఫ్ ఎర్త్‌సైన్సెస్‌గా మారుస్తామని హామీ ఇచ్చినట్టు తుమ్మల తెలిపారు. కాగా, సీఎంఆర్‌ఎఫ్‌కు తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ లిమిటెడ్ పాలకవర్గం రూ.1.51కోట్లు ప్రకటించింది. సంబంధిత చెక్కును మంత్రి తుమ్మల సీఎంకు అందించారు.

కొలువుదీరిన టీటీడీ బోర్డు

» చైర్మన్‌గా బీఆర్ నాయుడు, 15 మంది సభ్యుల ప్రమాణం



శ్రీవారి ఆలయంలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న బీఆర్ నాయుడు

తిరుమల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానాల నూతన ధర్మకర్తల మండలి కొలువుదీరింది. టీటీడీ బోర్డు చైర్మన్‌గా బీఆర్ నాయుడుతో పాటు మరో 14 మంది సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. తొలుత ఆలయంలోని బంగారు వాకిలి వద్ద బీఆర్ నాయుడుతో ఈవో శ్యామలరావు ప్రమాణం చేయించారు. అనంతరం టీటీడీ బోర్డు సభ్యులుగా దేవదాయ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జంగా కృష్ణమూర్తి, మల్లెల రాజశేఖర గౌడ్, జాస్తి పూర్ణ సాంబశివరావు, ఎంఎస్ రాజు, నర్సిరెడ్డి, మహేందర్‌రెడ్డి, రంగశ్రీ, రామ్మూర్తి, ఆనంద్‌సాయి, జానకీదేవి, దర్శన్, శాంతారామ్, నరేష్‌కుమార్, అదిత్ దేశాయ్ ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో అదనపు ఈవో వెంకయ్య చౌదరి ప్రమాణం చేయించారు. బుధవారం సాయంత్రం తిరుమల అన్నమయ్య భవనంలో టీటీడీ బోర్డు సభ్యులు, సీనియర్ అధికారులతో తొలి సమావేశం, పరిచయ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం చైర్మన్ బీఆర్ నాయుడు మీడియాతో మాట్లాడారు. 'టీటీడీలో చాలా సవాళ్లు ఉన్నాయి. వాటన్నిటినీ అధిగమిస్తాం. శ్రీవారి ఆలయ పవిత్రతను కాపాడుకోవాలి. భక్తులకు మెరుగైన సౌకర్యాలపై నిర్ణయాలు తీసుకుంటాం' అని అన్నారు.

ఏపీ సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు: నర్సిరెడ్డి



శ్రీవారి ఆలయంలో కుటుంబ సభ్యులతో నర్సిరెడ్డి

హైదరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడిగా నన్నూరి నర్సిరెడ్డి బుధవారం ప్రమాణం చేశారు. కుటుంబసభ్యులతో తిరుమలకు వెళ్లిన నర్సిరెడ్డి తొలుత వరాహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ధ్వజస్తంభానికి మొక్కుకొని అంతరాలయంలోకి వెళ్లి ప్రమాణ స్వీకారం చేశారు. తనకు టీటీడీ బోర్డు సభ్యునిగా అవకాశం కల్పించిన ఏపీ సీఎం చంద్రబాబుకు నర్సిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

అరుణాచల ప్రదక్షిణకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

హైదరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా అరుణాచలేశ్వరుని గిరిప్రదక్షిణకు వెళ్లే భక్తుల కోసం రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల నుంచి టూర్ ప్యాకేజీ కింద ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్టు టీజీఎస్ ఆర్టీసీ అధికారులు బుధవారం తెలిపారు. ఈ ప్యాకేజీలో భాగంగా కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామితో పాటు వెల్లూరులోని గోల్డెన్ టెంపుల్‌ను సందర్శించే సౌకర్యాన్ని కల్పించినట్టు వివరించారు. నవంబరు 15న కార్తీక పౌర్ణమి కాగా 13వ తేదీ నుంచే ఆయా ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు బయలు దేరుతాయని తెలిపారు. అరుణాచల గిరిప్రదక్షిణ ప్యాకేజీని www.tgsrtcbus.inలో బుక్ చేసుకోవచ్చని, మరిన్ని వివరాలకు టీజీఎస్ ఆర్టీసీ కాల్‌సెంటర్ నంబర్లు 040-23450033, 040-69440000కు సంప్రదించాలని అధికారులు సూచించారు.

మూసీ వరదపై మళ్లీ అధ్యయనం

» ఆ తర్వాతే హద్దుల నిర్ధారణ.. నీటిపారుదల శాఖ నిర్ణయం

హైదరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మూసీ నది గరిష్ఠ వరదపై ఐఐటీ హైదరాబాద్ సహకారంతో మళ్లీ అధ్యయనం చేపట్టాలని నీటిపారుదల శాఖ నిర్ణయించింది. మూసీ నది వరదపై బుధవారం జలసౌధలో ఈఎన్‌సీ(జనరల్) అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఇటీవలే నీటిపారుదల శాఖలోని హైడ్రాలజీ విభాగం మాత్రం మూసీ గరిష్ఠ వరద 1.5 లక్షల క్యూసెక్కులే అని నివేదిక ఇచ్చింది. దీని ఆధారంగా జీవో జారీ చేయాలని మూసీ రివర్ ఫ్రంట్ అధికారులు కోరగా.. నీటిపారుదల శాఖ నిరాకరించింది. హైడ్రాలజీ విభాగం నివేదికను ఐఐటీ హైదరాబాద్ నిపుణుల సహకారంతో పునఃపరిశీలన చేయించిన తర్వాతే గరిష్ఠ వరదపై నిర్ధారణకు రావాలని అధికారులు అభిప్రాయపడ్డారు. ఏకాభిప్రాయం కుదిరాకే మూసీహద్దులు ఖరారు చేయాలని నిర్ణయించారు.

విచారణకు హాజరైన విజయ్ మద్దూరి

శంకర్‌పల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జన్వాడలోని కేటీఆర్ బావమరిది రాజ్‌పాకాల ఫాంహౌస్ పార్టీలో డ్రగ్స్ టెస్టులో పాజిటివ్ వచ్చిన విజయ్ మద్దూరి బుధవారం రంగారెడ్డి జిల్లా మోకిలా పోలీసుస్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. ఉదయం తన న్యాయవాదితో కలిసి వచ్చిన ఆయనను... నార్సింగి పోలీసులు సుమారు 3గంటల పాటు విచారించారు. ఈ సందర్భంగా... పార్టీలో కొకైన్ తీసుకున్నారా? ఫారిన్ లిక్కర్ ఎక్కడిది? రాడిసన్ హోటల్ డ్రగ్స్ కేసు నిందితుడు కేదారినాథ్‌తో సంబంధం ఏంటి? అని ప్రశ్నించినట్లు సమాచారం. తాను గత నెల 10-14 తేదీల్లో నెదర్లాండులో ఉండగా కొకైన్ తీసుకున్నానని, ఇక్కడ తీసుకోలేదని విజయ్ చెప్పినట్లు తెలిసింది. అలాగే కనిపించకుండా పోయిన సెల్‌ఫోన్ గురించి ఆరా తీయగా... అది ఆరోజే పోయిందని సమాధానమిచ్చినట్లు తెలుస్తోంది.

ఆ సంస్థలకు మాకు సంబంధం లేదు

» ఓం మండలి, విష్ణు పార్టీలపై బ్రహ్మకుమారీస్ ప్రకటన

హైదరాబాద్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బ్రహ్మకుమారీస్ సంస్థ, ప్రతినిధులపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారంపై ఆ సంస్థ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రజాపిత బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నుంచి బయటకు వెళ్లిన కొందరు సొంత సంస్థలు నెలకొల్పి అనైతిక, అసాంఘిక విధానాలతో నిర్వహిస్తున్నారని తెలిపింది. ముఖ్యంగా వీరేంద్ర దీక్షిత్ అనే వ్యక్తి శంకర్ పార్టీని స్థాపించారని, ఢిల్లీ కేంద్రంగా మరికొందరు కూడా బ్రహ్మకుమారీలకు విరుద్ధంగా సంస్థలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. వీటిల్లో రాయ్‌పూర్‌లోని ఓం మండలి, గుజరాత్‌లోని విష్ణుపార్టీలకు తమకు ఏ సంబంధం లేదని స్పష్టం చేసింది. దాదా లేఖరాజ్ 1937లో బ్రహ్మకుమారీస్ సంస్థను ప్రారంభించారని, రాజస్థాన్‌లోని మౌంట్ అబూ కేంద్రంగా తమ సంస్థ పని చేస్తోందని వెల్లడించింది.

సుంకిశాలపై కేటీఆర్ ఆరోపణలు అవాస్తవం

» గోడ కూలిన ఘటనపై విజిలెన్స్ నివేదిక తర్వాత చర్యలు

» హైదరాబాద్‌కు నీళ్లు.. అంచనాలే రూపొందించలేదు: జలమండలి

హైదరాబాద్ సిటీ, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): సుంకిశాల ప్రాజెక్టు గోడ కూలిన ఘటనతోపాటు హైదరాబాద్ నగరానికి గోదావరి జలాలు తీసుకొచ్చే ఫేజ్-2 ప్రాజెక్టులపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు అవాస్తవాలని జలమండలి పేర్కొంది. కేటీఆర్ వ్యాఖ్యల నేపథ్యంలో బుధవారం ఓ వివరణ ఇచ్చింది. సుంకిశాల గోడ కూలిన ఘటనపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం విచారణ చేపట్టిందని, విచారణ పూర్తయిన తర్వాత ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని జలమండలి స్పష్టం చేసింది. కొండపోచమ్మ సాగర్ నుంచి గోదావరి నీళ్లను హైదరాబాద్ తెచ్చేందుకు రూ.1100కోట్లతో తాము అన్నీ సిద్ధం చేయగా.. దానిని రూ.5,500 కోట్లకు పెంచారని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను జలమండలి తప్పుబట్టింది. దీనికి సంబంధించి.. ఇప్పటిదాకా అంచనాలే రూపొందించలేదని స్పష్టం చేసింది. హిమాయత్ సాగర్, ఉస్మాన్‌సాగర్ పునరుజ్జీవానికి.. మల్లన్నసాగర్ నుంచి నీళ్లు తీసుకురావడానికి గోదావరి ఫేజ్-2 పథకం రూపకల్పన చేశామని తెలిపింది.

14న రెండో విడత సమీకృత గురుకులాల శంకుస్థాపన

హైదరాబాద్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమీకృత గురుకుల పాఠశాలలను (ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్) రెండో విడతలో మరికొన్ని నియోజకవర్గాలకు మంజూరు చేయబోతున్నట్టు సీఎం రేవంత్ ప్రకటించారు. నవంబరు-14న చాచా నెహ్రూ జయంతి సందర్భంగా రెండో విడత నిర్మాణ పనులు చేపడతామన్నారు. తొలివిడతలో మంజూరు చేసిన పాఠశాలల నిర్మాణాలు వచ్చే విద్యా సంవత్సరంలోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థినీ విద్యార్థుల డైట్, కాస్మెటిక్ చార్జీలను ప్రభుత్వం పెంచిన నేపథ్యంలో ఖమ్మం జిల్లా వైరా, మధిర నియోజకవర్గాల నుంచి నుంచి వచ్చిన విద్యార్థులు బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం వారితో ముఖాముఖి మాట్లాడారు. ఉపాధి అందించే నాణ్యమైన విద్యను అందించే దిశగా ప్రభుత్వం ఇప్పటికే అనేక చర్యలు తీసుకుందని వివరించారు. అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే 11,062 టీచర్ పోస్టులు భర్తీ చేశామని, 21 వేల మంది టీచర్లకు పదోన్నతులు కల్పించామన్నారు.

స్కిల్స్ వర్సిటీ ఏర్పాటు అందుకే!

విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని సీఎం చెప్పారు. ఐటీఐలను ఏటీసీలుగా మార్పు చేశామన్నారు. ఒలింపిక్స్ క్రీడలు లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని విద్యార్థులను ఉద్దేశించి సీఎం కోరారు.



టార్గెట్ కేటీఆర్!

(మొదటిపేజీ తరువాయి)

ఔననే చెబుతున్నాయి. కాగా, ఫార్ములా-ఈ రేస్‌తో హైదరాబాద్‌కు అంతర్జాతీయ బ్రాండింగ్ వస్తుందని గత ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేసింది. పెట్టుబడులు, అంతర్జాతీయ పర్యాటకం పెరుగుతుందని పేర్కొంది. 2023లో తొలిసారి రేస్ నిర్వహించిన ప్రభుత్వం.. 2024లో మరోసారి నిర్వహణకు విదేశీ సంస్థలతో రూ.100 కోట్లతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ క్రమంలో ముందస్తుగా రూ.55 కోట్లను రేస్ నిర్వహణలో నోడల్ ఏజెన్సీగా వ్యవహరించిన మునిసిపల్ శాఖ ద్వారా చెల్లించింది. గత ఏడాది డిసెంబరులో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. తొలినాళ్లలోనే ఈ వ్యవహారంలో అక్రమాలు జరిగినట్లు గుర్తించింది. దాంతో.. ఫార్ములా-ఈ రేసింగ్‌కు సంబంధించి విదేశీ కంపెనీలతో ఉన్న ఒప్పందాలను రద్దుచేసుకుంది. ఆ తర్వాత ప్రభుత్వ ఆదేశాలతో మునిసిపల్ శాఖ ఈ వ్యవహారంపై ఏసీబీకి ఫిర్యాదు చేయడం.. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయడానికి ఏసీబీ అధికారులు ప్రభుత్వ అనుమతి కోరడం.. సర్కారు ఓకే చెప్పడం చకచకా జరిగిపోయాయి. రంగంలోకి దిగిన ఏసీబీ.. రెగ్యులర్ ఎంక్వైరీ(ఆర్‌ఈ)ని మొదలుపెట్టి, ఈ కేసుకు సంబంధించిన పత్రాలను, ఇతర భౌతిక, సాంకేతిక ఆధారాలను సేకరించింది. అయినా.. కేసు ఏ స్థాయిలోనూ వీగిపోకుండా ఉండేందుకు న్యాయ నిపుణుల సలహాలను తీసుకుంటోంది. విదేశీ సంస్థలకు కూడా నోటీసులు జారీ చేసి, ప్రశ్నించేందుకు న్యాయపరంగా ఉన్న అడ్డంకులను పరిశీలిస్తోంది.

గవర్నర్ అనుమతి కూడా..

సాధారణంగా.. శాసన సభ సమావేశాలు జరుగుతున్నప్పుడు సభాహక్కుల కారణంగా ఎమ్మెల్యేలను దర్యాప్తు సంస్థలు విచారించడం కుదరదు. స్పీకర్ అనుమతి అవసరం ఉంటుంది. అయితే.. ఇతర సమయాల్లో ఎమ్మెల్యేను విచారించడానికి గవర్నర్, స్పీకర్ అనుమతులు అవసరం లేదు. అయినా.. న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు గవర్నర్ అనుమతికి ఏసీబీ అధికారులు ప్రయత్నిస్తున్నారు. గవర్నర్ అనుమతి రాగానే.. ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి, ఎమ్మెల్యే కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసి, విచారించేందుకు సిద్ధమవుతున్నారు. కేటీఆర్ ఇచ్చే వాంగ్మూలం(స్టేట్‌మెంట్) మేరకు తదుపరి చర్యలకు ఉపక్రమించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

అర్వింద్‌కుమార్ వివరణతోనే..

నిబంధనల ప్రకారం ప్రభుత్వం విదేశీ సంస్థకు నగదు చెల్లించాలంటే.. ఆర్థిక శాఖ ముందస్తు అనుమతి తప్పనిసరి. ఫార్ములా-ఈ వ్యవహారంలో అందుకు భిన్నంగా రూ.55 కోట్ల చెల్లింపులు జరపడంపై సీఎస్ శాంతికుమారి అప్పటి మునిసిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్‌కుమార్‌కు మెమో జారీ చేశారు. దానికి అర్వింద్‌కుమార్ వివరణ ఇస్తూ.. "అప్పటి మంత్రి కేటీఆర్ మౌఖిక ఆదేశాల మేరకే విదేశీ సంస్థలకు చెల్లింపులు చేశాం" అని పేర్కొన్నారు. దీని ఆధారంగా కేటీఆర్‌కు నోటీసులు జారీ చేయాలని ఏసీబీ నిర్ణయించింది. కేటీఆర్ వాంగ్మూలం ఇచ్చిన తర్వాత.. రోజుల వ్యవధిలోనే అరెస్టు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. కేటీఆర్ కూడా ఎప్పటికప్పుడు తాను అరెస్టు కావడం ఖాయమని, అందుకు ఏ మాత్రం భయపడేది లేదని చెబుతున్నారు. మంత్రులు సైతం బాంబులు పేలుతాయని ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో ఏసీబీ చర్యలు అత్యంత కీలకంగా మారుతాయని తెలుస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో జరిగిన ఫార్ములా-ఈ రేస్‌కు అదే స్థాయిలో ప్రచారం కల్పించేందుకు గత ప్రభుత్వం పెద్దమొత్తంలో నిధులను ఖర్చు చేసింది. సినీ, క్రీడా ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని, ప్రమోషన్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఎవరెవరికి ఎంత ఇచ్చారనే వివరాలను రాబట్టాలని ఏసీబీ నిర్ణయించింది. ఆ తర్వాత సెలబ్రిటీలను విచారించి, వారి వాంగ్మూలాలను సేకరించే అవకాశాలున్నాయి. అంతేకాదు.. విదేశీ కంపెనీలకు నిధులు అందజేయడంలో ఎవరైనా కమీషన్లు తీసుకున్నారా? డబ్బులు ఎలా చేతులు మారాయి? అనే కోణంపైనా ఏసీబీ దృష్టి సారించింది.

గవర్నర్‌తో సీఎం రేవంత్ భేటీ!



సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం సాయంత్రం కొత్త ఆర్వోఆర్ ముసాయిదాపై సచివాలయంలో కీలక సమీక్ష నిర్వహించాల్సి ఉండగా.. ఆ కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్నారు. సాయంత్రం 7 గంటల సమయంలో రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ శర్మతో అరగంటపైగా భేటీ అయ్యారు. ఫార్ములా-ఈ వ్యవహారం, అందులో కేటీఆర్ పాత్రపై ఆయనకు సీఎం వివరించినట్లు తెలుస్తోంది. అయితే.. అధికారిక వర్గాలు మాత్రం.. బుధవారం నుంచి ప్రారంభమైన కులగణన తీరును గవర్నర్‌కు వివరించేందుకే సీఎం రాజ్‌భవన్ వెళ్లినట్లు చెబుతున్నాయి. 2025లో దేశవ్యాప్తంగా జరగనున్న జనగణనలోనూ ఈ సర్వేను పరిగణలోకి తీసుకునే అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని కోరినట్లు పేర్కొన్నాయి. అదేవిధంగా తన సోదరుడి కుమార్తె వివాహానికి సీఎం రేవంత్‌రెడ్డి గవర్నర్‌ను ఆహ్వానించారు.

హైడ్రా గురించి ఆందోళన వద్దు

(మొదటిపేజీ తరువాయి)



రావన్న ఆందోళన బ్యాంకర్లకు అవసరం లేదని వివరించారు. ప్రజా భవన్‌లో బుధవారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బ్యాంకర్లు, రియల్టర్లు, బిల్డర్ల సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. స్వయం సహాయక సంఘాలకు ఈ ఏడాది వడ్డీ లేకుండా రూ.20 వేల కోట్ల రుణాలు ఇవ్వాలని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించిందన్నారు. వీలైతే అంతకుమించి రుణాలు ఇస్తామన్నారు. స్వయం సహాయక సంఘాలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు బ్యాంకులు వేగంగా రుణాలు మంజూరు చేయాలని, నిబంధనలను సులభతరం చేయాలని కోరారు. స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే రుణాల రికవరీ 98 శాతంగా ఉందని, రిస్కు తక్కువగా ఉన్నందున ఈ సంఘాలకు వడ్డీని తగ్గించి, ఎక్కువ మొత్తంలో రుణాలు ఇవ్వాలని సూచించారు. కాగా, ప్రతి నియోజకవర్గంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామిక(ఎంఎస్‌ఎంఈ) పార్కులను ఏర్పాటు చేస్తున్నామని, వీటిలో మహిళలకు ప్రత్యేక అవకాశాలు కల్పించనున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, మహిళా సంఘాలకు రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకర్లు విశాల దృక్పథంతో వ్యవహరించాలన్నారు. ప్రభుత్వమే బస్సులను కొనుగోలు చేసి మహిళా సంఘాలకు లీజుకివ్వాలన్న ఆలోచన ఉందని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. మరోవైపు, గిరిజన ప్రాంత సంఘాలు తీసుకున్న దాదాపు రూ.200 కోట్ల వరకు రుణాలను చెల్లించలేని స్థితిలో ఆ సంఘాలు ఉన్నాయన్నారు. వీటిని మాఫీ చేయడం లేదంటే వన్ టైమ్ సెటిల్‌మెంట్ అవకాశమివ్వడం వంటి అంశాలను పరిశీలించాలన్నారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి దాన కిశోర్, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌పై హైకోర్టు అజమాయిషీ చెల్లదు

(మొదటిపేజీ తరువాయి)

సవాల్ చేస్తూ అసెంబ్లీ కార్యదర్శి దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్లలో.. అసెంబ్లీ కార్యదర్శికి ప్రభుత్వం (శాసనసభ వ్యవహారాల శాఖ) మద్దతు తెలిపింది. విచారణకు నాలుగు వారాల్లో షెడ్యూల్ ఇవ్వాలని, ఆ పిటిషన్‌లను స్పీకర్ ఎదుట ఉంచాలని సింగిల్ జడ్జి తీర్పు ఇవ్వడం, ఆలోగా విచారణ ప్రారంభించకపోతే తాము సుమోటోగా కేసును తిరిగి ఓపెన్ చేస్తామనడాన్ని ప్రభుత్వం తప్పుబట్టింది. అసెంబ్లీ కార్యదర్శి అప్పీళ్లపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావు ధర్మాసనం బుధవారం విచారణ కొనసాగించింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది రవీంద్ర శ్రీవాస్తవ వాదనలు వినిపించారు. "రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ కింద విశేషాధికారాలు చెలాయించే స్పీకర్.. హైకోర్టుకు సబార్డినేట్ కాదు. ఎప్పుడు షెడ్యూల్ ఇవ్వాలి, ఎప్పుడు విచారణ చేపట్టాలి అనే అంశాలన్నీ స్పీకర్‌కు ఉన్న విచక్షణాధికారాలు. ఇందులో హైకోర్టు జోక్యం చేసుకోవడానికి వీలుండదు. సింగిల్ జడ్జి బెదిరింపు ధోరణిలో తీర్పు ఇచ్చారు. ఇచ్చిన గడువులో విచారణ ప్రారంభించకపోతే ఉరి తీస్తా అన్నట్లుగా ఆదేశాలున్నాయి. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌ల విచారణ షెడ్యూల్‌ను హైకోర్టు రిజిస్ట్రార్‌కు ఎందుకివ్వాలి? నెలరోజుల్లో తేల్చాలని తహసీల్దార్‌కు, ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చినట్లు స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వడం చెల్లదు. స్పీకర్‌కు నిరంతర ఆదేశాలు ఇస్తాం.. స్పీకర్‌పై నిరంతర నిఘా పెడతాం అంటే కుదరదు. సింగిల్ జడ్జి తన అధికార పరిధికి మించి స్పీకర్ విచక్షణాధికారాల్లో జోక్యం చేసుకున్నారు. అనర్హత పిటిషన్‌లపై స్పీకర్ తుది తీర్పు ప్రకటించే వరకు న్యాయసమీక్షకు అసలు అవకాశం లేదు. స్పీకర్ తుది తీర్పు ఇచ్చిన తర్వాత కూడా పరిమితంగానే న్యాయసమీక్షకు అవకాశం ఉంది. అది కూడా పునరుద్ధరించలేని విధంగా నష్టం జరుగుతున్న సందర్భంలో మాత్రమే కోర్టులు జోక్యం చేసుకోవాలి. ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడం లేదా సస్పెండ్ చేయడం అనే రెండు సందర్భాల్లో మాత్రమే కోర్టులు జోక్యం చేసుకోగలవు" అని రవీంద్ర శ్రీవాస్తవ పేర్కొన్నారు.

న్యాయసమీక్షకు పరిమిత అవకాశాలే..

పార్టీ మారిన ఎమ్మెల్యే దానం నాగేందర్ తరఫున సీనియర్ న్యాయవాది పి.శ్రీరఘురాం వాదనలు వినిపిస్తూ.. 1992 వరకు స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా ఎలాంటి న్యాయసమీక్షకు అవకాశం ఉండేది కాదన్నారు. స్పీకర్ అధికారాలపై న్యాయసమీక్ష అనే భావన కూడా లేదని తెలిపారు. కిహోటో హోలోహన్ కేసులో ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ఇచ్చిన తర్వాతే స్పీకర్ అధికారాలపై న్యాయసమీక్షకు అత్యంత పరిమిత స్థాయిలో విండో ఓపెన్ అయిందని పేర్కొన్నారు. అది కూడా స్పీకర్ తుది తీర్పు ప్రకటించిన తర్వాత మాత్రమే సమీక్షకు అవకాశం దొరికిందన్నారు. "కిహోటో హోలోహన్ తీర్పును మళ్లీ నిర్వచిస్తూ ముగ్గురు సభ్యులు కలిగిన సుప్రీంకోర్టు సాధారణ ధర్మాసనం ఇచ్చిన కైశం మేఘాచంద్రసింగ్ తీర్పుపై ఆధారపడటం ప్రామాణికం కాదు. ఈ తీర్పు ప్రత్యేక సందర్భంలో ఆర్టికల్ 142 కింద సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు. దానికి ప్రామాణికత ఉండదు" అని శ్రీరఘురాం పేర్కొన్నారు. పార్టీ మారిన మరో ఎమ్మెల్యే కడియం శ్రీహరి తరఫున సీనియర్ న్యాయవాది మయూర్‌రెడ్డి వాదనలు ప్రారంభమైనప్పటికీ సమయం మించిపోవడంతో విచారణ గురువారానికి వాయిదా పడింది.



సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

నిద్రమత్తు వీడి రోడ్లను బాగు చేయండి

» రెండేళ్లలో 'మామునూరు' పూర్తవ్వాలి

» టిమ్స్ నిర్మాణంలోనూ అలసత్వమేనా ?

» సమీక్షలో మంత్రి కోమటిరెడ్డి అసహనం

హైదరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రహదారులు సరిగ్గా లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఎస్టిమేషన్లు, టెండర్లని కాలం వెల్లదీస్తున్నారంటూ ఆర్ అండ్ బీ అధికారుల తీరుపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు నిద్రమత్తు వదిలి వెంటనే రహదారుల మరమ్మతు పనులు పూర్తి చేయించాలని ఆదేశించారు. ఆర్ అండ్ బీ శాఖ అధికారులతో మంత్రి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పక్క రాష్ట్రాల్లో ఆధునిక యంత్రాలతో రహదారుల మరమ్మతులు చేస్తోంటే.. అభివృద్ధి చెందిన తెలంగాణలో ఇంకా పాత పద్ధతుల్లో పనులు చేయించడమేంటని ప్రశ్నించారు. రూ.500 కోట్లు ఖర్చు చేస్తే దాదాపు రూ.5వేల కోట్ల విలువైన రహదారుల మరమ్మతులు పూర్తవుతాయని తెలిసినా ఆ దిశగా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని చీఫ్ ఇంజనీర్ మోహన్ నాయక్‌ను ప్రశ్నించారు. ఇంజనీర్లు ఎమ్మెల్యేల ఇళ్ల చుట్టూ తిరుగుతూ కొత్త రహదారుల ప్రతిపాదనలు తయారు చేసే కన్సల్టెంట్లుగా మారారని అసహనం వ్యక్తం చేశారు. ఇటీవల మంత్రివర్గ సమావేశంలో చర్చించిన పీపీపీ మోడల్ రోడ్ల కోసం ప్రశ్నించగా 1787.06 కిలోమీటర్ల మేర 20 రోడ్లను గుర్తించామని అధికారులు చెప్పారు. ఇక, వరంగల్ జిల్లాలోని మామునూరు విమానాశ్రయ నిర్మాణ పనులను రెండేళ్లలో పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పనుల పురోగతిపై 15 రోజులకొకసారి సమీక్ష ఉంటుందని చెప్పారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్‌ను ఉడాన్ స్కీంతో అనుసంధానం చేసి ఇతర పట్టణాలతో రాకపోకలకు అనువుగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కాగా, టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణ పనుల్లో అలసత్వంపై మంత్రి కోమటిరెడ్డి అసహనం వ్యక్తం చేశారు. 2025 జూలై నాటికి ఆస్పత్రులు అందుబాటులోకి రావాలని స్పష్టం చేశారు. నిమ్స్ విస్తరణ భవన నిర్మాణ పనులు కూడా నత్తనడకన జరగడమేంటని ప్రశ్నించారు. అలాగే, భవన నిర్మాణంలో నాణ్యతపై మాట్లాడుతూ.. తన కుర్చీ కింద ఉన్న టైల్స్ మధ్య ఏర్పడిన ఖాళీలను చూపించి ఇదేమిటి అని అధికారులను నిలదీశారు. కాగా, ఒక్కో అధికారికి రెండు, మూడు అదనపు బాధ్యతలు ఉన్నాయని, పదోన్నతులు ఇస్తే పని భారం తగ్గుతుందని ఈఎన్‌సీ మధుసూదన్ రెడ్డి ఈ సందర్భంగా మంత్రిని అడిగారు. ఇందుకు మంత్రి కోమటిరెడ్డి స్పందిస్తూ... హక్కుల కోసం మాట్లాడేటప్పుడు బాధ్యతలు కూడా సక్రమంగా నిర్వర్తించాలని సున్నితంగా హెచ్చరించారు.

గ్రీన్ ఫార్మా సిటీలో భారీ పెట్టుబడులు

» ముందుకొచ్చిన డాక్టర్ రెడ్డీస్, హెటెరో, అరబిందో, ఎంఎస్ఎన్, లారస్

» ఒక్కోటి 50 ఎకరాల్లో ప్రారంభించేలా ప్రతిపాదనలు

» ప్రతినిధులతో మంత్రి శ్రీధర్‌బాబు భేటీ



టీహబ్-డెన్సో కంపెనీ ఎంవోయూ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీలో పెట్టుబడులు పెట్టేందుకు ఫార్మా రంగంలోని దిగ్గజ కంపెనీలు ముందుకువచ్చాయి. ఇందులో డాక్టర్ రెడ్డీస్, అరబిందో, హెటెరో, ఎంఎస్ఎన్, లారస్ కంపెనీలున్నాయి. అయితే విస్తరణలో భాగంగా భారీ పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీలు సంసిద్ధత వ్యక్తం చేసినా.. పెట్టుబడుల వివరాలను వెల్లడించలేదు. ఆయా సంస్థల ప్రతినిధులతో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బుధవారం సచివాలయంలో సమావేశమయ్యారు. గ్రీన్ ఫార్మా సిటీకి సంబంధించిన ప్రణాళికను మంత్రి వివరించగా.. వారు తమ ప్రతిపాదనలను ఆయన ముందుంచారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రీన్ ఫార్మా సిటీలో యుద్ధ ప్రాతిపదికన మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేసి ఏడాదిలోపు పరిశ్రమల నిర్మాణానికి ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్టు వెల్లడించారు. ఐదు కంపెనీలు ఫార్మా సిటీలో భారీ పెట్టుబడులు పెట్టడానికి సంసిద్ధత వ్యక్తం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనల మేరకు ఏర్పాటు కానున్న ఫ్యూచర్ సిటీలో ఫార్మా నగరం కూడా భాగంగా ఉంటుందని తెలిపారు. తొలి దశలో ఒక్కో కంపెనీ 50 ఎకరాల స్థలంలో పరిశ్రమ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించినట్టు వెల్లడించారు. గ్రీన్ ఫార్మా సిటీకి మంచినీరు, విద్యుత్తు సరఫరా ఇప్పటికే ప్రారంభమైనట్టు చెప్పారు. కొంగరకలాన్ నుంచి రీజినల్ రింగ్ రోడ్ వరకు 300 అడుగుల వెడల్పుతో ప్రపంచ స్థాయి రహదారి నిర్మించనున్నామని.. వచ్చే జూన్ నాటికి ఈ రోడ్డు టెండర్ల ప్రక్రియ పూర్తవుతుందన్నారు. భారీ ఫార్మా పరిశ్రమల కోసం లాజిస్టిక్స్ పార్క్, ప్యాకేజింగ్ పార్క్, కార్మికుల కోసం డార్మిటరీలు నిర్మిస్తామన్నారు. ప్రతి పరిశ్రమ ప్రత్యేకంగా బాయిలర్లు ఏర్పాటు చేయనవసరం లేకుండా పైపుల ద్వారా వేడి నీటి ఆవిరి (స్టీమ్) అందించే విషయాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. త్వరలో పరిశ్రమల విద్యుత్తు విధానాన్ని ప్రకటించనున్నట్టు వెల్లడించారు. సమావేశంలో టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, పరిశ్రమల శాఖ డైరెక్టర్ మల్సూర్ కూడా పాల్గొన్నారు.

'డెన్సో' రాకతో వాహనాల పరిశ్రమకు ఊతం

జపాన్‌కు చెందిన వాహనాల విడిభాగాల తయారీ సంస్థ డెన్సో టీహబ్‌తో మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. డెన్సో లాంటి అగ్రగామి సంస్థల రాకతో రాష్ట్రం వాహనాల తయారీ రంగంలో సుస్థిర ఆవిష్కరణలతో మరింత ముందుకు దూసుకుపోతుందన్నారు. రాష్ట్రంలోని ఆటోమోటివ్ డిజైన్, చిప్‌ల తయారీ, సెన్సార్ ఇంజనీరింగ్ సంస్థలు ఆటోమోటివ్ రంగ అభివృద్ధికి ఇతోధికంగా తోడ్పతాయని చెప్పారు. మహీంద్రా అండ్ మహీంద్రా, భారత్ ఫోర్జ్, ఎక్సైడ్, అమర రాజా బ్యాటరీస్ వంటి దిగ్గజ సంస్థలు అత్యాధునిక ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పడం ద్వారా, సంప్రదాయ ఆటోమోటివ్ కాంపోనెంట్స్, నూతన ఎలక్ట్రిక్ వాహన సాంకేతికతలకు తెలంగాణ కేంద్రంగా మారిందని వెల్లడించారు. కార్యక్రమంలో డెన్సో భారత ప్రాంతీయ సీఈవో యశుహిరో లిడా, డైరెక్టర్ ఎయిజీ సోబుయే, టీహబ్ సీఈవో సుజిత్ జాగీర్దార్ తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వే ప్రారంభించిన మంత్రి..

రంగారెడ్డి జిల్లా శంకరపల్లిలో సమగ్ర కులగణన సర్వేను ఆ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సర్వేతో రాష్ట్రంలోని కుటుంబాల సమగ్ర వివరాలు తెలుస్తాయని, సంక్షేమ పథకాలు మరింత పకడ్బందీగా అమలు చేయవచ్చని వెల్లడించారు. అంతకుముందు శంకర్‌పల్లి హనుమాన్ ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అప్పు తీర్చకుంటే భార్యాకూతుళ్లను వివస్త్రలను చేస్తాం

- వడ్డీ వ్యాపారుల వేధింపులతో గోదావరిలో దూకిన కుటుంబం
- తండ్రీకూతురు మృతి.. తల్లిని కాపాడిన స్థానికులు.. మృతులది నిజామాబాద్


వేణు, పూర్ణిమ (ఫైల్)

బాసర/ఖిల్లా (నిజామాబాద్), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): 'తీసుకున్న అప్పు వడ్డీతో సహా చెల్లించకుంటే నీ భార్య కూతురిని విడిచిపెట్టం.. అందరిలో వివస్త్రలను చేస్తాం' అంటూ వడ్డీ వ్యాపారులు బెదిరింపులకు దిగడంతో ఓ కుటుంబం గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటనలో తండ్రీకూతురు మరణించగా.. తల్లిని స్థానికులు కాపాడారు. బాధితురాలి కథనం మేరకు.. నిజామాబాద్ న్యాల్‌కల్‌రోడ్డులో ఉప్పు లంచి వేణు (50) భార్య అనురాధ, కూతురు పూర్ణిమ (24)తో కలిసి నివాసముంటున్నాడు. అక్కడి గంజ్‌లోనే వేణు చిరు వ్యాపా రం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. అయితే వ్యాపార నిమిత్తం స్థానిక వడ్డీ వ్యాపారులు రోషన్, వికాస్ వద్ద రెండేళ్ల కింద రూ.3 లక్షల అప్పు తీసుకున్నాడు. ఈ మొత్తానికి వడ్డీతో సహా అసలు చాలావరకు వేణు చెల్లించాడు. అయితే దాన్నంతా వడ్డీ, చక్రవడ్డీల కింద జమ చేసుకున్న వ్యాపారులు.. అప్పు తీరలేదంటూ వడ్డీతో కలిపి ఇవ్వాలంటూ వేధించసాగారు. ఇవ్వకుంటే భార్యాకూతుళ్లను అందరిలో వివస్త్రలను చేస్తామని హెచ్చరించారు. వ్యాపారంలో నష్టాలు.. వడ్డీ వ్యాపారుల వేధింపులు.. తీవ్ర మనస్తాపం చెందిన వేణు కుటుంబ సభ్యులు.. నిర్మల్ జిల్లాలోని బాసరవద్ద గోదావరిలో దూకారు. స్థానిక జాలరులు.. వారిని కాపాడే ప్రయత్నం చేశారు. అయితే వేణు, పూర్ణిమ అందులో గల్లంతవ్వగా.. అనురాధను అతి కష్టమ్మీద రక్షించారు. చివరకు వేణు మృతదేహం లభించగా.. పూర్ణిమ మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అనురాధను చికిత్స నిమిత్తం భైంసా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు బాసర ఎస్సై గణేశ్ తెలిపారు.

ఏసీ మిర్చి ధరల పతనం

- క్వింటాలుకు రూ.3,000 డౌన్

ఖమ్మం మార్కెట్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో తేజ రకం ఏసీ మిర్చి ధరలు రోజురోజుకి పడిపోతున్నాయి. రెండు, మూడు నెలల క్రితం క్వింటాలు రూ.20,000 పలికిన ధర ప్రస్తుతం రూ.15,000కు చేరింది. మూడు వారాల్లోనే ధరలు రూ.3000 మేర పతనమయ్యాయి. ఖమ్మం మార్కెట్‌లో క్వింటాలు ఏసీ మిర్చికి బుధవారం రూ.18,000 జెండా పాట నిర్ణయించగా వ్యాపారులు సరుకు నాణ్యత బట్టి క్వింటాలు రూ.9,000 నుంచి రూ.15,000 వరకు చెల్లించి కొనుగోళ్లు చేశారు. అంతేకాక గత ఖరీఫ్ సీజన్ (వానాకాలం) సాధారణ(నాన్ ఏసీ)రకం తేజ రకం మిరప పంట కూడా కొద్ది మొత్తంలో మార్కెట్‌కు వస్తోంది. ఆయా రకాలకు కూడా నాణ్యతనుబట్టి క్వింటాలుకు రూ.6,500 నుంచి రూ.15,000 వరకు ఇస్తున్నారు. మూడేళ్ల క్రితం కరోనా సమయంలో ఏసీ మిర్చి క్వింటాలుకు రూ.25,500 రికార్డు ధర పలికింది. ఆ తర్వాత ధరలు నెమ్మదిగా తగ్గుతూ వస్తున్నాయి. చైనా, సింగపూర్, మలేషియా, థాయ్‌లాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్ తదితర దేశాలకు తేజ రకం ఏసీ మిర్చి ఎగుమతులు నిలిచిపోవడం వల్లే ధరలు తగ్గుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

రూ.16,299 పలికిన కొత్త మిర్చి

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం వచ్చిన వానాకాలం(ఖరీఫ్) సీజన్ తేజరకం కొత్త మిర్చి క్వింటాల్‌కు రూ.16,299 ధర పలికింది. కూసుమంచి మండలం గుర్వాయిగూడెం రైతు రెండు బస్తాల తేజ మిర్చిని తీసుకురాగా వ్యాపారులు కొనుగోళ్లు ప్రారంభించారు.

నల్లగొండ జిల్లాలో పత్తి రైతుల ధర్నా

చండూరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోళ్లలో సీసీఐ నిర్వాహకులు తమను ఇబ్బంది పెడుతున్నారంటూ నల్లగొండ జిల్లా చండూరు మండలం బంగారిగడ్డలోని మంజిత్ పత్తి మిల్లు ఎదుట పత్తి రైతులు బుధవారం ధర్నా చేశారు. 18 మంది రైతులు ట్రాక్టర్లలో పత్తిని సీసీఐ కేంద్రానికి తీసుకురాగా 18శాతం తేమ ఉందని 15 ట్రాక్టర్లలోని పత్తి కొనుగోలుకు అధికారులు నిరాకరించారు. దీంతో ఆందోళనకు దిగారు.

సచివాలయంలో వాస్తు మార్పులు!

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన మహా ద్వారాన్ని ఈశాన్యం వైపు మార్చుతుండగా, ఇకపై ఆ గేటు ద్వారానే సీఎం రేవంత్‌రెడ్డి రాకపోకలు సాగేలా ప్రణాళికలు రచిస్తున్నారు. వాస్తవానికి ఈ ఏడాది జూన్‌లోనే సచివాలయ ప్రధాన మహాద్వారాన్ని మూసివేయడం తోపాటు ఆ మార్గం గుండా ఎలాంటి రాకపోకలు జరపడం లేదు. ఆ ద్వారాలు తెరుచుకోకుండా మూడు స్టెప్పుల మేర ఇనుప తీగలు చుట్టారు. అయితే ప్రస్తుతం తూర్పు వైపు ఉన్న ప్రధాన ద్వారం.. సచివాలయ నిర్మాణం సమయంలో సూచించిన విధంగా వాస్తు ప్రకారం జరగలేదనే చర్చ ఉంది. ఈ క్రమంలోనే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన కొంతకాలానికే ఈ ప్రధాన మహా ద్వారాన్ని మూసి వేసింది. ఇప్పుడు ఏకంగా ఆ ద్వారాన్ని అక్కడి నుంచి మార్చి ఈశాన్యం వైపున ఏర్పాటు చేస్తున్నారు. దాదాపు 27అడుగుల ఎత్తు, అంతే వెడల్పు ఉండేలా ఈ గేటును ఏర్పాటు చేయనున్నట్టు తెలిసింది. ప్రస్తుత ప్రధాన మహాద్వారం ఉన్న స్థలంలో ఇనుపరాడ్లతో రైలింగ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ప్రధాన ద్వారం ఈశాన్యం వైపునకు జరుగుతుండడంతో మూడో గేటు నుంచి ఈ ప్రధాన ద్వారంవైపు నేరుగా వచ్చేందుకు అవకాశం ఏర్పడనుంది. ప్రధాన మహా ద్వారం మార్పు, రెండో గేటు నుంచి నాలుగో గేటు వరకు నిర్మించే రహదారి నిర్మాణ పనులకు ఇప్పటికే టెండర్లు ఆహ్వానించగా.. దాదాపు రూ.3.20కోట్లతో చేపడుతున్నారు. వాస్తు మార్పుల నేపథ్యంలో సచివాలయానికి ముఖ్యమంత్రి వచ్చి, వెళ్లే మార్గం మారనుంది.


సచివాలయంలో జరుగుతున్న పనులు

వడివడిగా తెలంగాణ తల్లి విగ్రహ నిర్మాణం

- రూ.1.16 కోట్లతో 20 అడుగుల ఎత్తైన విగ్రహం

హైదరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ పనులు వడివడిగా సాగుతున్నాయి. 20 అడుగుల ఎత్తైన విగ్రహ నిర్మాణం కోసం రూ.1.16కోట్లను వెచ్చిస్తున్నారు. డిసెంబరు 9న ఆవిష్కరించేందుకు వీలుగా విగ్రహ నిర్మాణ పనులు చేపడుతున్నారు. విగ్రహం సమీపంలో వాటర్ ఫౌంటేన్, గ్రీనరీ, రోడ్లు, ఇతర పనుల కోసం మొత్తం రూ.5.20కోట్లను ప్రభుత్వం ఖర్చు చేయనుంది.

సీఎంఆర్ ధాన్యం అమ్ముకున్నరు!

మంచిర్యాల జిల్లాలో రైస్ మిల్లర్ల అక్రమ దందా

- రూ.82 కోట్ల విలువైన సరుకు మాయం
- ప్రభుత్వ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం
- 8 మిల్లులపై రెవెన్యూ రికవరీ యాక్ట్
- 2 మిల్లులపై క్రిమినల్ కేసులు.. మిల్లర్ అరెస్ట్
- డీఫాల్ట్ జాబితాలో జిల్లాలోని 39 మిల్లులు

మంచిర్యాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) కోసం ఇచ్చిన ధాన్యం మంచిర్యాల జిల్లాలో పెద్ద మొత్తంలో పక్కదారి పట్టింది. సివిల్ సప్లయిస్ అధికారుల చర్యలతో ఈ విషయం వెలుగు చూసింది. సీఎంఆర్ బకాయిలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉండడంతో కదిలిన అధికారులు ఇటీవల రైస్ మిల్లుల లెక్కలు తీశారు. జిల్లాలోని ఎనిమిది మిల్లుల్లోనే రూ.82.41 కోట్లు సర్కారుకు బకాయి పడ్డట్టు తేల్చారు. జిల్లాలో రా, బాయిల్డ్ మిల్లులు 52 ఉండగా, వీటిలో 39 మిల్లులు డీఫాల్ట్ జాబితాలో చేరాయి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని సీఎంఆర్ కోసం రైస్‌మిల్లర్లకు అప్పగిస్తోంది. ధాన్యాన్ని మిల్లింగ్ చేసి క్వింటాలుకు 67 కిలోల బియ్యాన్ని సీఎంఆర్ కింద ఇవ్వాల్సి ఉంటుంది. గత సర్కారు రైస్ మిల్లర్ల నుంచి ఎలాంటి సెక్యూరిటీ డిపాజిట్లు తీసుకోకుండానే కోట్ల రూపాయల విలువైన ధాన్యాన్ని అప్పగించింది. కొందరు మిల్లర్లు ఆ ధాన్యాన్ని అమ్ముకోగా, మరికొందరు మిల్లింగ్ చేసి బియ్యాన్ని అమ్ముకున్నారు. ఇలా ఒక్కో మిల్లర్ రెండు మూడు సీజన్‌ల సీఎంఆర్ ధాన్యాన్ని పక్కదారి పట్టించారు. కోట్ల రూపాయల్లో అక్రమాలకు పాల్పడ్డారు. పైగా రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి అరకొరగా సీఎంఆర్ డెలివరీ చేశారు. కొందరు అధికారులు మిల్లర్లతో ములాఖత్ కావడం, ప్రభుత్వం పదేపదే గడువు పొడిగించడం మిల్లర్లకు వరంగా మారింది. 2019-20 నుంచి 2022-23 వానాకాలం, యాసంగి, సీజన్లకు సంబంధించి 1,71,496 మెట్రిక్ టన్నుల ధాన్యం అప్పగించగా 23,586 వేల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ పెండింగ్‌లో ఉంది. దీంతో అధికారులు జిల్లాలోని 39 మిల్లులను డీఫాల్ట్ జాబితాలో చేర్చారు.

జిల్లాలో సీఎంఆర్ బకాయిల వివరాలు (మెట్రిక్ టన్నుల్లో)

సంవత్సరం	సీజన్	పెండింగ్
2019-20	యాసంగి	2,704.87
2021-22	వానాకాలం	10,557.46
2021-22	యాసంగి	4,476.84
2022-23	వానాకాలం	5,846.87

మిల్లర్లపై క్రిమినల్ కేసులు

జిల్లావ్యాప్తంగా డీఫాల్ట్ జాబితాలో ఉన్న 39 మిల్లుల్లో మొండి బకాయిదారులైన 17 మిల్లులపై రెవెన్యూ రికవరీయాక్ట్ ప్రయోగించి ఆస్తులు జప్తు చేయాలని సివిల్ సప్లయిస్ అధికారులు నిర్ణయానికి వచ్చారు. ఇటీవల 8 మిల్లులపై ఆర్ఆర్ యాక్ట్ ప్రయోగించారు. మాతేశ్వరి ఆగ్రో ఇండస్ట్రీస్(లక్ష్మీపూర్), దుర్గా ఇండస్ట్రీస్(నర్సింగాపూర్)పై ఆర్ఆర్ యాక్ట్‌తో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. వీటి యజమాని దర్శనాల రమేశ్‌ను బెల్లంపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఈ రెండు మిల్లులు రూ.17కోట్ల విలువైన సీఎంఆర్ బకాయి పడినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని అన్నపూర్ణ ఆగ్రో మోడ్రన్ రైస్‌మిల్ (కుందారం) రూ.3 కోట్లు, వాసవీమాత ఆగ్రో ఇండస్ట్రీస్ (రేచిని) రూ.4కోట్లు, బీఎస్‌వై రా రైస్‌మిల్లు (ముదిగుంట) రూ.19 కోట్లు, శ్రీవెంకటరమణ ఆగ్రో ఇండస్ట్రీస్ (కోటపల్లి) రూ.9కోట్లు, శ్రీలక్ష్మీనర్సింహా మోడ్రన్ రైస్‌మిల్లు (కలమడుగు) రూ.3 కోట్లు, జై యోగేశ్వర ఇండస్ట్రీస్ (కొత్తూర్) రూ.7 కోట్లు, మాతేశ్వరి ఆగ్రోఇండస్ట్రీస్(లక్ష్మీపూర్) రూ.7కోట్లు, దుర్గా ఇండస్ట్రీస్ (నర్సింగాపూర్) రూ.10 కోట్లు బకాయిలు ఉండగా రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రయోగించారు.


ఎదులాబాద్ కొనుగోలు కేంద్రంలో రైతుల ధాన్యం

వడ్ల పైసల్ వస్తలేవు

- 10 రోజులైనా రైతులకు అందని డబ్బులు

ఘట్‌కేసర్ రూరల్, సిద్దిపేట రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరించి 10 రోజులైనా నేటికి డబ్బులు రాలేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం సేకరించిన 48 గంటలలోపు రైతు ఖాతాలో డబ్బులు డిపాజిట్ కావాలి. అయినా అధికారుల నిర్లక్ష్యం వల్ల ధాన్యం సేకరించి 10 రోజులైనా రైతుల ఖాతాల్లో డబ్బులు జమకాలేదు. ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్, మాధారం గ్రామాల్లో అధికారులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నెలరోజులు కాగా, గత నెల 25న ప్రతాప్ సింగారంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం సేకరించిన ధాన్యానికి డబ్బులు సకాలంలో రాకపోవడంతో రైతన్నలు దళారులను ఆశ్రయిస్తున్నారు. సాంకేతిక కారణాలతో ఆలస్యమైందని, రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేస్తామని పౌరసరఫరాల శాఖ డీఎం సుగుణబాయి భరోసా ఇచ్చారు.

ప్రభుత్వం కొనక ధాన్యం దళారుల పాలు: హరీశ్

రైతుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో అది దళారుల పాలవుతుందని ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు.

ప్రజల పక్షాన నిలిచిన టీచర్‌ను సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్యమా?

నిర్మల్ జిల్లాలో ఇథనాల్ కంపెనీ ఏర్పాటును ప్రభుత్వం పునఃసమీక్షించాలి: హరగోపాల్

బర్కత్‌పుర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): "ఇథనాల్ కంపెనీ ఏర్పాటుకు వ్యతిరేకంగా ప్రజలు నిర్వహిస్తున్న ఉద్యమానికి అండగా నిలిచిన ఉపాధ్యాయుడిని రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా సస్పెండ్ చేసింది. ప్రజాస్వామ్య పునరుద్ధరణ అంటే ఇదేనా?" అని ప్రొఫెసర్ జి. హరగోపాల్ ప్రశ్నించారు. నిర్మల్ జిల్లాలో ఇథనాల్ కంపెనీ ఏర్పాటుపై ప్రభుత్వం పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్‌పై సస్పెన్షన్‌ను బేషరతుగా ఎత్తివేయాలన్నారు. ఈ విషయమై సీఎం రేవంత్ రెడ్డి స్పందించకపోతే రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రజాఉద్యమం చేపడతామని హెచ్చరించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీపీజేఏసీ) ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో హరగోపాల్ మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ప్రొఫెసర్ కోదండరాంతో కలిసి విజయ్‌కుమార్ పోరాటం చేశారని గుర్తు చేశారు. ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులని, వారిని సస్పెండ్ చేసి భయపెట్టడం అప్రజాస్వామికమని అన్నారు. ప్రభుత్వం ఏ దిశగా వెళ్తుందో అర్థం కావడం లేదని అన్నారు. టీపీజేఏసీ కో కన్వీనర్లు కన్నెగంటి రవి, అంబటి నాగయ్య, టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బి.కొండల్‌రెడ్డి, భారత్ జోడో అభియాన్ కో-ఆర్డినేటర్ కిరణ్‌కుమార్, టీపీజేఏసీ సభ్యులు కరుణాకర్ దేశాయ్, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ విజయ్‌కుమార్‌పై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

బండి సంజయ్‌తో కుమ్మక్కయి

కాంగ్రెస్‌ను విమర్శిస్తవా?

- కాంగ్రెస్ పార్టీ మద్దతుతోనే నీకు ఎమ్మెల్సీ పదవి వచ్చింది
- పార్టీలో ఉంటూ.. పార్టీ వ్యతిరేక వైఖరి తీసుకుంటే చూస్తూ ఊరుకోం
- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై కాంగ్రెస్ బీసీ నేతల ఫైర్

హైదరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న.. కేంద్ర మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌తో కుమ్మక్కు అయి.. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్నాడంటూ మత్స్య కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆరోపించారు. ఆయన పార్టీని విమర్శిస్తే చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టంచేశారు. తానే బీసీలందరికీ నాయకుడన్నట్లు మాట్లాడుతున్నాడని, వాస్తవానికి ఆయన పెట్టింది కుల మీటింగ్ మాత్రమేనని వ్యాఖ్యానించారు. జీవో 29తో పాటుగా.. పలు అంశాలపైన కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా తీన్మార్ మల్లన్న బహిరంగ వ్యాఖ్యలు చేయడాన్ని గాంధీభవన్ వేదికగా.. ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, మెట్టు సాయికుమార్ తప్పుపట్టారు. గాంధీభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలోను, ఏబీఎన్ ఛానల్‌తో మాట్లాడుతూ.. వారు తీన్మార్ మల్లన్నపై ధ్వజమెత్తారు. అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ తానూ బీసీనేనని, తాను రాజ్యసభ సభ్యుడిని అయ్యానంటే అందరు కలిసి ఓటేస్తేనే అయ్యానన్నారు. కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచి బహిరంగంగా పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే చూస్తూ ఊరుకోమన్నారు. సమయం, సందర్భం వచ్చినప్పుడు పార్టీ.. ఆయనపై చర్యలు తీసుకుంటుందన్నారు. ఈరవత్రి అనిల్ మాట్లాడుతూ కాంగ్రెస్ మద్దతుతో గెలిచి.. పార్టీపైనే విమర్శలు చేస్తుంటే ఎన్ని రోజులు చూస్తూ ఊరుకోగలమన్నారు. "గ్రూప్ 1 మెయిన్స్‌కు సంబంధించి జీవో 29తో బీసీలకు అన్యాయం జరుగుతుందంటూ బండి సంజయ్, కేటీఆర్‌లతో కలిసి గగ్గోలు పెట్టినవ్. పరీక్షలు అయిన తర్వాత టీజీపీఎస్సీ వెల్లడించిన వివరాల ప్రకారం జీవో 29 వల్ల మెయిన్స్‌లో బీసీల పార్టిసిపేషన్ 57 శాతంగా తేలింది. అదే జీవో 55 ప్రకారం పరీక్షలు జరిగుంటే బీసీల పార్టిసిపేషన్ 39 శాతంగా మాత్రమే ఉండేది. జీవో 29తో బీసీల పార్టిసిపేషన్ పెరిగినట్లా? తగ్గినట్లా? మల్లన్న ఇచ్చిన తప్పుడు సమాచారం వల్ల కాంగ్రెస్ పార్టీకి నష్టం జరగదా?" అని ప్రశ్నించారు. తప్పుడు సమాచారం ఇచ్చినందుకు బీసీలకు క్షమాపణ చెప్పాలి అని నిలదీశారు. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడాలనుకుంటే బయటకు వెళ్లి మాట్లాడవచ్చన్నారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఒక్క బీసీ కూడా సీఎం కాలేదన్న బాధ తమకూ ఉందని, సమయం వచ్చినప్పుడు అయి తీరతారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టిన కులగణన కార్యక్రమమే దానికి దారి చూపుతుందన్నారు.

రాహుల్ చిత్రపటానికి పాలాభిషేకం

కులగణనకు అంకురార్పణ చేసినందుకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీకి ధన్యవాదాలు తెలుపుతూ వివిధ కార్పొరేషన్ల బీసీ చైర్మన్లు తీర్మానం చేశారు. అలాగే కులగణన సజావుగా సాగేందుకు అన్ని రకాలుగా కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రివర్గ ఉపసంఘం సభ్యులకూ ధన్యవాదాలు తెలిపారు. కులగణనను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి స్థానికసంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను పెంచాలని.. పెరిగిన జనాభాకు తగ్గట్లు వాటా పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేశారు. ఈరవత్రి అనిల్ నేతృత్వంలో గాంధీభవన్‌లో సమావేశమైన బీసీ చైర్మన్లు ఈమేరకు తీర్మానాన్ని ఆమోదించారు. అనంతరం రాహుల్ గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

రెండో రాకడ...!

డోనాల్డ్ ట్రంప్ మళ్ళీ అమెరికా అధ్యక్షుడయ్యారు. అభ్యర్థులు ఇద్దరి మధ్యా ఈ మారు పోటీ గట్టిగా ఉందనీ, అయినా, కమలదే పైచేయి కాబోతున్నదన్న సర్వేలన్నీ తారుమారైనాయి. కమల మరీ ఇంతదూరంలో నిలిచిపోవడం ఆశ్చర్యపరిచింది. రెండుపర్యాయాలు వరుసగా గెలవడం గతంలో ఉన్నది కానీ, ఒక విడత విరామం తరువాత తిరిగి అధ్యక్షుడు కావడం అమెరికా చరిత్రలో నూటముప్పైయ్యేళ్ళ తరువాత ఇదేనట. రెండు దశాబ్దాల తరువాత పాపులర్ ఓటు కూడా సాధించిన రికార్డు కూడా ట్రంప్‌కు దక్కింది. ఈ ఘన విజయానికి ఏయే అంశాలు దోహదం చేశాయో, నాలుగేళ్ళలోనే అమెరికన్లు ఆయనమీద మళ్ళీ ఎందుకంతగా మనసుపడ్డారో రాబోయే కాలంలో మరింత లోతుగా తేలుతుంది.

ట్రంప్ పునరాగమనాన్ని స్వదేశంలోని ఆయన అభిమానులు తప్ప మిగతా ప్రపంచం ఏమాత్రం హర్షించడం లేదని అమెరికన్ పత్రిక ఒకటి వ్యాఖ్యానించింది. ప్రచారాన్ని విద్వేషపూరిత వ్యాఖ్యలతో దట్టించడం, అక్రమవలసదారుల గుప్పిట్లో తనదేశం బందీగా ఉన్నదని వాపోవడం, అమెరికాను విముక్తంచేస్తానని ప్రకటించడం తెలిసినవే. పరోక్షంగానో, ప్రత్యక్షంగానో రంగు, జాతి ప్రస్తావనలు లేకుండా, అవమానకరంగానో, వివక్షాపూరితంగానో ఇతరులపట్ల వ్యాఖ్యానించకుండా ఆయన ఉండలేడు. ఇక మహిళల విషయంలో ఆయన వ్యక్తిగత ప్రవర్తన, మాటల్లో చులకనభావం గురించి ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. అధ్యక్ష ఎంపికలో ఇవన్నీ పనిచేస్తాయని మిగతా ప్రపంచం ఆశించడం సహజం. కానీ, ఆయన మీద ఉన్న డజనుకుపైగా కేసులు ఓటర్లను పెద్దగా ప్రభావితం చేసినట్టు లేదు. గతంలో తనను ప్రజలు గద్దెదించినందుకు కోపించి, వారిచ్చిన ఆ తీర్పును వమ్ముచేసేందుకు అన్ని కుట్రలూ చేసి, ఆఖరుకు తన కార్యకర్తలను చట్టసభలమీద దాడికి ఉసిగొల్పిన ఆ ఘట్టాన్ని కూడా ఓటర్లు విస్మరించినట్టే కనిపిస్తోంది. ఏ మాత్రం ఊగిసలాడకుండా తెల్లజాతివారు ఆయనకు అండగా ఉన్న విషయం తెలుస్తూనే ఉంది. అక్రమవలసలు, అడ్డుగోడల మాటలతో పాటు దేశాన్ని ఆర్థికంగా ఉద్ధరిస్తానన్న హామీ కూడా వారిని ప్రభావితం చేసినట్టు ఉంది. అధ్యక్ష అభ్యర్థుల చర్చలో తనది పైచేయి కానందుకు, మరోమారు రావడానికి అంగీకరించని ఆయన, ఎన్నికల సభల్లో మాత్రం అసత్యాలు, అర్థసత్యాలతో ప్రజలను నెగ్గుకురాగలిగారు. జరిగిన హత్యాయత్నం, ఆ సందర్భంలో ఆయన కనబరిచిన ధైర్యం, ఇచ్చిన నినాదాలు, మొత్తంగా ఆ దృశ్యం ఓటర్ల మనసులో నిలిచివుండవచ్చు.

ఇప్పుడు సెనేట్ మీద కూడా రిపబ్లికన్లకు గట్టిపట్టు దొరికింది కనుక ఇక ట్రంప్ దూకుడుకు అడ్డం ఉండదు. పలు అంతర్జాతీయ ఒప్పందాలనుంచి అమెరికాను తప్పించిన ఘనమైన గతం ఆయనది. పర్యావరణ పరిరక్షణ అంటే పడదు కనుక, పారిస్ ఒప్పందం నుంచి తప్పుకున్న చరిత్ర ఉన్నది కనుక, మిగతా ప్రపంచం ఎంత మొత్తుకున్నా, కాలుష్య నియంత్రణ చర్యలకు ఆయన సిద్ధపడడు. ఇరాన్‌తో ఒబామా సాధించిన అణు ఒప్పందాన్ని రద్దుచేసి, ప్రపంచాన్ని ప్రమాదంలో పడవేసిన ట్రంప్ ఇప్పుడు మారిన పరిణామాల నేపథ్యంలో ఇంకెంత దూకుడుగా వ్యవహరిస్తారో చూడాలి. తాను అమెరికా గద్దెమీద ఉన్నట్టయితే రష్యా–ఉక్రెయిన్ యుద్ధం వచ్చేది కాదని ట్రంప్ అంటున్నారు. నాటో కోసం వెంపర్లాడే లక్షణం లేదు కనుక, ఉక్రెయిన్‌కు ఎక్కువ నష్టంతో పుతిన్ పక్షాన నిలబడతాడన్న విశ్లేషణలను అటుంచితే, అనతికాలంలోనే యుద్ధాన్ని ముగిస్తానన్న ఆయన హామీ కాస్తంత ఆలస్యంగానైనా నెరవేరవచ్చు. కానీ, గాజాతో ఆరంభించి ఇరాన్‌వరకూ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ విస్తరించిన ఆ యుద్ధాన్ని ఆపే విషయంలో ట్రంప్ అంత ఉత్సాహం చూపే అవకాశాలైతే లేవు. నెతన్యాహూకు మరింత సాయంతో, ఇంకొంత విధ్వంసంతో యుద్ధాన్ని ముగిస్తే ట్రంప్‌కు చాలు. సమస్త విషయాల్లోనూ చైనాతో ఆయన గతంలో ప్రదర్శించిన కయ్యం, తదనుగుణంగా భారత్‌తో పెరిగిన బాంధవ్యం తెలిసిందే. ఈ మారు కూడా ఆ వాతావరణంలో పెద్ద మార్పేమీ ఉండబోదు. భౌగోళిక రాజకీయాల్లో భారత్‌కు నిర్దేశించిన పాత్రను ప్రశస్తంగా పోషించడంతో పాటు, ట్రంప్‌తో ప్రధాని మోదీకి ఉన్న వ్యక్తిగత సాన్నిహిత్యం కూడా మనకు ఇతరత్రా విషయాల్లో ఉపకరించవచ్చు.

ట్రంప్ గెలుపు మేలుమలుపా?

వాస్తవం ఒక్కటే! వ్యాఖ్యానాలు ఎన్నో! అమెరికా 47వ అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ విజయంపై కూడా ఎన్నో వ్యాఖ్యానాలు చేయవచ్చు. ఏ విషయంపైనా అన్ని వ్యాఖ్యానాలు ఒకే స్థాయిలో ఉండవు. మౌలిక వ్యాఖ్యానం అంటూ ఒకటి ఉంటుంది. ట్రంప్ విజయంపై కూడా అటువంటి మౌలిక వ్యాఖ్యానం నిస్సందేహంగా చేయవచ్చు! దీని కోసం ట్రంప్‌కు వచ్చిన ఓట్లో, ఆయనకు పట్టం కట్టిన రాష్ట్రాల జాబితానో చూడనక్కర్లేదు. 2016 నుంచి ట్రంప్‌ది ఒకటే బాట. ఆ బాటను బట్టే ట్రంప్ విజయంపై మౌలిక వ్యాఖ్యానం చేయవచ్చు. ఆ బాట స్వభావంపై ఇప్పటికే చాలా విషయాలు వెలుగులోకి వచ్చాయి. అవి సృష్టించే విపరిణామాల గురించి చాలా వ్యాఖ్యానాలూ వెలువడ్డాయి. ఆ బాటను అనుసరించి ముందు మరింత ఉధృతంగా రాజకీయాలు నడిపిస్తే ప్రజాస్వామ్యానికి, ప్రపంచానికి మంచే జరుగుతుందని విశ్వసించలేం! అమెరికా ప్రయోజనాలనే అన్నింటా ముందు నిలబెడతామన్న ట్రంప్ నినాదాన్ని పైపైన చూస్తే అసహజంగా అనిపించదు. జాతీయవాద దృష్టితో ఆ నినాదం ఇచ్చారని సరిపెట్టుకునే పరిస్థితీ లేదు. లోతుగా చూస్తే పొంచి ఉండే ప్రమాదాలు కనపడతాయి.



ఏ నినాదం అందరికీ ఒకేలా అర్థాన్ని ఇవ్వదు. భిన్న వర్గాలు, దేశాల ప్రజలకు అది విభిన్నంగా అర్థం అవుతుంది. అసలు సిసలైన అమెరికన్లకు దేశంలో ఉద్యోగ అవకాశాలు దక్కకుండా పోతున్నాయనీ, అమెరికా ఉత్పత్తుల అమ్మకాలకు అన్నిచోట్ల అడ్డంకులు ఎదురవుతున్నాయన్నదే ట్రంప్ నినాదం సారాంశంగా భావించొచ్చు. ట్రంప్ పదేపదే చెబుతున్నట్లుగా.. అమెరికా ఎదుర్కొంటున్న ఈ సమస్యకు కారణం నాలుగు దశాబ్దాలుగా ఆ దేశ పాలకులు అనుసరించిన విధానాలేనని ఇటీవల చరిత్రను చూస్తే ఎవరికైనా స్పష్టమవుతుంది. అందులోనూ రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష పగ్గాలు చేపట్టిన రోనాల్డ్‌రీగన్ 1980ల్లో మొదలుపెట్టిన ఆ విధానాలలోనే అమెరికా ఇప్పుడు ఎదుర్కొంటున్న పరిస్థితికి మూలాలు ఉన్నాయి. అన్ని దేశాల ఆర్థిక విధానాలను నయానా భయాన సరళీకరించి విదేశీ పెట్టుబడులకు ద్వారాలు తెరిచేలా చేసింది అమెరికా విధానకర్తలే. చౌక శ్రమ, చౌక ముడిసరుకులు పుష్కలంగా లభ్యమయ్యే ప్రాంతాలకూ దేశాలకూ అమెరికా పరిశ్రమలు తరలిపోవటానికి ప్రోత్సాహకాలు ఇచ్చింది వారే. ఆసియా దేశాల పారిశ్రామిక ఉత్పత్తులపై ఆధారపడే విధంగా అమెరికా మార్కెట్‌ను మలిచింది వారే. ఫలితంగా పారిశ్రామిక రంగంలో ఉద్యోగాలు పోయాయి. ఒకనాటి పారిశ్రామిక ప్రాంతాలు మ్యూజియంలుగానో, నిర్జన ప్రదేశాలుగానో మారిపోయాయి. పోయిన ఉద్యోగాలకు సమానంగా కొత్త ఉద్యోగాలు రాని మాటా నిజమే. 1990ల నుంచి బాగా ఊపందుకున్న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఒక దశ దాటిన తర్వాత అవసరమైన స్థాయిలో అమెరికన్ యువతకు ఉద్యోగాలను సృష్టించలేదు. ఈ రంగంలో కూడా చౌకగా లభ్యమయ్యే ఆసియా నిపుణులే ఎక్కువగా లబ్ధి పొందారు. అలా లబ్ధి పొందేలా ఆ నిపుణులను రప్పించుకున్నదీ వారే! ఇటీవల వచ్చిన కృత్రిమ మేధో సాంకేతిక పరిజ్ఞానం వల్ల కూడా ఊడిపోయే ఉద్యోగాలతో పోల్చితే సృష్టి అయ్యే ఉద్యోగాల సంఖ్య తక్కువే. కోవిడ్ అనంతరం ఐటీ రంగంలో హేమాహేమీలు అనదగిన కంపెనీలు కూడా పోటీలు పడి ఉద్యోగులను తగ్గించుకునే పనిలో పడ్డాయి. ఉన్నత ఉద్యోగాలను ప్రధానంగా ఆసియా వాసులు, కిందిస్థాయి ఉద్యోగాలను హిస్పానిక్‌లు దక్కించుకోవటం అమెరికాలో సహజంగా జరిగిపోయింది. దీనికి ఎవరినైనా నిందించదలిస్తే మొదటగా వేలెత్తి చూపాల్సింది అమెరికా కార్పొరేట్ సంస్థలని, అక్కడి విధానకర్తలను తప్ప వేరే దేశాలని కాదు.

> అమెరికా రాజకీయాల్లో ట్రంప్ నిర్వహిస్తోన్న పాత్రను చూస్తే రానున్న కాలంలో ప్రపంచం చాలా సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుంది. నియంతలే కాకుండా, ప్రజాస్వామ్య ఎన్నికల ద్వారా అధికారం చేపట్టి నియంతృత్వ పోకడలను ప్రదర్శిస్తున్న నేతలు ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టటాన్ని తమకు సానుకూలంగా భావిస్తున్నారు. రష్యా అధినేత పుతిన్ కొంత ఊపిరి పీల్చుకునే అవకాశం ఉంది. రష్యా పెట్టే షరతులకు ఉక్రెయిన్ అంగీకరించేలా చేసి యుద్ధాన్ని విరమింపచేస్తానని ట్రంప్ బహిరంగంగానే ప్రకటించారు. ఇజ్రాయెల్ నేత నెతన్యాహుకు కూడా ట్రంప్ పట్ల వ్యతిరేకత ఉందని చెప్పలేం. హమాస్ నిర్మూలన పేరుతో గాజాలో సాగుతున్న నరమేధాన్ని ఆపేలా ట్రంప్ తనపై ఒత్తిడి తెస్తారని ఇజ్రాయెల్ పాలకవర్గాలూ భావించటం లేదు.

ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్ ప్రధానంగా మధ్యతరగతి శ్వేత జాతీయులను ఆకర్షించడమే లక్ష్యంగా చేసుకుని రాజకీయాలను మొదలుపెట్టారు. మొదటిదఫా అధ్యక్ష ఎన్నికల్లో పోటీపడేనాటికే ఆ దిశలో అడుగులు వేసి విజయం సాధించారు. శ్వేతజాతి మధ్యతరగతికి ఉద్యోగ అవకాశాలు దక్కకపోవటానికి విదేశాలే కారణమని దుమ్మెత్తిపోశారు. తన ఉత్పత్తులతో అమెరికా మార్కెట్‌ను ముంచెత్తిన చైనాతో మొదలుపెట్టిన రాజకీయ యుద్ధంలో అవసరమనుకున్న చోట భారత్‌నీ లాగారు. అమెరికా ఉత్పత్తులపై భారత్ విపరీతంగా దిగుమతి సుంకాలు విధిస్తోందని విరుచుకుపడ్డారు. తాజా ఎన్నికల్లో అయితే మంచి జీతాలుండే ఉద్యోగాలన్నిటినీ భారతీయులు కొట్టేస్తున్నారనీ ఆక్షేపించారు. వివిధ రంగాల్లో అమెరికా ఆధిపత్యం తగ్గటానికి, ఉద్యోగాల క్షీణతకు ఇతర దేశాల చర్యలే కారణమన్నట్లుగా ఆయన చేసిన ప్రచారానికి లక్ష్యం శ్వేత జాతీయులను ఆకర్షించడమే. అమెరికా జనాభాలో 60 శాతానికి కాస్త అటుఇటుగా ఉన్న శ్వేతజాతీయులను తనవైపు తిప్పుకోవటంలో మొదటిసారిలాగే రెండోసారి విజయం సాధించారు. ఆయన తాజా విజయానికి మహా వ్యాఖ్యానంగా దీన్నే చెప్పుకోవాలి. అమెరికన్ అస్తిత్వానికి ముఖ్యంగా శ్వేతజాతీయుల ఆధిపత్యానికి ముప్పు ముంచుకొస్తుందనే ఒకరకమైన భయాన్ని, ఆందోళనను కలిగించటంలో ట్రంప్ సఫలీకృతమయ్యారు. అణగారిన వర్గాలే తమ అస్తిత్వాన్ని కాపాడుకోటానికి పోరాటాలు చేస్తాయన్న సూత్రీకరణ అన్ని సందర్భాల్లోనూ నిజం కాదు! ఆధిపత్య వర్గాలను ఆధారం చేసుకుని కూడా అస్తిత్వ రాజకీయాలను నడపొచ్చు అనటానికి పదేళ్ల నుంచి అమెరికాలో జరుగుతున్న పరిణామాలే నిదర్శనం. ఏదో విధంగా జనాకర్షణే ప్రధానం అనుకుని రాజకీయాలు చేసే వారికి నిరంతరం వైరివర్గాలు కావాలి. ఆ వైరివర్గాల వల్లే సకల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని చెప్పటం నిరంతరం జరగాలి. ఉద్యోగ భద్రతను, ఉద్యోగ కల్పనను తగినంత ఇవ్వలేని ఆర్థిక వ్యవస్థ అభద్రతా సమాజాన్ని సృష్టిస్తుంది. 1990ల తర్వాత మరీ ముఖ్యంగా 2007–2008 ఆర్థిక సంక్షోభం తర్వాత అభద్రతా భావం అమెరికా ప్రజల జీవితాల్లోకీ చొచ్చుకు వెళ్లింది. అభద్రతాభావనలో వేగిపోయే వారి ముందు శత్రువులుగా కొన్ని దేశాలనూ, కొన్ని వర్గాలను ప్రవేశపెట్టటంలోనే జనాకర్షణ నేతల విజయం దాగివుందని చెబుతూ ప్రముఖ ఆర్థికవేత్త ప్రణబ్‌బర్ధన్ అభద్రతా ప్రపంచం పేరుతో ఒక పుస్తకాన్నే రాశారు. అన్ని చోట్లా వ్యాపిస్తున్న అభద్రతా సమాజం ప్రజాస్వామ్యంలో ఉదాత్త సంప్రదాయాలను పలచనచేసి ఉన్మత్త, నిర్హేతుక నినాదప్రాయులైన నాయకులను ఎలా సృష్టిస్తోందో కూడా ప్రణబ్ బర్ధన్ విశ్లేషించారు.



■ రాహుల్ కుమార్

అమెరికా రాజకీయాల్లో ట్రంప్ నిర్వహిస్తోన్న పాత్రను ప్రణబ్ బర్ధన్ కోణం నుంచి చూస్తే రానున్న కాలంలో ప్రపంచం చాలా సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుంది. కాలం గడుస్తున్న కొద్దీ రాజకీయ నాయకుల్లో మార్పుని చూడటం సహజం. కానీ ట్రంప్‌ని నిశితంగా చూసిన వారెవరూ ఆయన ఆలోచనల్లో మార్పు వచ్చిందని భావించటం లేదు. నియంతలే కాకుండా, ప్రజాస్వామ్య ఎన్నికల ద్వారా అధికారం చేపట్టి నియంతృత్వ పోకడలను ప్రదర్శిస్తున్న నేతలు ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టటాన్ని తమకు సానుకూలంగా భావిస్తున్నారు. రష్యా అధినేత పుతిన్ కొంత ఊపిరి పీల్చుకునే అవకాశం ఉంది. రష్యా పెట్టే షరతులకు ఉక్రెయిన్ అంగీకరించేలా చేసి యుద్ధాన్ని విరమింపచేస్తానని ట్రంప్ బహిరంగంగానే ప్రకటించారు. ఇజ్రాయెల్ నేత నెతన్యాహుకు కూడా ట్రంప్ పట్ల వ్యతిరేకత ఉందని చెప్పలేం. హమాస్ నిర్మూలన పేరుతో గాజాలో సాగుతున్న నరమేధాన్ని ఆపేలా ట్రంప్ తనపై ఒత్తిడి తెస్తారని ఇజ్రాయెల్ పాలకవర్గాలూ భావించటం లేదు. మానవహక్కుల గురించి డెమొక్రటిక్ పార్టీ సిద్ధాంతపరంగానైనా ఎంతో కొంత మాట్లాడుతుంది. రిపబ్లికన్ పార్టీకి ఈ విషయంపై డెమొక్రాట్లంతగా నోరు విప్పిన చరిత్ర లేదు. ఐరాస, ప్రపంచ ఆరోగ్య సంస్థ లాంటి అంతర్జాతీయ సంస్థలపై మొదటి దఫా అధ్యక్షుడైనప్పుడే ట్రంప్ చాలా విమర్శలను ఎక్కుపెట్టారు. ఈసారి అయినా వాటిపట్ల ట్రంప్ ధోరణి మారుతుందన్న నమ్మకం లేదు. వీటన్నిటికంటే ముఖ్యమైంది వాతావరణ మార్పులపై కార్యాచరణ. అసలు వాతావరణ మార్పులే ప్రమాదకరంగా లేవనీ ప్రమాదకరమని ప్రచారం చేసే వాళ్లవి డొల్ల వాదనేనని ట్రంప్ అనేకసార్లు ఈసడించారు. ప్యారిస్ వాతావరణ ఒప్పందం నుంచి అమెరికా వైదొలుగుతున్నట్లు తాను గతంలో అధ్యక్షుడిగా ఉన్నప్పుడే ప్రకటించారు. పాత వైఖరికే కట్టుబడి ట్రంప్ వ్యవహరిస్తే ప్రపంచానికి వాతావరణపరంగా గడ్డుకాలం తప్పదనే అనుకోవాలి.

> అణగారిన వర్గాలే తమ అస్తిత్వాన్ని కాపాడుకోటానికి పోరాటాలు చేస్తాయన్న సూత్రీకరణ అన్ని సందర్భాల్లోనూ నిజం కాదు! ఆధిపత్య వర్గాలను ఆధారం చేసుకుని కూడా అస్తిత్వ రాజకీయాలను నడపొచ్చు అనటానికి పదేళ్ల నుంచి అమెరికాలో జరుగుతున్న పరిణామాలే నిదర్శనం.

ఇతర దేశాల సంగతెలా ఉన్నా ట్రంప్ గెలుపుతో భారత్‌కు లాభిస్తుందనే వారి సంఖ్య తక్కువేమీ కాదు. ట్రంప్ అతి జాతీయవాదంతో ఏకీభావం ఉండొచ్చు. కానీ ట్రంప్ మొదటిసారి అధ్యక్షుడిగా ఉన్నకాలంలో భారతీయ విద్యార్థులు, ఉద్యోగులు అభద్రతతో వణికిపోయారు. చదివిన డిగ్రీకి అనుగుణంగా చేస్తున్న ఉద్యోగాల్లేవని వారిని స్వదేశానికి పంపించిన ఘటనలు చాలా ఉన్నాయి. వీసాలను, ఉద్యోగ నిబంధనలను కట్టుదిట్టంచేసి అవకాశాలను కుదించివేస్తారన్న భయం భారతీయుల్లో ఇప్పటికీ ఉంది. ఇక చైనాను కట్టడి చేయటానికి ట్రంప్ ప్రయత్నిస్తారనీ దీంతో అక్కడ నుంచి కంపెనీలు తరలి వస్తాయనే ఆశ ఇక్కడి అధికారపార్టీకి ఉంది. యాపిల్ లాంటి దిగ్గజ కంపెనీయే భారత్‌లో ఐఫోన్ల ఉత్పత్తిని ఇబ్బడిముబ్బడిగా పెంచుతోంది. ట్రంప్ రాజకీయాలే యాపిల్ లాంటి కంపెనీల కార్యకలాపాల తరలింపునకు అసలు కారణమని చెప్పలేం. 1990ల నాటి పరిస్థితి చైనాలో లేదు. అక్కడ వేతనాలు పెరిగాయి. ముడిసరుకుల ధరలు హెచ్చాయి. కంపెనీల దృష్టి భారత్ వైపు మళ్లటానికి ఇవి కీలకపాత్రను పోషించాయి.

ఈ పరిణామాల సంగతి ఎలా ఉన్నా... పరిపక్వత చెందిన ప్రజాస్వామ్య దేశమంటే ఒకనాడు వెంటనే గుర్తుకొచ్చేది అమెరికా. ఇటీవల కాలంలో అక్కడ కూడా జనాకర్షణ రాజకీయం విపరీతంగా పరిపక్వత పొందుతోంది! అభద్రతా భావన అక్కడి ప్రజల్లోనూ రాజ్యమేలుతోంది. నినాదప్రాయ రాజకీయాల్లో నిపుణులైన నేర్పరులే జనాభిమానాన్ని పొందుతున్నారు. ప్రజాస్వామ్యాన్ని ఊహించని మలుపులు తిప్పుతున్నారు. అన్ని మలుపులూ మేలుమలుపులు కావన్నదొక్కటే ప్రస్తుతానికి నిజం!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

భావజాలాన్ని ఎన్‌కౌంటర్ చేయలేరు!

నరేంద్ర మోదీ, అమిత్ షాలు వామపక్ష పార్టీలను ప్రధాన బద్ధశత్రువుగా చూస్తున్నారు. వామపక్ష భావాలు కలిగిన వారిపై ఊపా, రాజద్రోహం కేసులు పెడుతూ బెయిల్ రాకుండా సంవత్సరాల తరబడి జైళ్ళల్లోనే మగ్గేట్టు చేస్తున్నారు. గొంతెత్తి మాట్లాడే వారి గొంతులను అక్రమ అరెస్టులతో నొక్కుతున్నారు. అర్బన్ నక్సలైట్‌లు అని ముద్రవేస్తున్నారు. ఇప్పుడు మావోయిస్టు ఏరివేత లక్ష్యంగా వందలాది మంది మావోయిస్టులను బలికొన్నారు. వచ్చే ఏడాదికి నక్సలైట్‌లను నిర్మూలిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటనలు ఇస్తున్నారు. దీనికి కారణం భారతదేశంలో వామపక్ష పార్టీలు లేకుండా చేయాలన్న దుర్బుద్ధి తప్ప మరొకటి కాదు. మతోన్మాదాన్ని ప్రేరేపిస్తూ ప్రజల మధ్యన చిచ్చుపెట్టే ఆరెస్సెస్ ఆడిస్తున్న నాటకంలో బీజేపీ పాత్ర వహిస్తున్నది.

కమ్యూనిస్టులు వామపక్ష పోరాటాల ద్వారా ప్రభుత్వం ఏర్పాటు చేసి ప్రజాస్వామ్య పద్ధతులలో హక్కులను పొందాలని ప్రయత్నిస్తున్నారు. కమ్యూనిస్టు పార్టీలలో రకరకాల ఆలోచనలు ఉన్నాయి. మావోయిస్టులు తుపాకి గొట్టం ద్వారానే మన హక్కులను సాధించుకుంటామనే ఆలోచనతో పోరాటం చేస్తున్నారు. వారు చేస్తున్న పోరాటం తప్పు కావచ్చు. కానీ భార్యాపిల్లలను వదిలి ప్రాణాలకు తెగించి ఎప్పుడు ఎక్కడ తింటారో, నిద్రిస్తారో తెలియని అగమ్యగోచర పరిస్థితులలో సమాజ శ్రేయస్సు కోసమే వారు పోరాడుతున్నారు. దోపిడి వర్గాల అణచివేతలను అరికట్టాలన్న లక్ష్యంతో వారు ఆ పంథాను ఎంచుకున్నారు.



> ఎక్కడ అణచివేత, దోపిడీ ఉంటుందో అక్కడ వామపక్ష పార్టీలు ఉంటాయి. మావోయిస్టు ఉద్యమం తాత్కాలికంగా అణచివేయబడినప్పటికీ అంతరాలు లేని, దోపిడీ రహిత సమాజం ఏర్పడే వరకు దాని ఉనికి, ప్రభావం అలా ఉంటూనే ఉంటాయి.

పార్లమెంట్ పంథాలో పని చేస్తున్న వామపక్షాలు కూడా అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటున్నాయి. ఎన్నికలు ఐదేళ్ళకు ఒకసారి జరుగుతాయి. ఆ ఎన్నికలతో దేశ ప్రజల జీవన ప్రమాణాలలో మార్పులు రావాలి. కానీ ప్రజాస్వామ్యంలో కీలకమైన ఓట్ల కోసం నాయకులు అడ్డమైన దారులు తొక్కుతూ డబ్బు, మద్యం, సంక్షేమ పథకాల ఎర చూపి ఓటర్లకు అరచేతిలో స్వర్గం చూపిస్తున్నారు. ఈ క్రమంలో ప్రజాసేవకులు కనుమరుగై, హంతకులు, గూండాలు, కార్పొరేట్ సంస్థల అధిపతుల నుంచి రియలెస్టేట్ వ్యాపారుల వరకు ఎంపీలూ ఎమ్మెల్యేలుగా గెలుస్తున్నారు. ప్రజలు గెలవాల్సిన ప్రజాస్వామ్యంలో దోపిడి శక్తులూ, వారికి అండగా నిలిచే మతోన్మాద శక్తులూ గెలిచి అధికారాన్ని హస్తగతం చేసుకుంటున్నాయి. కార్మిక వర్గాలు, బడుగు బలహీన వర్గాలు అణచివేతకు గురవుతున్నాయి. ఎక్కడ అణచివేత, దోపిడీ ఉంటుందో అక్కడ వామపక్ష పార్టీలు ఉంటాయి.

ఉగ్రవాద చర్యలను సామాజిక, ఆర్థిక అంశంగా గుర్తించి పరిష్కరించే బదులుగా శాంతిభద్రతల సమస్యగా పరిగణించి ఎన్‌కౌంటర్‌లే ప్రధానమని గతంలో భావించారు. ఇప్పటికీ మోదీ ప్రభుత్వం ఇదే ధోరణిని అవలంబిస్తూ ఉగ్రవాదాన్ని నిర్మూలిస్తామంటున్నారు. మావోయిస్టు ఉద్యమం తాత్కాలికంగా అణచివేయబడినప్పటికీ అంతరాలు లేని, దోపిడీ రహిత సమాజం ఏర్పడే వరకు దాని ఉనికి ప్రభావం అలా ఉంటూనే ఉంటుంది.

వామపక్ష తీవ్రవాదానికి ప్రజల పునాది ఉన్నదనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలి. అలాగే ప్రజలు కూడా ప్రజాస్వామ్య ఫలాలు పొందడానికి చైతన్యవంతం కావాలి. పాలకులను ఆలోచింపచేసే విధంగా ప్రజా చైతన్యాన్ని ప్రదర్శించాలి. ఇటీవల ప్రొఫెసర్ సాయిబాబా అకాల మరణం చెందారు. ఇందుకు పాలకులే కారణం. అన్యాయంగా ఊపా కేసులు మోపి 90శాతం కదలలేని స్థితిలో ఉన్న మేధావిని పదేళ్ళు అండా సెల్‌లో బంధించారు. చివరకు కోర్టు నిర్దోషిగా తేల్చింది. హర్యానా ఎన్నికల్లో ఓట్ల కోసం డేరా సచ్చా సౌదా గురువు రాం రహీమ్ సింగ్‌కు బీజేపీ ప్రభుత్వం పెరోల్ ఇచ్చింది. కానీ, ప్రొఫెసర్ సాయిబాబా తల్లి చనిపోయినప్పుడు చూసేందుకు పెరోల్ ఇవ్వలేదు. చివరికి ఆయన నిర్దోషి అని తేలింది. ఏమి లాభం? జైలులో పడిన అష్టకష్టాలతో బైటికి వచ్చిన నెలల్లోనే అనారోగ్యంతో అకాల మృత్యువుకు గురయ్యారు. కేవలం వామపక్ష భావజాలం కలిగి ఉన్నారనే ఒకే ఒక్క కారణంతో ఆయనను బంధించి. మానసికంగా హింసించడమే కాకుండా, చివరికి ఆయన మరణానికి కూడా పాలకులు కారణమయ్యారు.

కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఆపరేషన్ గ్రీన్ హంట్, ఆపరేషన్ కగార్ పేర్లతో మావోయిస్టుల అంతానికి పంతం పట్టింది. వారి ఉద్దేశం ఛత్తీస్‌గఢ్ ఇతర ఆటవీ ప్రాంతాలలో ఆదివాసీల అభిమానాన్ని చూరగొన్న మావోయిస్టులను నిర్మూలించి, ఆ పచ్చని అడవిలోని వనరులనూ, గనులనూ తమ వందిమాగధ కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకే అన్న మాట ప్రచారంలో ఉంది.

ఇలాంటి తరుణంలో మావోయిస్టులు కూడా అంతర్మథనం చేసుకుంటూ ప్రత్యామ్నాయ ఆలోచనలకు పదును పెట్టాలి. ప్రజాస్వామ్య పద్ధతులలోనే ప్రభుత్వం అనుసరిస్తున్న చర్యలను తిప్పికొట్టాలి. చావుకు చావు అనే సిద్ధాంతం నుండి వైదొలగి కమ్యూనిస్టులతో కలిసి ఐక్యపోరాటం చేసి వర్గరహిత సమాజాన్ని నిర్మించాలి.


వివిధ పార్టీలుగా చీలిపోయిన కమ్యూనిస్టులు, మావోయిస్టులు, ఇతర వామపక్ష శక్తుల మధ్య అనుసరించే మార్గంపై భిన్నాభిప్రాయాలు వుండవచ్చే తప్పా సమసమాజ స్థాపనే అందరి అంతిమ లక్ష్యం. మితవాద, మతవాద శక్తుల నుంచి దేశం తీవ్ర ప్రమాదం ఎదుర్కొంటున్న ఈ దశలో వామపక్ష, ప్రజాతంత్ర, ప్రగతిశీల శక్తులన్నీ ఐక్యంగా దానిని తిప్పికొట్టాలి.

• చాడ వెంకటరెడ్డి
సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు

సంతలో సరుకైపోయిన సంతకాలు!

మన దేశంలో, పల్లెల్లో మొదలుకొని పట్టణాల వరకు, పుష్కలంగా విస్తరించుకొని, ప్రతి వ్యవస్థలో అంతర్లీనమై ఒక సర్వసాధారణ ప్రక్రియలా 'సంతకాల విక్రయాలు' జరుగుతున్నాయి. ఈ చీకటి సంతకాల సంతలు ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోనూ నెలకొల్పబడి ఉన్నవి. ఎక్కువ శాతం ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వం ఇచ్చే జీతం కన్నా ఏ డిపార్టుమెంట్‌లో లంచం ఎక్కువ దొరుకుతుందో ఆ డిపార్టుమెంట్ వైపే గురి పెడుతున్నారు. ఆ కొలువు పొందటానికి కూడా లంచమే బీజమవుతున్నది. ఇక ఆ తర్వాత పెట్టిన పెట్టుబడి వసూలు చేసుకోవడానికి, అధిక ఆదాయం పొందడానికి, సంతకాల సంతలో ఒక దుకాణం తెరుస్తున్నారు.

బయట రియల్ ఎస్టేట్ దందాలో బ్రోకర్లు ఏజెంట్లు ఉన్నట్లుగా, పౌరునికీ అధికారికీ మధ్యన పైరవీకారులే అనుసంధానకర్తలు. ఈ మధ్యవర్తులు బాధితునికి భరోసా కల్పిస్తూ, అధికారులకు ఇబ్బందులు రాకుండా జాగ్రత్తగా చాకచక్యంతో లంచాలు ఇప్పించి, తమ కమిషన్ తాము తీసుకొని, ఇంకో బాధితుని కోసం వేట మొదలుపెడతారు. ఇదంతా నిరంతర ప్రక్రియ. ఇది ఎంతవరకు కొనసాగుతున్నదంటే– లంచం ఇచ్చే పౌరుడికి కూడా ఇది సర్వసాధారణ విషయమే అయిపోయింది. 'ఇంతోఅంతో ఇచ్చి పని కతం చేసుకుంటే అయిపోతది' అనుకుంటున్నాడు. సంతకం పెట్టే అధికారి 'ఏమీ ఇయ్యంది, ఎట్లా చేస్తాం?' అని రుబాబుగా, లంచం తీసుకోవడం కూడా ఒక వృత్తి ధర్మమే అనే భావనలో బ్రతుకుతున్నాడు. అటెండర్ నుంచి మొదలుపెట్టి ఉన్నత స్థాయి ప్రభుత్వ అధికారి వరకు, లంచగొండితనం నరనరాల్లో ఇమిడిపోయి ఉన్నది. కొంతమంది నిజాయితీగల ఆదర్శవంతులు కూడా ఉన్నారు. వారిని చూస్తే గర్వంగా అనిపిస్తుంది.



ఉన్నత చదువులు చదివి పరీక్షల్లో నెగ్గి ప్రజాసేవకు అంకితమైనట్లు ప్రమాణాలు చేసి అధికారులైన కొంతమంది కలెక్టర్లు సైతం సంతకాల సంతలో చేరి ఒక మ్యుటేషన్‌కి కనీసం లక్ష చొప్పున తీసుకున్నారని 'ధరణి' బాధితులు చర్చించుకున్న విషయం తెలిసిందే. ఒక గ్రామంలో అయితే రేపు బదిలీ అవుతున్నాడని తెలిసిన తహసిల్దార్ ఆ రాత్రికి రాత్రి అడ్డగోలు లంచాలు తీసుకొని నకిలీ ప్రొసీడింగ్‌లు సృష్టించి, ఫోర్జరీలు చేసి మరి అక్రమ మ్యూటేషన్లు చేశాడు. ఆ వ్యవహారంపై క్రిమినల్ కేసు కూడా నమోదైంది. కోర్టులో కేసు నడుస్తూనే ఉన్నది. విచిత్రం ఏమిటంటే, ఆ తహసిల్దార్‌కు ప్రమోషన్ కూడా దొరికి, తన ఉద్యోగం యథావిధిగా కొనసాగుతూనే ఉన్నది.

మన భూమిని మన పేరు మీద నమోదు చేయమన్నా దానికి లంచమే! మనది కాని భూమిని మన పేరు మీద ఏదో విధంగా మార్చిడి చేయటానికి పిరమైన లంచం! 'నా భూమికి నేను లంచం ఇచ్చేది ఏందిి?' అనడం వల్ల కోర్టు చుట్టూ తిరిగే గతి పట్టింది. భూమి మీద ఏ హక్కు లేకుండా లంచమిచ్చి అధికారి చేత సంతకాలు చేయించుకున్నవాడు ప్రస్తుతానికైతే ఆరాంగా ఉన్నాడు.

ఇలాంటి అక్రమ మ్యుటేషన్లు చాలామందికి జరిగాయి. ఆ పేద రైతులు ఆశ వదులుకున్నారు. ఒక దంపతులు తహసీల్దార్ ఆఫీస్ ముందే ఆత్మహత్యా ప్రయత్నం కూడా చేశారు. ఇలా లంచం కోసం ఎంతకైనా దిగజారిపోతున్నారు అధికారులు.

యాంటీ కరప్షన్ బ్యూరో లాంటి సంస్థలు స్థాపించి కఠిన చర్యలు తీసుకున్నప్పటికీ, ఇది ఆగడం లేదు. పౌరుని మార్గం సుగమం చేయుటకు వెబ్ పోర్టల్స్ తయారు చేసి సౌలభ్యం కల్పించాక కొన్ని సంస్థల్లో లంచాలకు అడ్డుగోడ పడింది. కానీ కొన్ని సంస్థల్లో పంపిన అప్లికేషన్లు ఏదో వంకతో పెండింగ్‌లో పెడుతున్నారు. సరైన కారణాలు చెప్పకుండానే రిజెక్ట్ చేస్తున్నారు. పౌరుడు మళ్లీ ఆన్‌లైన్ పోర్టల్‌లో తిరిగి అప్లికేషన్ పెట్టుకొని ఆన్ రోడ్డు ఎక్కి మళ్ళీ అధికారి దగ్గరికి వెళ్లి మంతనాలు చేసుకొని ఇంతో అంతో ముడుపులు చెల్లిస్తే గాని అప్లికేషన్ యాక్సెప్ట్ అవ్వడం లేదు.

కొత్తగా ఎవరైనా ఒక బిజినెస్ మొదలు పెట్టాలనుకున్నవారు– మొదట్లోనే ఇంత టార్చర్ ఉంటే ఇంక ముందు ముందు ఇంకెంత సతాయిస్తారో అని వ్యాపారం మొదలుపెట్టే లోపే ఆపేసిన సందర్భాలు ఎన్ని ఉన్నాయో! తన సంపాదనలో జీఎస్‌టీ ఎలాగో అలా ఈ మామూలు చెల్లించుకోవడం కూడా ఒక చీకటి టాక్స్ లాగా భావించి సకాలంలో చెల్లించుకొని దూసుకుపోతున్న వ్యాపారస్తులు కూడా ఎందరో ఉన్నారు. 'లంచాలిచ్చుకుంటే నోట్లు, కోట్లు! ఎదురు తిరిగి ప్రశ్నిస్తే ఆటు పోట్లు, కోర్టులు!' ఏది నయ్యమో డిసైడ్ చేసుకోవాల్సి వస్తున్నది, ఈ కాలంలో, ఈ సమాజంలో దూసుకుపోయే ఏ వ్యాపికైనా.

ప్రపంచం మున్ముందుకు సాగుతున్నా, ప్రభుత్వం ప్రజల సౌలభ్యం కోసం ఎంత టెక్నాలజీ వాడినా, లంచగొండులు మాత్రం ఎక్కడో అక్కడ అడ్డుకట్ట వేసి, పాత అలవాట్లను కొనసాగిస్తున్నారు. వీటిని అరికట్టడానికి ప్రభుత్వంతో పాటు పౌరులు కూడా లంచం ఇవ్వద్దని కంకణం కట్టుకొని, ఎదురు తిరిగి నిలదీసే తత్వం పెంపొందించుకోవడం అవసరం. దానికి పరిపూర్ణమైన అవగాహన కావాలి. ఫలానా ఆ ఫైల్ ఆగటానికి కారణం ఏమిటో క్షుణ్ణంగా అడిగి తెలుసుకోవాలి. అయినా ఆ ఉద్యోగి ఇబ్బంది పెడితే భయపడకుండా పై అధికారికి ఫిర్యాదు చేసే ధైర్యం రావాలి. మనం కరెక్ట్‌గా ఉన్నప్పటికీ, ఆటంకాలు వస్తే కోర్టు మెట్లు ఎక్కి తీరాల్సిందే, మీడియా తలుపులు కొట్టాల్సిందే, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు ప్రకటించాల్సిందే. ఈ చీకటి దందాలకు మొట్టమొదలు పౌరులు దూరంగా ఉండాలి. అధికారులు తమ సంతకాల గౌరవాన్ని దక్కించుకోవాలి. సంతలో సరుకు మాదిరిగా చేసుకోకూడదు. అప్పుడే దేశం బాగుపడుతుంది.

◆ సయ్యద్ రఫీ
చిత్ర దర్శకుడు

ప్రభుత్వ బడులకు 'సమీకృత' గ్రహణం!

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న 28 సమీకృత గురుకులాల ఏర్పాటు పథకాన్ని ప్రభుత్వం అందరికీ సమాన విద్య బాధ్యతల నుంచి వైదొలగడంగానే చూడాలి. ఇంచుమించు గత పదేళ్లుగా కేసీఆర్ అనుసరించిన సామాజిక గురుకులాలకు ఈ పథకం ఇంచుమించు నకలు మాత్రమే. గత పదేళ్ళుగా గురుకులాల పేరుతో కేసీఆర్ చేసిన విద్యా రంగ విధ్వంసానికి ఇది కొనసాగింపు మాత్రమే!

కేసీఆర్ కేజీ టూ పీజీ విద్యను పక్కనపెట్టి కుల ప్రాతిపదికన గురుకులాల ఏర్పాటు చేయడం మూలంగా ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. వందలమందితో కళకళలాడిన ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులు లేక వెలవెలబోయాయి. ఒకపక్క గురుకులాల్లో తాత్కాలిక ప్రాతిపదికన సిబ్బందిని నియమించి సరైన విద్యా సామర్థ్యాలు అందించడంలో విఫలం కాగా, మరోపక్క ప్రభుత్వ పాఠశాలల్లో సరైన సంఖ్యలో విద్యార్థులు లేక అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు తరగతి గదుల్లో కాలక్షేపం చేసే పరిస్థితి కలిగింది. అప్పుడు ఈ పరిస్థితిని విమర్శించిన కాంగ్రెస్ పెద్దలు ఇప్పుడు అధికారంలోకి వచ్చాక పేదల బడులలో సౌకర్యాలు కల్పించి, విద్యార్థుల సంఖ్య పెంచడానికి చర్యలు తీసుకోవాల్సిందిపోయి, ఈ సమీకృత గురుకులాల ఆలోచన చేయడంలో అంతర్యం ఏమిటో మరి!



> పెద్దసంఖ్యలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, విద్యా ప్రమాణాలు, విద్యార్థుల సంఖ్య పెంచకుండా చేసే నూతన సమీకృత గురుకులాలతో సమాజానికి ఎలాంటి ప్రయోజనం ఉండదు.


స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ పేరుతో ఏవో వేళ్ళ మీద లెక్కపెట్టే పాఠశాలల్ని ప్రారంభించి అంతర్జాతీయ ప్రమాణాల పేరుతో, 'గుర్రం మూతి ముందు గడ్డి కట్టి అది గుర్రానికి అందకుండా దాని చేత దౌడు చేయించి రౌతు గమ్యం చేరిన విధంగా' ఆధునిక ప్రభుత్వాలు ప్రజలతో ఆటాడుకుంటున్నాయి. రాశి రీత్యా పెద్ద సంఖ్యలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల దివాలాకే ఇలాంటి ప్రయత్నాలు తోడ్పడతాయి తప్ప మరెలాంటి కొత్త ఫలితాలూ ఇవ్వవని గత పదేళ్ళ గురుకులాల అనుభవం తేల్చి చెప్పింది. ఎన్నో ఏళ్ళుగా ప్రజలు, విద్యాభిమానులు పోరాడితే అప్పటి యూపీఏ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 'విద్యా హక్కు చట్టం–2009' తెచ్చింది. దానికి తూట్లు పొడిచేందుకే పాలక పక్షాలు ఇలాంటివి చేస్తున్నాయి.

స్వల్ప సంఖ్యలో ఏర్పాటు చేస్తున్న స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్సీల మూలంగా గ్రామీణ పేదలు, మురికి వాడల ప్రజలు, సామాజికంగా వెనుకబడిన వర్గాల వారికి ఎందరికి న్యాయం జరుగుతుందీ అనేది ప్రశ్నార్థకమే!? మెరిట్ ప్రాతిపదికన ఏ కొద్ది మందికో అంతర్జాతీయ ప్రమాణాల భ్రమలో విద్యను అందిస్తామని చెప్పి మెజారిటీ వర్గాలకు అన్యాయం చేయడమే చివరకు జరుగుతుంది. ఇదే పాలక వర్గాల విద్యా వ్యూహం. ఏవో కొన్ని సమీకృత గురుకులాలు ఏర్పాటు చేస్తే– మరి రాష్ట్రంలో ఉన్న 41,337 పాఠశాలలు, 2900 జూనియర్ కళాశాలలు, 1000 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల పరిస్థితి ఏమిటి? లక్షలాది సంఖ్యలో ఉన్న ప్రభుత్వ విద్యార్థులను గాలికొదిలి తెలివైన వారిని కొందరిని ఎంపిక చేసి మరింత మెరుగైనవారిగా మారుద్దామన్నదేనా మీ ఆలోచన? రాశి రీత్యా పెద్దసంఖ్యలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, విద్యా ప్రమాణాలు, విద్యార్థుల సంఖ్య పెంచకుండా చేసే నూతన గురుకులాల ప్రతిపాదన ప్రచారం కోసం చేసే ఆర్భాటం తప్ప దానివల్ల సమాజానికి ఎలాంటి ప్రయోజనం ఉండదు గాక ఉండదు! ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచకుండా వాటికవే అంతరించిపోయే పరిస్థితిని పాలకులు ఎందుకు తెస్తున్నారు? ఇప్పటికే మనం విద్యా ప్రమాణాలలో 21 రాష్ట్రాల తర్వాత స్థానంలో ఉన్నాం! ఈ పరిస్థితిలో మనం ఇస్తున్న భవిష్యత్తు విద్యా సంకేతాలు ఏమిటి?


కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులను మారుస్తామని ప్రకటనలు ఇచ్చారు. ఆ మేరకు నిబద్ధత కలిగిన ఆకునూరి మురళి లాంటి మాజీ ఐఏఎస్ అధికారిని చైర్మన్‌గా, తెలంగాణా రాష్ట్రంలో విద్యా రంగంలో ఎంతో అనుభవం ఉన్న మేధావులను కమిటీ సభ్యులుగా విద్యా సలహా మండలిని నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అంతవరకు బాగానే ఉంది. మరి ఆ కమిటీ సిఫార్స్ లేకుండా ఫక్తు కేసీఆర్ మోడల్‌నే మరలా అనుసరిస్తూ సమీకృత గురుకులాలకు శంకుస్థాపనలు ఎందుకు చేస్తున్నారు? ప్రభుత్వ పాఠశాల వ్యవస్థను బలోపేతం చేయడానికి టీచర్ పోస్టులను భర్తీ చేశామని చెబుతున్న ప్రభుత్వం మరి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను ఎలా పెంచగలుగుతుంది?

ఇప్పటికే తెలంగాణా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు ఏ గ్రామంలో చూసినా ఎకరం నుండి పది ఎకరాల వరకు భూమి ఉంది. వసతులున్న ప్రభుత్వ పాఠశాలలన్నింటినీ మినీ గురుకులాలుగా మార్చగలిగితే ఎంతో బాగుంటుంది. ఎలాగూ మధ్యాహ్న భోజనం, ఉదయం అల్పాహారం ఇస్తున్నారు. అలాగే సాయంత్రం పూట భోజనం అదనంగా ప్రకటించి వార్డెన్ కమ్ ట్యూటర్‌ను నియమిస్తే ప్రభుత్వ పాఠశాల వ్యవస్థ బాగుపడుతుంది. పైగా పిల్లలు తల్లిదండ్రులకు అందుబాటులో ఉంటారు. అంతేగాక ఇప్పటివరకు ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన గురుకులాలను ఒకే ప్రభుత్వ పాఠశాల వ్యవస్థ గొడుగు క్రిందకు తేగలిగితే ఇంకా బాగుంటుంది. ప్రభుత్వ విద్యను గాడిలో పెట్టడం సాధ్యమే! ప్రజలందరికీ నాణ్యమైన ప్రభుత్వ ఉచిత విద్య అందని కల కానే కాదు! ఆ దిశగా పాలకులు ఆలోచిస్తారా అన్నదే అసలైన ప్రశ్న.

■ యన్. తిర్మల్



భద్రకాళి చెరువుకు మహర్దశ



- నేటి నుంచి అభివృద్ధి పనులు ప్రారంభం
- పూడిక, గుర్రపు డెక్క చెత్తా చెదారం తొలగింపు
- 30 రోజుల పాటు మత్తడి, తూముల ద్వారా నీటి ఖాళీ
- నాలుగు శాఖల సమన్వయంతో పనులు ప్రారంభం
- 2050 మాస్టర్ ప్లాన్‌కు ప్రభుత్వం శ్రీకారం

6

మూడేళ్లలో..

నెరవేరనున్న ఓరుగల్లువాసుల గగనయాన కల



ఓరుగల్లు వాసుల గగన యానం కల నెరవేరబోతోంది. వరంగల్ ఎయిర్‌పోర్టుకు ప్రధాన అడ్డంకిగా ఉన్న 150కి.మీల నిబంధన సడలింపునకు జీఎంఆర్ సంస్థ అంగీకరిం చిందనే ప్రకటనతో ఆకాశ యానంపై ఆశలు చిగురిస్తున్నాయి. మంత్రుల వరుస ప్రకటనలు.. అధికారులతో నిర్వహిస్తున్న సమీక్షలతో మరో మూడేళ్లలో కాకతీయ గడ్డపై నుంచి విమానం ఎగురుతుందనే ధీమా సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఎయిర్‌పోర్టుకు 700 ఎకరాల భూమిని అప్పగించగా, మరో 300ఎకరాల భూమిని కేటాయించాలని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ప్రభుత్వాన్ని కోరింది. అయితే హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కావాల్సిన భూసేకరణపై దృష్టి పెట్టింది. వరంగల్ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మాణం చేపట్టి 2027-28 నాటికి అందుబాటులోకి తేవాలని కసరత్తు చేస్తోంది.



- మంత్రుల వరుస ప్రకటనలతో చిగురిస్తున్న ఆశలు
- మామునూరు విమానాశ్రయ పూర్తికి ప్రభుత్వం కసరత్తు
- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు
- 150కి.మీ.ల నిబంధన సడలింపునకు జీఎంఆర్ అంగీకారం
- ఇప్పటికేస్కై అండ్ ల్యాండ్ సర్వే పూర్తిచేసిన ఏఏఐ
- భూసేకరణపై సర్కారు దృష్టి.. పరిసర ప్రాంతాల రైతులతో చర్చలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

నిజాం కాలంలోనే రయ్ రయ్ మంటూ గాలిలో ఎగిరిన మామునూరులో. నేటి తరానికి గగన ప్రయాణం అందుబాటులో లేకుండా పోయింది. 1930లో చివరి నిజాం మీర్ ఉస్మాన్‌అలీ ఖాన్ మామునూరులో విమానాశ్రాయం ఏర్పాటు చేశారు. షోలాపూర్‌లోని వ్యాపారాభివృద్ధికి, అజంజాహి వస్త్ర పరిశ్రమ, కాగజ్‌నగర్ కాగితపు పరిశ్రమలకు ఉపయోగపడేలా దీన్ని ఏర్పాటు చేశారు. 1981 వరకు మామునూరు విమానాశ్రాయం ద్వారా రాకపోకలు జరిగాయి. 1970లో భారత్, చైనా మధ్య జరిగిన యుద్ధం నేపథ్యంలో ఢిల్లీలో విమానాలు ల్యాండ్ అయ్యే పరిస్థితి లేనప్పుడు కూడా మామునూరు నుంచే సైన్యాన్ని పంపించారు. కార్గిల్ యుద్ధ సమయంలో కూడా ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు ప్రత్యామ్నాయంగా మామునూరు ఎయిర్‌పోర్టును వాడుకునేందుకు సిద్ధం చేశారు. అంతటి చరిత్ర ఉన్న మామునూరు విమానాశ్రయం 1981 తరువాత ఓరుగల్లువాసులకు మాత్రం ఉపయోగపడటం లేదు. కానీ పాతికేళ్ల తరువాత ఈ విమానాశ్రయం విషయంలో కదలిక వచ్చింది. ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చొరవతో మరో మూడేళ్లలో వరంగల్‌లో విమానం ఎగరబోతోందన్న ఆశలు చిగురిస్తున్నాయి.

150కి.మీల నిబంధన తొలిగినట్టే

హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్న జీఎంఆర్ సంస్థతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఒప్పందం మేరకు 150కి.మీ పరిధిలో 2038 వరకు మరో వాణిజ్య విమానాశ్రయం ఉండకూడదనే నిబంధనను పెట్టుకుంది. ఈ నిబంధన ప్రకారం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మామునూరుకు మధ్య దూరం 145కిలో మీటర్ల లోపే ఉంది. ఈ నిబంధనల సడలింపుపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లుగా అభ్యర్థన చేస్తూనే వచ్చింది. కానీ ఆ సంస్థ తన నిబంధనను సడలించేందుకు సానుకూలత వ్యక్తం చేయలేదు. దీంతో వరంగల్ ఎయిర్‌పోర్టు పనులు ముందుకు సాగటం లేదు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ ఎయిర్‌పోర్టుపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. ఈ

మిగతా 8లో...

ఎయిర్‌పోర్టుకు త్వరితగతిన భూసేకరణ చేయాలి

- ప్రతీ 15రోజులకోసారి సమీక్షిస్తాం..
- ఉన్నతాధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

వరంగల్ ఎయిర్ పోర్టుకు అవసరమైన భూసేకరణను త్వరితగతిన పూర్తిచేయాలని, రైతులను ఒప్పించి సమీకరించాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉన్నతాధికారులకు సూచించారు. వరంగల్ ఎయిర్‌పోర్టు నిర్మాణంపై బుధవారం ఆయన సచివాలయంలోని ఆయన చాంబర్‌లో మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి ఏవియేషన్ డైరెక్టర్ భరత్‌రెడ్డి, ఆర్అండ్‌బీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్‌రాజ్, స్పెషల్ సెక్రెటరీ దాసరి హరిచందనతో పాటు ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వరంగల్ ఎయిర్ పోర్టులో తాత్కాలిక ఏర్పాటుకంటే భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిర్మాణ పనులు చేపట్టాలని, గత ప్రభుత్వం మాదిరిగానే హామీలతో కాలం గడిపితే అర్థం ఉండదన్నారు. ఈ విమానాశ్రయ నిర్మాణం విషయమై ప్రతీ పదిహేను రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉడాన్ పథకంలో వరంగల్ ఎయిర్‌పోర్టును అనుసంధానం చేసి, పెద్ద పట్టణాలకు వరంగల్ నుంచి ఎయిర్ కనెక్టివిటీ ఏర్పాటు చేయాలని కోరారు. యునెస్కో గుర్తింపు పొందిన రామప్పతో పాటు భద్రకాళి, వేయిస్తంభాల ఆలయం, వరంగల్ కోట, ఇతర కాకతీయ కట్టడాలు, మెగా టెక్స్‌టైల్ పార్కు అవసరాలు, భవిష్యత్ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఎయిర్‌పోర్టును తీర్చిదిద్దాలని మంత్రి అధికారులకు సూచించారు.



వరంగల్ విమానాశ్రయ నిర్మాణంపై జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి, పక్కన ఎమ్మెల్యే కడియం



నర్సంపేట మండలంలో పాత మగ్దుంపురంలో హౌస్ స్టిక్కరింగ్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ సత్యశారద

సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలి

- వరంగల్ కలెక్టర్ సత్యశారద వెల్లడి
- పాతమగ్దుంపురంలో హౌస్ స్టిక్కరింగ్ పరిశీలన

నర్సంపేట టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని, ఏమైనా అనుమానాలుంటే అడిగి తెలుసుకొని పూర్తి సమాచారం అందించాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. బుధవారం నర్సంపేట మండలం పాత మగ్దుంపురం గ్రామంలో ప్రారంభమైన హౌస్ స్టిక్కరింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజలతో సర్వేపై అవగాహన కల్పించారు. అనంతరం విలేకరులతో కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో ఈ నెల 8 వరకు సర్వేపై అవగాహన కల్పించడం, హౌస్ స్టిక్కరింగ్ ప్రక్రియ జరుగుతుందని, ఈ నెల 9 నుంచి సర్వే ప్రారంభమవుతుందన్నారు. జిల్లాలో 2 లక్షల 63వేల ఇండ్లు ఉన్నాయని, వీటిని 1,841 మంది ఎన్యుమరేటర్స్‌తో సర్వే చేయిస్తామన్నారు. ప్రజలకు వారి ఇళ్లకు ఎన్యుమరేటర్స్ ఎప్పుడు వస్తారనే విషయం ముందే తెలియజేస్తారన్నారు. ఎలాంటి అనుమానాలున్నా వాటిని ఎన్యుమరేటర్స్‌ను అడిగి నివృత్తి చేసుకోవాలని కోరారు. సర్వేలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్స్, ఆశ వర్కర్లు, సీఆర్‌పీలు ఉంటారని, వీరిపై సూపర్‌వైజర్‌ల పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు ఉదయం నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యార్థులకు పాఠాలు బోధిస్తారని, మధ్యాహ్నం 2 గంటల నుంచి సర్వేలో విధుల్లో పాల్గొంటారన్నారు. ప్రతీ ఒక్క ఎన్యుమరేటర్ ప్రతీ రోజు 10 ఇళ్లను, 15 రోజుల్లో 150 ఇళ్లను సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. నర్సంపేట మండలంలో 95 మంది ఎన్యుమరేటర్స్ సర్వే చేస్తారని, వీరిపై 9 మంది సూపర్‌వైజర్‌ల పర్యవేక్షణ ఉంటుందని కలెక్టర్ సత్యశారద వివరించారు.

సమగ్ర సమాచారంతో సర్వే నిర్వహించండి

వరంగల్ చౌరస్తా: సమగ్ర సమాచారంతో సర్వే నిర్వహించాలని మేయర్ గుండు సుధారాణి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా బుధవారం నుంచి సర్వే ప్రారంభించిన నేపథ్యంలో మేయర్ ప్రాతినిత్యం వహిస్తున్న 29వ డివిజన్ రామన్నపేటలో గల కుంటిభద్రయ్య ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేయర్, కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి దేశానికి ఆదర్శంగా నిలిచేలా రాష్ట్రంలో సమగ్ర కుల గణన సర్వే నిర్వహించడానికి చర్యలు చేపట్టారన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎన్నికల మేనిఫెస్టోలో తెలిపిన విధంగా కుల గణన అంశాన్ని చేర్చారన్నారు. ఇచ్చిన హామీకి కట్టుబడి తెలంగాణలో తొలిసారిగా కుల గణన చేపట్టడం హర్షనీయమని అన్నారు. సర్వే నిర్వహణకు

మిగతా 6లో...

జమిలీ ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధం

- రూ.2లక్షల రుణమాఫీ చేయకపోతే రాష్ట్రానికి చెడ్డ పేరు
- స్థానిక సంస్థల ఎన్నికల పోరుపై పార్టీలో విధి విధానాల కసరత్తు
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న చాడా వెంకట్‌రెడ్డి

భీమదేవరపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జమిలీ ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధం అని, అలా చేస్తే దేశంలో ప్రజాస్వామ్య ఖూనీ అవుతుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో 29 రాష్ట్రాలు ఉండగా, విభిన్న రాష్ట్రాల్లో వివిధ రకాల సంస్కృతి, ఆచార వ్యవహారాలు ఉంటాయన్నారు. అలాంటప్పుడు జమిలీ ఎన్నికలు ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించిందని, దానిని పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో రూ.7లక్షలకోట్ల అప్పులు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందని, కాంగ్రెస్ నాయకులు పేర్కొంటున్నారన్నారు. రాష్ట్రంలో రుణమాఫీ కోసం రూ.31వేల కోట్లు అవసరమవుతాయని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.18 వేల కోట్లతో రూ.2లక్షల లోపు ఉన్న రైతులకు రుణమాఫీ చేసిందన్నారు. మిగతా రైతులకు రుణమాఫీ చేయకపోతే రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందన్నారు. అలాగే పెన్షన్ల పెంపు, కొత్త పెన్షన్లు ఇవ్వాలన్నారు. గృహలక్ష్మి పథకం కింద కొత్త ఇళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. అలాగే రాష్ట్రంలో నిరుపేదలు ఖాళీ స్థలాల్లో వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇవ్వాలన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ పార్టీ పోషించే పాత్రపై విధి విధానాలను పార్టీలో అంతర్గతంగా చర్చిస్తామన్నారు. స్థానిక సంస్థల విషయంపై త్వరలోనే కార్యాచరణ రూపొందించి వివరిస్తామన్నారు. అలాగే ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేకపోతే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి చెడ్డ పేరు వస్తుందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, శ్రీనివాస్, రమాదేవి, తిరుపతి, కిషన్, కుమారస్వామి, బొడె బాలరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ చొరవతో మారనున్న నగర రూపురేఖలు

- వరంగల్ సమగ్రాభివృద్ధికి సీఎం కృషి
- త్వరలో నెరవేరనున్న మామునూరు ఎయిర్‌పోర్టు కల
- మీడియా సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య, చిత్రంలో కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద, ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు, మేయర్ సుధారాణి, నగర కమిషనర్

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చూపుతున్న చొరవతో వరంగల్ మహా నగర రూపురేఖలు మారబోతున్నాయని, నగర సమగ్రాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు. నగరాభివృద్ధిపై మంగళవారం హైదరాబాద్‌లో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్.. పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. ఆ సమావేశానికి సంబంధించిన వివరాలను బుధవారం మేయర్, ఎమ్మెల్యేలు, కలెక్టర్లతో కలిసి హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంపీ వెల్లడించారు. వరంగల్‌ను రెండో రాజధానిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సీఎం కృషి చేస్తున్నారని, మామునూరు ఎయిర్‌పోర్ట్ కల త్వరలోనే నెరవేరబోతోందని, ఎయిర్‌పోర్టుకు ఇంకా అవసరమైన 253 ఎకరాలను సేకరించేందుకు కసరత్తు జరుగుతోందన్నారు. అలాగే నగర పరిధిలో నష్కల్ నుంచి చింతలపల్లి వరకు రైల్వేలైన్ రాబోతోందని, అలాగే ఇప్పటికే నష్కల్ నుంచి హసన్‌పర్తి రైల్వేమార్గానికి రైల్వేబోర్డు ఆమోదం లభించిందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఉపయోగపడేలా వెల్‌నెస్ సెంటర్ మంజూరైందని, దానికి సంబంధించిన స్థలాన్ని గుర్తించామన్నారు. వెల్‌నెస్ సెంటర్, కోచ్‌ఫ్యాక్టరీ, పురావస్తు తదితర అంశాలున్నాయని పేర్కొన్నారు. త్వరలోనే వరంగల్ నగరంలో అభివృద్ధి పనులను త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారని వెల్లడించారు. అలాగే వరంగల్ సైనిక్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీ కావ్య పేర్కొన్నారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. నగర ప్రజల చిరకాల వాంఛ అయిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థతో పాటు మాస్టర్‌ప్లాన్ అమలుకు

మిగతా 6లో...

'సదర్' అదుర్స్





- గోకుల్‌నగర్‌లో అంబరాన్నంటిన సంబరం
- విరజిమ్మిన విద్యుత్ కాంతులు.. అలరించిన ఆట పాట
- ప్రత్యేక ఆకర్షణగా దున్నపోతుల విన్యాసం
- ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్

సదర్ ఉత్సవంలో దున్నపోతు విన్యాసాలు

8

భద్రకాళి చెరువుకు మహర్దశ

- నేటి నుంచి అభివృద్ధి పనులు ప్రారంభం
- పూడిక, గుర్రపు డెక్క, చెత్తా చెదారం తొలగింపు
- 30 రోజుల పాటు మత్తడి, తూముల ద్వారా నీటి తొలగింపు
- నాలుగు శాఖల సమన్వయంలో పనులు ప్రారంభం
- 2050 మాస్టర్ ప్లాన్‌కు ప్రభుత్వం శ్రీకారం

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విజన్-2050లో భాగంగా రూపొందించిన వరంగల్ మాస్టర్ ప్లాన్ అడుగులు శరవేగంగా పడుతున్నాయి. అనుకున్నదే తడవుగా పనులు ప్రారంభించాలని అధికారులను మంత్రులు ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎంసీహెచ్ఆర్‌డీవో కార్యాలయంలో ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నిర్వహించిన సమీక్షలో మంత్రి, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, కమిషనర్‌తో పాటు అధికారులు పాల్గొని వరంగల్ జిల్లా అభివృద్ధిపై చర్చించారు. ఈ క్రమంలో బుధవారం వరంగల్, హనుమకొండ కలెక్టర్లు సత్యశారదాదేవి, ప్రావీణ్యలతో పాటు బల్దియా కమిషనర్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాస్టర్‌ప్లాన్ భాగంలో ముందుగా భద్రకాళి చెరువు పనులు చేపట్టాలని సంబంధిత శాఖలను అప్రమత్తం చేశారు. దీంతో భద్రకాళి చెరువుకు మహర్దశ రాబోతోంది. గురువారం నుంచి భద్రకాళి చెరువును ప్రక్షాళన చేయనున్నారు. ప్రధానంగా భద్రకాళి చెరువులో వందేళ్లుగా పేరుకుపోయిన డిసిల్టేషన్ (పూడిక మట్టి) డిసిల్ట్ వాటర్ తొలగింపు ప్రక్రియ ప్రారంభిస్తారు. చుట్టు పక్కల ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా సుమారు 382 ఎకరాల్లో పేరుకుపోయి ఉన్న పూడిక మట్టితో పాటు గుర్రపు డెక్క, చెరువులో ఉన్న చెత్తా, చెదారాన్ని ప్రణాళికాబద్ధంగా తొలగిస్తారు.

నేటి నుంచి నెల రోజుల పాటు భద్రకాళి మత్తడితో పాటు తూముల ద్వారా నీటిని బయటకు పంపిస్తారని కుడా అధికారులు వెల్లడించారు. నాగారం, పరకాల చలివాగులోకి భద్రకాళి చెరువు నీటిని పంపించిన తర్వాత చెరువును పూర్తిగా ఎండబెడతారు. తర్వాత చెరువు మధ్యలో నుంచి పెద్ద పెద్ద క్రేన్‌ల సహాయంతో చెరువు కట్టల చివరి వరకు తీసిన మట్టిని కట్టకు ఎత్తుగా పోస్తారని తెలిపారు. సుమారు మూడు నుంచి ఆరు మాసాల వరకు చెరువులో నుంచి పూడిక మట్టితీసే కార్యక్రమం జరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పూడికతీత, అభివృద్ధికి సంబంధించిన వ్యయం ఇప్పుడే చెప్పలేమని, వ్యయ ప్రణాళికలు నీటి పారుదల శాఖ వెల్లడిస్తుందని అధికారులు తెలిపారు.

సమీప ప్రాంతాల ప్రజల హర్షం

భద్రకాళి చెరువులో పేరుకుపోయి ఉన్న మట్టి, గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలను తొలగిస్తున్నారని తెలుసుకున్న చుట్టుపక్క ప్రాంతాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చెరువులో పూడికతీత పనులు చేపట్టడం వల్ల చెరువు నీటి మట్టం పెరుగుతుందని బల్దియా ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. అంతే కాకుండా భద్రకాళి చెరువు చుట్టుపక్క ప్రాంతాల్లో నివసించే ప్రజలకు నీటి సమస్య తప్పుతుందని, బోర్లు, బావులలోకి సమృద్ధిగా నీరు వచ్చి చేరుతుందని అధికారులు తెలిపారు. నీరు తరలిస్తున్న సమయంలో చెరువు కింది భాగంలో ఉన్న ప్రజలు కాల్వలకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. నీరు ప్రవహించే సమయంలో నీటి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు వెల్లడించారు.

పూడికతీతకు చర్యలు తీసుకోవాలి

హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి చెరువు పూడికతీత పనులకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద, వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేలతో కలిసి కలెక్టర్ ప్రావీణ్య బుధవారం వరంగల్ జిల్లాల పరిధిలో వివిధ అభివృద్ధి, వాటి పురోగతికి సంబంధించిన అంశాలపై రెవెన్యూ, సాగునీటి పారుదల, కుడా, మున్సిపల్, జిల్లా పంచాయతీ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రావీణ్య మాట్లాడుతూ భద్రకాళి చెరువులో పూడికతీత పనులు చేపట్టేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. చెరువు నీరు బయటకు తీసేటప్పుడు నగరం నుంచి వెళుతున్న మురుగునీటి కాల్వలు, కల్వర్టులను శుభ్రం చేయడం ద్వారా ఇబ్బందులు ఎదురుకావన్నారు. 382 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భద్రకాళి చెరువులో పూడికతీత కారణంగా నీటి నిల్వ సామర్థ్యం తగ్గిందని, వర్షాకాలంలో బొంది వాగు వరదనీరు భద్రకాళి చెరువులో నిల్వ ఉండటంతోపాటు భూగర్భ జలాలు పెరిగే విధంగా వెంటనే భద్రకాళి చెరువును పూడికతీయాలని నిర్ణయించామన్నారు. ఈ సమావేశంలో కుడా పీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావు, డీపీవో లక్ష్మీరమాకాంత్, తహసీల్దార్లు, ఐబీ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సీఎంకు చెక్కును అందజేస్తున్న మార్నేని రవీందర్‌రావు

సీఎం సహాయ నిధికి రూ.1.50 కోట్ల విరాళం

ముఖ్యమంత్రికి చెక్కును అందజేసిన టెస్కాబ్ చైర్మన్

హనుమకొండ సిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వరదలతో నష్టపోయిన బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు రూ.1.50కోట్ల విరాళం అందచేశారు. బుధవారం హైదరాబాద్ లోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఆయన రేవంత్‌రెడ్డిని కలిశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో ముఖ్య మంత్రికి రవీందర్‌రావు రూ.1.50కోట్ల చెక్‌ను అందచేశారు. టెస్కాబ్, డీసీసీబీ, సొసైటీ ఉద్యోగులు తమ వేతనం నుంచి విరాళానికి డబ్బులు అందచేసినట్లు రవీందర్‌రావు తెలిపారు. వరద బాధితులను మానవతాదృక్పథంతో ఆదుకునేందుకు సహాయం చేయడం అభినందనీయమంటూ రవీందర్‌రావును సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు.

మెడికల్ సీట్లు సాధించిన హోంగార్డుల పిల్లలు

ట్యాబ్‌లు అందజేసిన సీపీ




ట్యాబ్‌లను అందచేస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

హనుమకొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మెడికల్ సీట్లు సాధించిన హోంగార్డుల పిల్లలకు వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ట్యాబులను అందజేశారు. వైద్య విద్యకు సంబంధించి వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో హోంగార్డులుగా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ కుమార్తె మీనాక్షి నార్కెట్‌పల్లి కామినేని మెడికల్ కళాశాలలో కన్వీనర్ కోటాలో సీటు సాధించగా, మరో హోంగార్డు కుమారస్వామి కుమారుడు డేవిడ్‌రాజ్ నల్లగొండ లో ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మెడిసిన్ సీటును సాధించాడు. ఈ సందర్భంగా మెడికల్ సీట్లు పొందిన పిల్లలను సీపీ అంబర్ కిశోర్ ఝా అభినందించడంతో పాటు సిబ్బంది పిల్లలను మరింత ప్రోత్సహించడం కోసం ట్యాబ్‌లను అందచేశారు. కార్యక్రమంలో పోలీసు సంక్షేమాధికారి ఆర్ఐ సతీష్ పాల్గొన్నారు.

పీఆర్టీయూదే పదోన్నతులు, బదిలీల ఘనత

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు ప్రభుత్వం చేపట్టడం వెనక పీఆర్టీయూ కృషి, ఘనత ఉందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండలోని పీఆర్టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వాలు పాలిస్తున్న వాటితో సఖ్యతగా ఉంటూనే సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేసే సంఘం పీఆర్టీయూదేనన్నారు. రాబోవు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీ యూ అభ్యర్థినైన తనను గెలిపిస్తే సీపీఎస్ రద్దు కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి. దామోదర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.మోహన్‌రెడ్డి, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బి.కమలాకర్‌రావు, జి.లక్ష్మణ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎం.తిరుపతిరెడ్డి, ప్రధానకార్యదర్శి పి.శ్రీహరి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఇ.రవీందర్‌రెడ్డి, నాయకులు టి.శ్రీనివాస్, టి. సూరిబాబు, రాజిరెడ్డి, జి.విజయ్ కుమార్, కె.రఘు, సురేందర్, ఎస్.మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆగిన పనులు.. ప్రమాదకరంగా పైపులు..



నగర అభివృద్ధి ప్రణాళికలో భాగంగా గత ప్రభుత్వ హయాంలో స్మార్ట్‌సిటీ కింద మంజూరైన నిధులతో ఐదేళ్ల క్రితం పలు పనులను ప్రారంభించారు. కానీ కొన్ని పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ముఖ్యంగా హనుమకొండ నగరంలోని లేబర్ కాలనీ నుంచి ఎనుమాముల వెళ్లే దారిలో చేపట్టిన డ్రెయినేజీ పనులు నిలిచిపోవడంతో సుమారు మూడు కిలోమీటర్ల మేర ఆ పైపులను రహదారి మధ్యలో పెట్టారు. అవి ఐదేళ్లుగా అక్కడే ఉన్నాయి. ఫలితంగా ఈ రహదారిలో పలు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ దారిలో ఆగిపోయిన పనులను త్వరతగతిన పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు

- ఫొటో : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటో గ్రాఫర్ హనుమకొండ

క్రైం కార్నర్

వ్యక్తి అదృశ్యం

వరంగల్ చౌరస్తా, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. కాశిబుగ్గకు చెందిన ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకుడు నామని రమేష్ (43) ఈనెల 5న ఉదయం 9 గంటలకు పనినిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో రమేష్ భార్య ఉమాదేవి ఇంతెజార్‌గంజ్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ షుకూర్ తెలిపారు.

వ్యక్తిపై దాడి.. పలువురిపై కేసు..

మడికొండ, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): మడికొండలో వ్యక్తిపై దాడి చేసిన పలువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల మేరకు.. బుధవారం మడికొండ వడ్డెర కాలనీకి చెందిన వల్లెపు రాజేష్ అదే కాలనీకి చెందిన జట్‌పట్ సామ్యేల్, భాను, శంకర్, రాజ్‌కుమార్ మాట్లాడుకుంటున్న క్రమంలో రాజేష్ ఏదో అన్నాడని సామ్యేల్, భాను, శంకర్, రాజ్‌కుమార్ నలుగురు కలిసి రాజేష్‌ను దుర్భాషలాడుతూ చంపుతామని బెదిరించడంతో పాటు భౌతిక దాడికి పాల్పడ్డారు. బాధితుడు రాజేష్ ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మడికొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మడికొండ నుంచి తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని వేర్వేరు చోట్ల పోలీసులు పట్టుకున్నారు. స్థానిక ఏఎస్సై చంద్రమౌళి తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా సిద్దారం గ్రామానికి చెందిన కోఫూరి వెంకటేశ్వర్లు కొంత కాలంగా మడికొండలోని మెట్టురామన్న కాలనీలో నివాసం ఉంటున్నారు. వెంకటేశ్వర్లు అక్కడక్కడా తక్కువ ధరకు పీడీఎస్ బియ్యం సేకరించి వేరే చోట ఎక్కువ ధరకు విక్రయిస్తుంటాడు. బుధవారం రూ.12 వేలు విలువ కలిగిన 5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని ఆటోలో తరలిస్తూ సత్యసాయి కన్వెన్షన్ హాల్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డాడు. పోలీసులు ఆటోను, బియ్యాన్ని సీజ్ చేసి వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎఎస్సై తెలిపారు. అలాగే కోఫూరి వెంకటేశ్వర్లు సోదరుడైన కోఫూరి నవీన్ పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా అయోధ్యాపురం రైల్వే గేట్ వద్ద పోలీసులు పట్టుకుని ఆటో, 4 క్వింటాళ్ళ బియ్యం సీజ్ చేసి నవీన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎఎస్సై చంద్రమౌళి తెలిపారు. వీటి విలువ సుమారు 10 వేలు ఉంటుందని పేర్కొన్నారు.

సెమీ ఫైనల్స్‌కు చేరిన ఖమ్మం, ఆదిలాబాద్ జట్లు



అండర్-23 బాలుర క్రికెట్ టోర్నీలో సెమీస్‌కు చేరిన ఆదిలాబాద్ జట్టు

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 6: (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలో వివిధ క్రికెట్ క్రీడా మైదానాల్లో నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల అండర్-23బాలుర క్రికెట్ పోటీల్లో ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లా జట్లు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. బుధవారం హనుమకొండ రెడ్డిపురంలోని టీవీవీఎస్ క్రికెట్ క్రీడా మైదానంలో ఆదిలాబాద్ వర్సెస్ వరంగల్ జిల్లా జట్ల మధ్య నిర్వహించిన లీగ్ మ్యాచ్‌లో ఆతిథ్య వరంగల్ జట్టుపై 34పరుగుల తేడాతో ఆదిలాబాద్ జట్టు ఘన విజయం సాధించి సెమీ ఫైనల్స్‌కు చేరుకుంది. అదే విధంగా మొగిలిచర్ల క్రీడా మైదానంలో ఖమ్మం వర్సెస్ మహబూబ్‌నగర్ జట్ల మధ్య నిర్వహించిన లీగ్ పోటీల్లో ఖమ్మం జట్టు మహబూబ్‌నగర్ జట్టుపై 66పరుగుల ఆధిక్యంతో వరుసగా మూడోసారి విజయం సాధించి సెమీ ఫైనల్స్‌కు అర్హత సాధించింది.

ఈ మేరకు సెమీ ఫైనల్స్‌కు అర్హత సాధించిన ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లా జట్లను వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ అభినందించి అనంతరం మాట్లాడారు. అంతర్ జిల్లా స్థాయిలో నగరంలో వివిధ క్రీడా మైదానాల్లో అండర్-23 బాలుర క్రికెట్ టోర్నీలో వరంగల్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, ఖమ్మం నాలుగు జట్ల మధ్య లీగ్ కం నాకౌట్ పద్ధతిన నిర్వహించిన పోటీల్లో ఖమ్మం, ఆదిలాబాద్ జట్లు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయన్నారు. సెమీఫైనల్స్‌కు చేరిన ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల జట్లు ఈ నెల 8నుంచి మెదక్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న టోర్నీలో పాల్గొంటారని తెలిపారు.

పుస్తక పఠనంతోనే ప్రపంచ జ్ఞానం

ఎంపీ డాక్టర్ కడియం కావ్య



పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య

హనుమకొండ చౌరస్తా, నవంబరు 6: (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో ప్రపంచ జ్ఞానం సాధ్యం అవుతుందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు. బుధవారం జాతీయ పుస్తక వారోత్సవాలు, బాలల దినోత్సవం సందర్భంగా హనుమకొండ అశోక కాంప్లెక్స్‌లోని నవచేతన బుక్ హౌస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ.. పుస్తకాలు విజ్ఞాన నేస్తాలని, సాంకేతికత ఎంతగా పెరిగినా పుస్తకాలకు ఉన్న ప్రాధాన్యత తగ్గలేదన్నారు. పిల్లలను తల్లిదండ్రులు.. విద్యార్థులను ఉపాధ్యాయులు పుస్తకాలు చదివేలా ప్రోత్సహించాలన్నారు. పుస్తక పఠనం ద్వారా మెరుగైన, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో బుక్ హౌస్ మేనేజర్ ఎర్ర నాగరాజు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, అరసం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పల్లేరు వీరస్వామి, డాక్టర్ ఎం.డి. నజీర్, టీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకనాల సంతోష్, వివిధ సంఘాల నాయకులు నేదునూరి రాజ మౌళి, దొమ్మాటి ప్రవీణ్, దండు మోహన్, ఎ.మురళి, ఎం.డి. ఉస్మాన్‌పాషా, తాండూరి గోపి, ప్రభాకర్, ఎం.సాంబయ్య విద్యాలయ హైస్కూల్ ప్రిన్సిపాల్ బి.ఇంద్రారెడ్డి, నవ చేతన బుక్ హౌస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

శంభునిపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌లో నవంబరు 10, 11 తేదీలలో నిర్వహించనున్న తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) ఆరో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని టీయూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జాటోతు లకుపతి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. బుధవారం శంభునిపేట ప్రభుత్వ పాఠశాలలో టీయూటీఎఫ్ మహాసభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఉపాధ్యాయులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో ఉపాధ్యాయులు చేసిన పోరాటాలు మరువలేనివన్నారు. సమైక్య పాలనలో తెలంగాణలో విద్యా రంగం అణచివేతకు గురైందన్నారు. సమైక్యవాద సిద్ధాంతంతో పనిచేస్తున్న ఫెడరేషన్‌ను విభేదించి 2011లో టీయూటీఎఫ్ ఆవిర్భవించిందన్నారు. ఉపాధ్యాయుల హక్కుల కొరకు నిర్వహించే ఈ మహాసభలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

సర్వేకు ప్రజలు సహకరించాలి

(5వ పేజీ తరువాయి)

ఎన్యుమరేటర్లు నగరవ్యాప్తంగా ఉన్న అన్ని ఇళ్లను సందర్శించి సర్వే నిర్వహిస్తారని మేయర్ తెలిపారు. వారు కోరిన సమాచారాన్ని అందజేయాలని కోరారు. అనివార్యకారణాల వల్ల ఏదైనా గృహం నుంచి సమాచార సేకరణ జరుగకపోతే మళ్లీ సర్వే నిర్వహించాలన్నారు. సమావేశం అనంతరం ఎన్యూమరేటర్లు సర్వే స్టిక్కర్లను గృహాలకు అంటిస్తున్న తీరును మేయర్, కమిషనర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బల్దియా అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, ఈఈలు మహేందర్, సంతోష్‌బాబు, 29వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి పూర్ణచందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సర్వేను ప్రారంభించిన మేయర్ గుండు సుధారాణి

ప్రభుత్వ చొరవతో మారనున్న నగర రూపురేఖలు

(5వ పేజీ తరువాయి)

కొంత సమయం పడుతున్నా ప్రత్యేక అధికారి నియామకంతో పనుల్లో పురోగతి ఉంటుందన్నారు. భద్రకాళి చెరువులో 30 ఏళ్లుగా పూడిక పేరుకుపోవడంవల్ల నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయిందని, చెరువును ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్‌లో పర్యటించి.. వరాలు కురిపించబోతున్నారన్నారు. భద్రకాళి చెరువును పూర్తిస్థాయిలో తాగునీటి వనరుగా మార్చాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. నీటి విడుదల పూర్తయిన వెంటనే చెరువు శుద్ధి పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. భద్రకాళి మాడవీధుల అభివృద్ధి, నాలాల విస్తీర్ణం, కాజీపేట ఆర్వోబీ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. రాహుల్‌గాంధీ ఇచ్చిన మాట ప్రకారం దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా సీఎం రేవంత్‌రెడ్డి కులగణన సర్వే ప్రారంభించారన్నారు.

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. తన నియోజకవర్గంలో మామునూరు ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు చర్యలు వేగవంతంగా చేపట్టామని, అదేవిధంగా ఔటర్‌రింగ్‌రోడ్డు, ఇన్నర్ రింగ్‌రోడ్డు ఏర్పాటు నిమిత్తం భూనిర్వాసితులకు పరిహారం త్వరగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో జరిగిన సమీక్షలో ఇన్నర్ రింగ్‌రోడ్, ఔటర్ రింగ్‌రోడ్, భద్రకాళి మాఢ వీధుల నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటు, మెగా టెక్స్‌టైల్ పార్క్, ఎయిర్‌పోర్ట్, సైన్స్ సెంటర్, రైల్వే ఓవర్ బ్రిడ్జి ఎకో పార్క్ తదితర అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించామన్నారు.

గతంలో 382ఎకరాల్లో ఉన్న భద్రకాళి చెరువుకు వర్షాకాలంలో బొంది వాగు వరద నీరు చేరుతుందని, పూడిక తీసి నిల్వ సామర్థ్యం పెంచబోతున్నామన్నారు. ఇందుకోసం నీటిపారుదల శాఖ అధికారులు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. బల్దియా, పంచాయతీ శాఖల ఆధ్వర్యంలో అధికారుల ద్వారా బృందాలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యం చేయాల్సిందిగా ఆదేశించారు. స్మార్ట్‌సిటీ పథకం కింద చేపడుతున్న భద్రకాళి బండ్ సుందరీకరణ పనులను కూడా నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంటింటి కుటుంబ సర్వేలో ప్రజలు తమ వివరాలను అందించి గణకులకు సహకరించాలన్నారు. వరంగల్ కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజి వాకడే పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి


బూట్లు పంపిణీ చేస్తున్న ఏసీపీ విజయ్‌కుమార్

ఖిలావరంగల్, నవంబర్ 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుకొని భవిష్యత్తులో రాణించాలని వరంగల్ సైబర్‌క్రైం ఏసీపీ కె.విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం ఖిలావరంగల్ వ ౹ధ్యకోటలోని ప్రభుత్వ సహాయక ఆర్యా బాలుర ఉన్నత పాఠశాల 60వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పాఠశాల చైర్మన్ గుజ్జారి రమేష్‌బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. విద్యార్థులు ప్రాథమిక స్థాయినుంచి కష్టపడి చదువుకొని తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు. ఈ సందర్భంగా యూఎస్‌లో ఉంటున్న శ్వేత, హర్షవర్థన్‌లు పాఠశాలలోని 80 మంది వి ద్యార్థు లకు బూట్లు, మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, పేదవిద్యార్థులకు బహుమతులను అందజేశారు. ముందుగా గుజ్జారి రామన్న-యశోధ చిత్రపటాలకు పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ రమేష్‌బాబు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయో దుడు గుజ్జారి రామన్న-యశోధల స్మారకార్థం ఏర్పాటు చేసిన పాఠశాలలో ఎంతోమంది పేద విద్యార్థులు చదువు కొని ఉన్నత స్థానంలో రాణిస్తున్నార న్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వి.రవి, ఉపాధ్యాయులు తిరునహరి. నరేందర్, బెల్లంకొండ పూర్ణచందర్, బిక్షపతి, ఎం.మనోజ్‌గౌడ్, గణేష్, సునిత, జ్యోష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

హసన్‌పర్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ వి ద్యార్థులు విషయపరిజ్ఞానంతో పాటు సాంకేతిక పరిజ్ఞా నాన్ని పెంపొందించుకుంటే భవిష్యత్ అని నిట్ వరంగల్ ప్రొఫెసర్ సురేష్‌బాబు అన్నారు. బుధవారం అనంతసాగర్ సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగే సాంకేతిక, సాంస్కృతిక కార్యక్రమం ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.రాజశ్రీరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సురేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థినులు ఇలాంటి సాంకేతిక, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా నైపుణ్యాలను మెరుగుపర్చుకోవచ్చన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.రాజశ్రీరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు వివిధ రకాల క్లబ్‌లను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా నృత్యాలు, షార్ట్ ఫిలిం, క్రాఫ్ట్ ఎక్స్‌పో, ర్యాప్ వాక్ వంటి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేస్తామని ప్రోగ్రాం కన్వీనర్లు ఎం.రంజిత్‌కుమార్, ప్రత్యూషరెడ్డి తెలిపారు.



మాట్లాడుతున్న వరంగల్ నిట్ ప్రొఫెసర్ సురేష్‌బాబు

సమస్యలు పరిష్కరించాలి

అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రేషన్ డీలర్లు


అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందచేస్తున్న రమేశ్‌బాబు

హనుమకొండ సిటీ, నవంబరు 6: సుదీర్ఘకాలంగా ఉన్న రేషన్ డీలర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేశ్‌బాబు కోరారు. ఈ మేరకు బుధవారం హనుమకొండ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డిని కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందచేశారు. రేషన్‌కార్డుకు రూ.5కిలోల గోధుమల కేటాయింపుతో పాటు కచ్చితమైన కొలతలతో 50 కిలోల బియ్యం బస్తాలు సరఫరా అయ్యేలా కాంటా పెట్టాలని పేర్కొన్నారు. ప్రతీ నెల 31వ తేదీలోగా గోదాముల నుంచి రేషన్ షాపులకు బియ్యం సరఫరా జరగాలని, నెలవారిగా క్రమంగా డీలర్లకు కమీషన్ అందచేయాలనే సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం హనుమకొండ డీఎస్‌వో కొమురయ్యను కూడా కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి చిలగాని మోహన్‌తోపాటు పోతరాజు రమేశ్, బత్తుల మహేశ్, రాజ సాంబయ్య, నిర్మల బాబు, విజయపాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల ధర్నా

కాళోజీ జంక్షన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల హెల్త్‌కార్డులపై రూ.10 లక్షల గరిష్ఠ పరిమితితో కాంట్రిబ్యూషన్ లేకుండా కార్పొరేట్ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం అందించాలని 20 ఏళ్ల సర్వీస్‌కు ఫుల్ పెన్షన్ చెల్లించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తూపురాణి సీతారాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఉదయం హనుమకొండ సబ్ ట్రెజరీ కార్యాలయం ముందు హనుమకొండ జిల్లాలోని అసోసియేషన్‌కు చెందిన 10 యూనిట్ల పెన్షనర్లు ఉమ్మడిగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ.. మెడికల్ రీయింబర్స్‌మెంట్ ఇతర బిల్లులు ఆరు నెలలు దాటి పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో అసోసియేషన్ నాయకులు నారాయణగిరి వీరన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎంఏ రహీం, తాడూరి నిర్మల, జి. మేరి, పరికిపండ్ల వేణు తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు ప్రజలు సిద్ధంగా ఉండాలి

- వరంగల్ బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- బాలసముద్రంలో కమిషనర్ ఇంటింటి సర్వే


బాలసముద్రంలో ఇంటి యజమానులతో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంటింటి సర్వేకు వస్తున్న అధికారులకు అన్ని సమాధానాలు చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. బుధవారం బల్దియా పరిధిలోని 30వ డివిజన్ బాలసముద్రంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను కమిషనర్ ప్రారంభించి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వేలో భాగంగా గృహాలకు గుర్తించి స్టిక్కర్స్ వేస్తున్నామన్నారు. 9వ తేదీ నుంచి వాస్తవ సర్వే మొదలవుతుందన్నారు. సర్వే చేసే ఎన్యుమరేటర్లకు ప్రశ్నావళి బుక్‌లెట్‌ను అందించామన్నారు. బల్దియా పరిధిలో మొత్తం 2,90,969 గృహాలకు సంబంధించి 1,974 మంది ఎన్యుమరేటర్లు, 168 మంది సూపర్‌వైజర్లు సర్వేలో పాల్గొంటారని అన్నారు. సర్వే ద్వారా ఏ ఒక్క ఇల్లు తప్పిపోకుండా సమగ్ర వివరాలు సేకరించి సిబ్బంది నమోదు చేస్తారన్నారు. సర్వే నిర్వహణకు వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించాలని కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రవీందర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు సమగ్ర సమాచారాన్ని సేకరించాలి

హసన్‌పర్తి: సర్వేలో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు ప్రతీ కుటుంబం సమాచారాన్ని సేకరించి నమోదు చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు సూచించారు. మండలంలోని నాగారం గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్యుమరేటర్లు మొదట ప్రతీ ఇంటికి స్టిక్కర్ వేసి కుటుంబ యజమాని వద్ద సమగ్ర సమాచారాన్ని సేకరించి ప్రభుత్వం ఇచ్చిన ప్రొఫార్మాలో నమోదు చేయాలన్నారు. ప్రొఫార్మాలోని ప్రతి కాలంలో పొందుపరిచిన విధంగా ప్రశ్నలకు సమాధానం సేకరించి స్పష్టంగా వివరాలను నమోదు చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట తహసీల్దారు చల్ల ప్రసాద్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో కర్ణాకర్‌రెడ్డి, ఎమ్మార్‌ఐ రాజేంద్రప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

కోటలో కులగణన ప్రారంభం

ఖిలావరంగల్: సమగ్ర కులగణన సర్వేను 38వ డివిజన్ కార్పొరేటర్ బైరబోయిన ఉమా-దామోదర్‌యాదవ్ ఖిలా వరంగల్ కోటలో బుధవారం ప్రారంభించారు. కాపువాడలో నగరపాలక సంస్థ అధికారులు ముందుగా ఇంటింటికి తిరిగి స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కులగణనకు ప్రజలందరూ సహకరించి కుటుంబసభ్యుల వివరాలను అధికారులకు తెలియజేయాలన్నారు. అనంతరం సంబంధిత ఇంటి యజమానుల జనగణన వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తొటకూరి నర్సయ్య, బైరబోయిన రవిందర్, కె.రమేష్, వార్డు ఆఫీసర్ మౌనిక, జవాన్‌లు రూపారాణి, నవీన్, రవి పాల్గొన్నారు.

- గిర్మాజీపేట: ప్రతీ కుటుంబానికి సామాజిక, ఆర్థిక, ఉపాధి, రాజకీయంగా సముచిత ఫలితం దక్కాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబ సమగ్ర సర్వేను ప్రారంభించారని స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ అన్నారు. డివిజన్‌లోని ప్రతీ కుటుంబం తమ సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులను సరైన సమాచారం ద్వారా సమగ్ర సర్వేలో అందించి ప్రభుత్వ లక్ష్యానికి సహకరించాలని ఆయన కోరారు. బుధవారం వరంగల్ నగరంలోని 27వ డివిజన్‌లోని చారిత్రాత్మక గోవిందరాజుల గుట్ట ప్రాంతం నుంచి కార్పొరేటర్ అనిల్ కుమార్ కుటుంబ సమగ్ర సర్వేను ప్రారంభించారు. డివిజన్ సర్వే సూపర్‌వైజర్ పి.అనిల్ ఆధ్వర్యంలో గ్రేటర్ బల్దియా సిబ్బంది గోవింద రాజుల గుట్ట ప్రాంతంలో తమకు కేటాయించిన కుటుంబ సమగ్ర సర్వే గృహాలకు వెళ్లి స్టిక్కర్లు అంటించి సర్వే వివరాలను ఇంటి యజమానులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎండీ. అయూబ్, 27వ డివిజన్ అధ్యక్షుడు కమల్, నాయకులు అన్వేష్, విశాల్, యశ్వంత్, సాగర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

దొంగ అరెస్టు

హసన్‌పర్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధి గోపాల్‌పూర్ శివారు గణేష్‌నగర్‌లో సోమవారం చైన్ స్నాచింగ్ జరగగా 24 గంటల్లోనే పోలీసులు దొంగను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కేయూ పోలీసు స్టేషన్ పరిధి గోపాల్‌పూర్‌లోని గణేష్‌నగర్ కాలనీకి చెందిన సోమ ప్రవీణ్ భార్య లావణ్య సోమవారం తన కూతురు మెడలో ఉన్న రూ.60వేల విలువగల 12 గ్రాముల బంగారు గొలుసును ఎవరో గుర్తు తెలియని వ్యక్తి అపహరించినట్లు కేయూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తును వేగవంతం చేసిన ట్లు తెలిపారు. దర్యాప్తులో భాగంగా నాలుగు బృందాలుగా పోలీసులు విడిపోయి స్నాచింగ్‌కు పాల్పడిన ఇదే కాలనీకి చెందిన కుతాడి సరితను గుర్తించి ఆమె వద్ద నుంచి రూ.60వేల విలువైన 12 గ్రాముల బంగారు ఆభరణాన్ని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు


హసన్‌పర్తిలో ధాన్యం కాంటా వేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. మండల పరిధిలోని నాగారం, హసన్‌పర్తి, జయగిరి, అనంతసాగర్ గ్రామాలలో ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు చేతుల మీదుగా ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం సన్న రకాలకు రూ.500 బోనస్‌తో ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. దొడ్డు రకం ధాన్యం గ్రేడ్ ఏ రకానికి రూ.2320, మిగతా వాటికి రూ. 2300 కనీస మద్దతు ధర చెల్లించడం జరుగుతుందన్నారు. సన్న రకం ధాన్యానికి అదనంగా రూ.500 బోనస్ కలిపి ఇస్తున్నట్లు తెలిపారు. తేమ శాతం తక్కువ ఉండే విధంగా తాలు లేకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ప్రతీ బస్తాకు 41.500 కిలోలు తూకం వచ్చే విధంగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో ఏడీ సుధీర్‌కుమార్, తహసీల్దారు చల్ల ప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ జగన్మోహన్‌రెడ్డి, ఏవో అనురాధ, ఏపీఎం ఆకుతోట ప్రభాకర్, ఏఈవో శైలజ, కిసాన్ జిల్లా అధ్యక్షుడు పింగిళి వెంకట్రాంనర్సింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ బిల్ల ఉదయ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తంగెళ్లపెల్లి తిరుపతి, డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్ పాల్గొన్నారు.

'యోగా, మెడిటేషన్‌తో మానసిక ప్రశాంతత'

కాళోజీ జంక్షన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): యోగా, ధ్యానంతో సమతుల్యత ఏర్పడుతుందని సెయింట్ పీటర్స్ విద్యాసంస్థల అధినేత ఎన్.నారాయణరెడ్డి అన్నారు. బుధవారం నక్కలగుట్ట హరిత కాకతీయ హోటల్‌లో హాలండ్ వేదిక్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతీబాపూలే పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణ తరగతుల ప్రారంభ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యోగా, ధ్యానంతో జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. వేదిక్ యూనివర్సిటీ ప్రాజెక్టు డైరెక్టర్ పీసీ శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. యోగా, మెడిటేషన్ల వల్ల శారీరక, మానసిక రుగ్మతలను నివారించవచ్చని అన్నారు. శిక్షణ పొందిన పీఈటీలు విద్యార్థులతో రోజు తప్పకుండా యోగా, ధ్యానం చేయించాలని కోరారు. వేదిక వరంగల్ ఇన్‌చార్జి పి.రమేష్ మాట్లాడుతూ అన్ని పాఠశాలల విద్యార్థులకు యోగా, ధ్యానం నేర్పించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మెడిటేషన్ టీచర్లు పి.కొండల్‌రెడ్డి, పి.రమాదేవి, కె.సుభాష్, పి.శ్రీదేవి, బి. మల్లికార్జున్, పి.వైష్ణవి పాల్గొని ఫిజికల్ డైరెక్టర్లకు ధ్యానంలో మెళకువలు నేర్పారు.

భద్రకాళి దేవస్థానం సిబ్బందికి సన్మానం


ప్రసాదాల తయారీ సిబ్బందిని సన్మానిస్తున్న సీఐ, ఈవో

వరంగల్ కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో లడ్డూ ప్రసాదం తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్న నేపథ్యంలో కేంద్ర ఆహార పరిరక్షణ సంస్థ ఇటీవల సర్టిఫికెట్ అందజేసింది. ఈ నేపథ్యంలో బుధవారం ప్రసాదాల తయారీ కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బందిని ఈవో శేషు భారతి, మట్టెవాడ సీఐ గోపి సిబ్బందిని సన్మానించారు. సిబ్బంది చేస్తున్న సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు భద్రకాళి శేషు, ఫొటోగ్రాఫర్ శ్యామ్, సీనియర్ అసిస్టెంట్లు కూచన హరినాథ్, అశోక్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సామాజిక సేవలోనూ ముందున్నాం..



సమావేశంలో మాట్లాడుతున్న కెనరా బ్యాంకు అధికారులు

హనుమకొండ సిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బ్యాంక్ విధులకే పరిమితం కాకుండా సామాజిక సేవలోనూ ముందు వరుసలో ఉన్నామని కెనరా బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ బి.చంద్రశేఖరా పేర్కొన్నారు. హనుమకొండ సెంటినరీ బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో నిర్వహించే రీచ్ చిల్డ్రన్ హోమ్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు చిల్డ్రన్ హోమ్‌కు వాటర్ ప్యూరిఫైర్, గీజర్‌తో పాటు పుస్తకాలు తదితర సామగ్రిని అందచేశారు. సమావేశాన్ని ఉద్దేశించి చంద్రశేఖరా మాట్లాడుతూ.. బ్యాంకింగ్ సేవలు వృత్తి పరంగా సంతృప్తి ఇస్తే, సామాజిక సేవ ఆత్మ సంతృప్తిని కలిగిస్తుందన్నారు. చిల్డ్రన్ హోమ్ నిర్వాహకుడు నల్లా జాన్‌సన్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సీబీసీ కార్యదర్శి డాక్టర్ టి.క్రిష్టఫర్ రూబెన్, ఎస్.ఆర్థర్ స్టీవెన్‌సన్, మేనేజర్ నివేదితతో పాటు కెనరా బ్యాంకు ఏజీఎం శాంతికుమార్, కె.మాధవి, సంజీవ్‌కుమార్, రవి కెలత్, ఇంద్రజ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీవీ రావు సేవలు వెలకట్టలేనివి


కోడిగుడ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

న్యూశాయంపేట, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): పౌల్ట్రీ పితామహుడు డాక్టర్ బీవీ రావు సేవలు వెలకట్టలేనివని నెక్ వరంగల్ లోకల్ కమిటీ చైర్మన్ ఆవుల చంద్రయ్య అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని నెక్ కార్యాలయంలో బుధవారం బీ.వీ రావు 89వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీవీ రావు స్మారకార్థం ఉడుకబెట్టిన కోడిగుడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీఎఫ్ వరంగల్ రీజియన్ అధ్యక్షుడు వెనెపల్లి రామారావు, టీపీఎఫ్ మెంబర్ పునాటి హరిబాబు, డబ్ల్యూపీఎఫ్ఏ ఉపాధ్యక్షులు తక్కళ్లపల్లి శ్యాంసుందర్‌రావు, కోశాధికారి మార్త రాంప్రసాద్, ఎ.రామచందర్‌రావు, వీరన్న, కరుణాకర్‌రెడ్డి, రమణారెడ్డి, గాదె రాజేందర్ పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను పాటించాలి

- ఎస్‌ఆర్ విశ్వవిద్యాలయ చాన్స్‌లర్ వరదారెడ్డి


ఆణిముత్యాలు గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న వరదారెడ్డి

హనుమకొండ కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆధునికత పేరిట చెడు పోకడలను విస్మరించి సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు యువత నడుం బిగించాలని ఎస్‌ఆర్ విశ్వవిద్యాలయ చాన్స్‌లర్ ఎనగందుల వరదారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి హనుమకొండ వాగ్దేవి ఆడిటోరియంలో సహృదయ అధ్యక్షుడు ఆచార్య గిరిజా మనోహర్ బాబు అధ్యక్షతన జరిగిన ఆధ్యాత్మిక సాహిత్య కార్యక్రమంలో ప్రముఖ సంస్కృత పండితులు ఆధ్యాత్మిక ప్రవచకులు సముద్రాల శఠగోపాచార్య కలంనుంచి జాలువారిన ఆణిముత్యాలు గ్రంథం జెమ్స్ ఆఫ్ వైదిక్ విజ్‌డమ్ గ్రంథాన్ని వరదారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సరళంగా పత్రికాభాషలో నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా ఆణిముత్యాలు పేరిట గ్రంథాన్ని వెలువరించిన శఠగోపాచార్యను అభినందించారు. ఇలాంటి పుస్తకాలను యువత చదివి అందులోని అర్థాన్ని ఆకలింపు చేసుకొని ఆచరించాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. వివిధ దినపత్రికల్లో 480 వ్యాసాలు అనేక ఆధ్యాత్మిక గ్రంథాలను వెలువరించిన శఠగోపాచార్య కృషిని అభినందించారు. ఆణిముత్యాలుగ్రంథాన్ని సమీక్షిస్తూ కేయూ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పాలకుర్తి దినకర్ అందరికి అర్థమయ్యే రీతిలో సులభ శైలిలో వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే వ్యాసాలుండడం ప్రశంసనీయమన్నారు. ప్రముఖ ఆడిటర్ టి.గోపీచంద్‌తో పాటు అనేక మంది సాహిత్య, ఆధ్యాత్మికవేత్తలు పాల్గొన్నారు. మరింగంటి శ్రీధరాచార్య కార్యక్రమ సంయోజకులుగా వ్యవహరించారు.

సమసమాజ స్థాపనే పీడీఎస్‌యూ లక్ష్యం



ప్రసంగిస్తున్న పీడీఎస్‌యూ నాయకుడు నరసింహారావు

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ విద్య, సమానత్వపు సమాజ స్థాపనే లక్ష్యంగా పీడీఎస్‌యూ ఉద్యమాలను నిర్మిస్తుందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు అన్నారు. బుధవారం హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థి అమరవీరుల సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ.. విద్యార్థి ఉద్యమంలో పనిచేస్తూ వారి అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన విద్యార్థుల అమరుల త్యాగాలు వెలకట్టలేనివన్నారు. విద్యార్థి వీరుల పోరాటాలను స్ఫూర్తిగా నేటి విద్యార్థులంతా శాస్త్రీయ విద్యావిధానం అమలుకు పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో, కేంద్రంలోని ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే చర్యలు చేపడుతున్నాయన్నారు. విద్యారంగ అభివృద్ధికి ఇరు ప్రభుత్వాలు గండి కొడుతున్నాయన్నారు. రాష్ట్రంలో పెండింగ్ స్కాలర్‌షిప్పులు, రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా విద్యార్థుల భవిష్యత్తును కాలరాస్తున్నాయన్నారు. సభ ప్రారంభానికి ముందు విద్యార్థి అమరుల ఆత్మ శాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించి వారికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నరేష్, వినయ్, హర్ష, బాలు, వంశీ, శివాజి, కార్తీక్, మనోహర్, రాఘవ, రాజేష్, ప్రకాశ్, వినయ్, అజయ్, సాహిత, చందన, వైష్ణవి, నందిత, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

కలెక్టరేట్ ఎదుట జీపీ కార్మికుల ధర్నా


హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు6(ఆంధ్రజ్యోతి): మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేయాలని గ్రామ పంచాయతీ కార్మికులు బుధవారం సీఐటీయూ నాయకులతో కలిసి హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్మికుల రాష్ట్ర కార్యదర్శి చాగంటి వెంకటయ్య, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఫుల్లా అశోక్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12,769 గ్రామపంచాయతీ కార్మికులు పనిచేస్తున్నారని, వీరందరూ నిత్యం గ్రామాల్లో ఉండే పనులు చేస్తున్నార న్నారు. వీరికి ఇప్పటివరకు భద్రత కల్పించకపోవడం అన్యాయమన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేదంటే సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామ న్నారు. అనంతరం డీఆర్‌వో వై.వి .గణేష్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పల్లె రామన్న, ప్రధాన కార్యదర్శి యాకయ్య, పెద్ద సంఖ్యలో గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వరంగల్ కలెక్టరేట్ వద్ద..

వరంగల్ కలెక్టరేట్: గ్రామపంచాయతీ కార్మికులకు మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ నాయకులతో కలిసి గ్రామపంచాయతీ సిబ్బంది బుధవారం వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మికుల రాష్ట్ర కార్యదర్శి చాగంటి వెంకటయ్య మాట్లాడారు. గ్రామాల్లో వెట్టిచాకిరి చేస్తున్న గ్రామపంచాయతీ సిబ్బందికి ప్రభుత్వం వెంటనే ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ధర్నాలో పెద్ద సంఖ్యలో గ్రామ పంచాయతీ సిబ్బంది, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టు

శంభునిపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించుకోవటానికి ఈ నెల 8న వరంగల్ డివిజన్ పరిధిలోని మామునూరు సబ్‌స్టేషన్‌లో లోకల్ కోర్టు నిర్వహించుతున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ వినియోగదారుల ఫోరం చైర్మన్ ఎన్‌వీ వేణుగోపాలచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సదస్సు పేరిట నిర్వహించే లోకల్ కోర్టులో విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను మార్చటం, వోల్టేజీ హెచ్చు తగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలు ఉన్న మీటర్లను మార్చటం, నూతన సర్వీసుల మంజూరు, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీసు పేరు మార్పు, వాడకాని కన్నా ఎక్కువ మొత్తంలో బిల్లులు, కేటగిరి మార్పు, సర్వీసు రద్దు, వంటి సమస్యలపై రాతపూర్వకంగా ఫిర్యాదు అందించవచ్చన్నారు. శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఫిర్యాదులను స్వీకరిస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

'సీపీఐ పేదల పార్టీ'

కాశిబుగ్గ, నవంబరు6, (ఆంధ్రజ్యోతి): సీపీఐ పేదల పార్టీ అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మేకల రవి అన్నారు. సీపీఐ వరంగల్ మండల సమితి సమావేశం గాంధీనగర్‌లో మేడిది అశోక్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. డిసెంబరు నాటికి పార్టీ స్థాపించి వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. భూసంస్కరణల చట్టాన్ని తీసుకువచ్చి లక్షలాది ఎకరాల భూమిని ప్రజలకు పంపిణీ చేసిన ఘనత సీపీఐది అని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కే.బాష్‌మియా, మండల కార్యదర్శి బుస్సా రవీందర్, జిల్లా సమితి బాధ్యులు రమేష్, రవి, సుధీర్, శరత్, దస్రునాయక్, రాజేష్, స్వప్న, షబానా తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణను వినియోగించుకోవాలి




సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అరుణ డీహెచ్‌రావు

న్యూశాయంపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నైపుణ్య శిక్షణను వినియో గించుకోవాలని ఎల్బీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్‌రావు అన్నారు. వరంగల్ ములుగురోడ్‌లోని ఎల్బీ కళాశాలలో బుధవారం మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సౌజన్యంతో విద్యార్థులకు నైపుణ్యాలు పెంచడానికి 7 రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అరుణ డీహెచ్‌రావు విద్యార్థులకు శిక్షణ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి, అధ్యాపక బృం దం, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్‌లో అపరిచిత వ్యక్తి వీరంగం

సుబేదారి పోలీసులకు కార్యవర్గం ఫిర్యాదు

బాలసముద్రం, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో ఓ వ్యక్తి మంగళవారం హల్‌చల్ చేశాడు. ఎవరు..? అని అడిగిన ఆఫీస్ బాయ్‌తో పాటు, కోశాధికారి బోళ్ల అమర్‌ను దుర్భాషలాడాడు. అంతేకాకుండా మరికొంతమందిని తీసుకొచ్చి రచ్చ చేశాడు. దీంతో బుధవారం ప్రెస్‌క్లబ్ కమిటీ సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సుబేదారి సీఐ సత్యనారాయణ రెడ్డి కేసు నమోదు చేశారు. ఆయన తెలిపిన ప్రకారం.. పుప్పాల శ్రీనివాస్ అనే వ్యక్తి ఎలాంటి సభ్యత్వం లేకున్నా ప్రెస్‌క్లబ్‌లోకి అక్రమంగా ప్రవేశించాడు. దీంతో ఆఫీస్ బాయ్ సుమంత్.. శ్రీనివాస్‌ను 'ఎవరు..?' అని ప్రశ్నించడంతో దుర్భాషలాడాడు. అక్కడే ఉన్న ప్రెస్‌క్లబ్ కోశాధికారి బోల్ల అమర్ అడ్డుకుని ఎందుకు దుర్భాషలాడావు? అని శ్రీనివాస్‌ను ప్రశ్నించగా ఆయనతో కూడా అమర్యాదగా మాట్లాడాడు. అంతేకాకుండా అదే రోజు సాయంత్రం వివిధ సామాజిక మాధ్యమాలలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజుపై దుష్ప్రచారం చేశాడు. మళ్లీ తిరిగి బుధవారం ఉదయం 11:30గంటల ప్రాంతంలో మరికొంత మందిని ప్రెస్‌క్లబ్‌కు తీసుకువచ్చి అక్కడ ఉన్న జర్నలిస్టులు, ప్రెస్‌క్లబ్ బాధ్యులను శ్రీనివాస్ బెదిరించాడు. కాగా, ఈ ఘటనలో శ్రీనివాస్, ఇతర వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు, బాధ్యులు సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారని సీఐ సత్యనారాయణ రెడ్డి తెలిపారు.



గుట్టపై ఉన్న సొరంగ మార్గం



ప్రతాపగిరి గుట్ట

చరిత్ర

ప్రతాపగిరి..చారిత్రక సిరి..



గుట్ట మీద 100 మీటర్ల ఎత్తులో ఉన్న రక్షణ దుర్గం ద్వారం

- గుట్టపై కాకతీయుల నాటి రక్షణ దుర్గం
- అబ్బురపరిచే ఐదంచెల్లోని సైనిక స్థావరం
- ప్రధాన ద్వారంపై మైసమ్మ, నాట్యకత్తెల విగ్రహాలు
- కనువిందు చేసే ప్రకృతి రమణీయత
- పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరుతున్న ప్రజలు

కాటారం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : దట్టమైన అడవిలో ఎత్తైన గుట్ట.. ఆ గుట్టపై రక్షణ దుర్గం.. చుట్టూ గలగల పారే సెలయేళ్లు.. పక్షుల కిలకిలరావాలు.. ఇవన్నీ కాకతీయుల వంశ చివరి రాజు పాలనలో నిర్మించిన 'ప్రతాపగిరి'పై గల చారిత్రక విశేషాలు, ప్రకృతి రమణీయ అందాల మధ్య నెలవైన శతాబ్దాల నాటి చారిత్రక సంపద నేటికీ వెలుగులోకి రాకుండా పోయింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని 353(సీ)జాతీయ రహదారికి 9 కిలోమీటర్ల దూరంలోని అటవీ ప్రాంతంలో సుమారు 600 మీటర్ల ఎత్తులో నెలవైన ప్రతాపగిరి గుట్టపై ఐదంచెల రక్షణ వ్యవస్థతో కూడిన కాకతీయ రాజుల దుర్గం ఉంది. ఎన్నో చారిత్రక విశేషాలకు, ప్రకృతి సంపదకు నెలవైన ఈ 'ప్రతాపగిరి'పై ప్రభుత్వం దృష్టి పెట్టి అభివృద్ధి చేస్తే పర్యాటకంగా ఈ ప్రాంతం వెలుగొందుతుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

ప్రతాపగిరిపై రక్షణ స్థావరం

కాకతీయుల వంశ రాజుల్లో చివరి రాజైన ప్రతాపరుద్ర-2 (రుద్రదేవ-2) కాలంలో ఎత్తైన గుట్టలపై రక్షణ దుర్గాలు ఏర్పాటయ్యాయి. ప్రతాపరుద్రుడి కాలంలో ఏర్పాటు చేసిన నాయంకరుల వ్యవస్థ కీలకంగా ఉండేది. శత్రురాజుల బెడద నుంచి రక్షణ కోసం, అవసరమైతే వారిని దెబ్బ కొట్టడానికి కాకతీయ సేనాని ఆధ్వర్యంలో నాయంకరులు పలు గుట్టలపై బలమైన రక్షణ వ్యవస్థలతో కూడిన కోటలు నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. 14వ శతాబ్దంలో ఢిల్లీ సుల్తాన్ సేనల దాడి నుంచి తప్పించుకొని వస్తూ గొంతెమ్మ గుట్టతో పాటు పక్కనే కిలోమీటరు దూరంలో ఉన్న మరో పెద్ద గుట్టపై కాకతీయ వంశ రాజు ప్రతాపరుద్రుడు తన సైనిక స్థావరాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు తెలుస్తోంది. అందుకే ఆ గుట్టకు ప్రతాపగిరిగా పేరొచ్చింది.



గుప్తనిధుల కోసం తవ్విన ఆనవాళ్లు

చారిత్రక సంపద.. ప్రకృతి అందాలకు నెలవు

గలగల పారే సెలయేర్లు, పచ్చని దట్టమైన వృక్ష సంపద, ప్రకృతి అందాల మధ్య సుమారు 600మీటర్ల ఎత్తులో ఉండే ఈ గుట్టపైకి వెళ్లడానికి మూడు ప్రధాన ద్వారాలున్నాయని, లోపలి ప్రధాన స్థావరానికి తొమ్మిది దర్వాజాలున్నట్లు స్థానికులు చెప్తున్నారు. ప్రధాన ద్వారంపై మైసమ్మ దేవత విగ్రహం ఉండగా, ద్వారానికి ఇరువైపులా నాట్యకత్తెల విగ్రహాలను చెక్కారు. ప్రధాన ద్వారం వద్ద కట్టిన పెద్ద గోడపై రాతి శాసనం ఆనవాలు నేటికీ ఉంది. గుట్ట చుట్టూ సుమారు 5 కిలోమీటర్ల మేర ప్రహరీ నిర్మించారు. ఐదంచెల్లో రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తూ రాతి గోడలు ఏర్పాటు చేశారు. కాకతీయుల సైన్యం స్నానాలు, ఇతర నీటి అవసరాల కోసం గుట్టపై పెద్ద కొలనులను ఏర్పాటు చేశారు. పలు రక్షణ వ్యవస్థలను దాటి శత్రువులు వచ్చినా ప్రధాన స్థావరం వద్ద అడ్డుకోవడానికి చుట్టూ లోతైన కందకాలు తీయించారు. అందులో మొసళ్లను విడిచిపెట్టినట్టు తెలుస్తోంది. ప్రహరీ చుట్టూ సైనికులు నిరంతరం కాపలా కాయడానికి బురుజులు ఏర్పాటు చేశారు. ఈ గుట్ట నుంచి ఇతర చోట్లకు సొరంగ మార్గం ఉన్నట్లు భావిస్తున్నారు. గుట్టపై నుంచి చూస్తే ఎటు చూసినా 20 కిలో మీటర్ల వైశాల్యంలో ఉన్న గ్రామాలు, వాగులు, సెలయేర్లు, గోదావరి నది అందాలు కనిపిస్తాయి.

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి

శతాబ్దాల నాటి చారిత్రక సంపద విశేషాలు, ప్రకృతి సోయగాలకు నెలవైన ప్రతాపగిరిని ప్రభుత్వం వెంటనే పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు. ప్రకృతి రమణీయతల మధ్య కొలువైన ప్రతాపగిరిలో ఎకో టూరిజం కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతంలో కొందరు అధికారులు ప్రతాపగిరిని సందర్శించినా ఏ మార్పు లేదు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ములుగు, భూపాలపల్లి జిల్లాల్లోని చారిత్రక, ఆధ్యాత్మిక కేంద్రాలను కలుపుతూ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దాలని యోచిస్తున్న నేపథ్యంలో వందల ఏళ్ల నాటి చారిత్రక విశేషాలు, కాకతీయుల ఆనవాళ్లు గల ప్రతాపగిరిని కాపాడి భవిష్యత్ తరాలకు అందిచేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, చారిత్రక పరిశోధకులు కోరుతున్నారు.



ద్వారం వద్ద నాట్యకత్తెల విగ్రహం



సైనికుల కాపలాగా ఉండే బురుజు నిర్మాణం

గుప్తనిధుల అన్వేషణతో చారిత్రక సంపద ధ్వంసం

వందల ఏళ్ల నాటి కాకతీయ వంశస్థుల చారిత్రక సంపద గుప్తనిధుల కోసం కొందరు చేసిన, చేస్తున్న అన్వేషణతో ధ్వంసమవుతోందని తెలుస్తోంది. ప్రతాపగిరి గుట్టపై భాగంతో పాటు చుట్టుపక్కల అపారమైన నిధిని దాచినట్టు అపోహలు ఉండటంతో పలు ప్రాంతాలకు చెందిన వారు తవ్వకాలతో చారిత్రక ఆనవాళ్లను శిథిలం చేశారు. గుట్టపై పలు చోట్ల తవ్వకాలు జరిపిన ఆనవాళ్లున్నాయి.

మూడేళ్లలో..

(5వ పేజీ తరువాయి)

నేపథ్యంలోనే జీఎంఆర్ సంస్థతో జరిపిన చర్చ లు ఫలించటంతో 150 కిలో మీటర్ల నిబంధనను సడలించేందుకు ఆ సంస్థ నుంచి సానుకూలత వచ్చిందని సమాచారం.

అనుకూలంగానే స్కై అండ్ ల్యాండ్ సర్వే

2017 ఏప్రిల్ 27న ఉడే దేశ్‌కీ ఆమ్ నాగరిక్ (ఉడాన్) పథకం కింద వరంగల్ ఎయిర్ పోర్టును అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయిం చింది. బ్రౌన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టుగా అభివృద్ధి చేసేందుకు కేంద్రం ముందుకు వచ్చింది. ఓఎల్ ఎస్ సర్వే, సాయిల్ టెస్టింగ్‌తో పాటు వివిధ సర్వే సంస్థల నివేదికలతో పాటు టెక్నో ఎకనా మికల్ ఫీజిబిలిటీ స్టడీ రిపోర్టును ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)పూర్తి చేసి 2023 జూలై 7వ తేదీన కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చింది. దీంతో పాటు మరోసారి గత ఏప్రిల్ 10 నుంచి 25వ తేదీ వరకు ఏఏఐ అధికారులు ఓఎల్ఎస్ సర్వేతో పాటు సాయిల్ టెస్టింగ్ నిర్వహించారు. మూ డు విమానాలతో ఎయిర్ వ్యూ చేపట్టారు. విమానాల రాకపోకలకు వాతవారణం అనుకూలంగా ఉందా లేదా అని పరిశీలించారు. జియాజికల్ సర్వేతో పాటు స్కై అండ్ ల్యాండ్ సర్వే చేపట్టారు. సుమారు రెండు వారాల పాటు ఏఏఐ సిబ్బంది మామునూరులోనే మకాం వేసి ఎయిర్ పోర్టు నిర్వహణకు కావాల్సిన అన్ని టెస్టు లను విజయవంతంగా నిర్వహించారు. వరంగల్ నుంచి అంతర్జాతీయ స్థాయి విమానాలను నడిపించేలా ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేయా లని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో రంగంలోకి దిగిన ఏఏఐ అధికారులు మామునూరులో ఉన్న పాత 1.8కి.మీ రన్‌వేను పరిశీలించారు. అంత ర్జాతీయ స్థాయిలో విమానాలు నడిపించేందుకు అనుకూలంగా ఉండేలా ప్రస్తుతం ఉన్న 1.8కి. మీల రన్‌వేను 3.9కి.మీలకు పెంచాలని ఏఏఐ అధికారులు సూచించారు. ఇప్పటికే పైలట్, సిబ్బంది, టెర్మినల్స్‌తో పాటు సుమారు 694 ఎక రాల వరకు భూమి ఉంది. కనీసం మరో 306 ఎకరాల భూమిని కేటాయిస్తే పెద్ద విమానాలు నడిపించేలా రన్‌వేను నిర్మించవచ్చని ఏఏఐ అధికారులు ప్రభుత్వానికి సూచించారు. ప్రస్తుతం 696ఎకరాల స్థలం ఎయిర్‌పోర్ట్ అథారటీ ఆఫ్ ఇండియా ఆధీనంలో ఉంది. ఇంకా 304ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రభు త్వం రంగంలోకి దిగింది. రైతుల నుంచి భూసేక రణకు అధికారులు ప్రయత్నాలు మొదలుపె ట్టారు. అయితే పరిహారం విషయంలోనే సందిగ్ధం నెలకొంది. మొత్తానికి ఎయిర్‌పోర్టుకు అన్ని శుభ శకునాలే వినిపిస్తున్నాయనే ఆనందంలో ఓరుగల్లువాసులు ఉన్నారు.



ఎయిర్‌పోర్టులో సర్వే విమానాలు (ఫైల్)

మంత్రుల ప్రకటనలతో జోష్..

విమానాశ్రాయంపై మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ ప్రకటనలు చేయటంతో గగనయానంపై ప్రజల్లో ఉత్సాహం నింపింది. బుధవారం ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా అధికారులతో సమీక్ష నిర్వహించడంతో ఎయిర్‌పోర్టుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టిందనేది స్పష్టమవుతోంది. పరిశ్రమలన్ని హైదరాబాద్‌కే పరిమితమవుతున్న నేపథ్యంలో హైదరాబాద్ తరువాత అతిపెద్ద నగరం గా ఉన్న వరంగల్‌లో ముున్ముందు రోజుల్లో పరిశ్రమల స్థాపనకు వ్యాపారులు ముందుకు వస్తారన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పారిశ్రామికవేత్తలు హైదరాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి 140కిలో మీటర్లు రోడ్డు మార్గాన వరంగల్‌కు రావాల్సి వస్తోంది. దీంతో సమయం వృథా అవుతుందనే భావనతో పారిశ్రామికంగా అనుకూల వాతావరణం ఉన్నప్పటికి విమానాశ్రయం లేకపోవటంతో వరంగల్‌లో పరిశ్రమలు రావటం లేదనే చర్చ ఉంది. వరంగల్‌లో కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టేందుకు అనేక విదేశీ కంపెనీలు ఆసక్తిగా ఉన్నా.. ఢిల్లీ, హైదరాబాద్‌ల నుంచి వరంగల్‌కు ఎయిర్ కనెక్టివిటీ లేకపోవటంతో పారిశ్రామిక వేత్తలు ముందుకు రావటం లేదు. అలాగే మడికొండ ఏరియాలో ఐటీ కంపెనీల ఏర్పాటుకు కూడా ఎయిర్ కనెక్టివిటీ లేకపోవటమే కారణంగా చెబుతున్నారు. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప, మేడారం మహాజాతర, వెయ్యిస్తంభాల దేవాలయం, భద్రకాళి, వరంగల్ కోటతో పాటు అనేక కాకతీయ కట్టడాలను సందర్శించాలనుకునే చాలామంది ఎయిర్‌పోర్టు లేకపోవటంతో వెనక్కుతగ్గుతున్నారు. మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వం వరంగల్ ఎయిర్‌పోర్టుపై వేగంగా అడుగులు వేస్తుండటంతో దశాబ్దాల కల సాకారయ్యే గడియలు సమీపిస్తున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



వేదికపై ఐక్యతాభివాదం చేస్తున్న నేతలు

'సదర్' అదుర్స్

- గోకుల్‌నగర్‌లో అంబరాన్నంటిన సంబరం
- విరజిమ్మిన విద్యుత్‌కాంతులు.. అలరించిన ఆట పాట
- ప్రత్యేక ఆకర్షణగా దున్నపోతుల విన్యాసం
- ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్

గోకుల్‌నగర్‌లో సదర్ ఉత్సవానికి హాజరైన జనం



వడ్డెపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ గోకుల్‌నగర్‌లో సదర్ సంబరం అంబరాన్నంటింది. సదర్ సమ్మేళనం వేదిక విద్యుత్ కాంతులతో విరజిమ్మింది. గాయకులు తమ ఆటపాటలతో అలరించారు. ప్రత్యేక ఆకర్షణగా దున్నపోతుల విన్యాసం, యాదవ కళాకారులు నృత్యాలు, డోలు వాయిద్యాలతో సందడి చేశారు. ఉత్సవాలకు హాజరైన ప్రేక్షకులు మంత్రముగ్ధులయ్యారు. సదర్ సమ్మేళనంతో హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని గోకుల్ నగర్‌లో పండుగ వాతావరణం నెలకొంది. ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, విశిష్ట అతిథులుగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, యాదవనేత లడ్డూ యాదవ్‌తో పాటు ఇతర ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు.

హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని హనుమకొండ ఓల్డ్ బస్ డిపో ప్రాంతంలో గోకుల్ సదర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి సదర్ సమ్మేళనాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఒకప్పుడు హైదరాబాద్‌కే పరి మితమైన సదర్ సమ్మేళనం తొలిసారిగా హనుమకొండ పట్టణంలోని ఓల్డ్ బ స్ డిపో ప్రాంతంలో ఏర్పాటు చేసిన గోకుల్ సదర్ సమ్మేళనానికి వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి వందలాదిమంది యాదవులు తరలి వచ్చి ఉత్సవాల్లో భాగస్వాములయ్యారు. తొలుత దున్నపోతులను ఊరేగింపుగా గోకుల్ సదర్ సమ్మేళనం వేదిక వద్దకు డప్పుచప్పుళ్లు, బాజా భజంత్రీలతో యాదవ సంఘం నేతలు తరలించారు. గొల్ల వేషాధారణలో గొంగళి ధరించిన యాదవ కళాకారులు తమ నృత్యాలతో ఆద్యాంతం ఆకట్టుకున్నారు. జానపద కళాకారులు తమ ఆటపాటలతో అలరింప చేశారు. వేలాది మంది ఉత్సవాలకు తరలి రావడంతో గోకుల్ నగర్ ప్రాంతం సందడిగా మారింది. హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. దున్నపోతుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు గిరబోయిన రాజయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి బంక సంపత్ యాదవ్, గోకుల్ సదర్ సమ్మేళనం కమిటీ ప్రతినిధులు మూగల కుమార్ యాదవ్, సంగరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్, కార్పొరేటర్లు జక్కుల రజిత- వెంకటేశ్వర్లు, జక్కుల రవీందర్, మామిండ్ల రాజు, బొంగు అశోక్, కుడా మాజీ డైరెక్టర్ నక్క లింగయ్య యాదవ్, యాదవ సంఘం జిల్లా నేతలు బొల్లు సత్యం యాదవ్, బొంగు రాజు యాదవ్, కాశబోయిన దూడయ్య యాదవ్, బంక సరళ యాదవ్, బనుక సిద్ధిరాజు యాదవ్, బంక సతీష్, బంక చంద్రశేఖర్, దొంగల చెన్నమల్లు, బంక రమేష్, బుట్టి శ్యామ్, ఎల్లావుల రాజేందర్, బట్టమేకల భరత్, యశ్వంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

యాదవుల సంక్షేమానికి సర్కారు పెద్దపీట : అనిల్‌కుమార్

యాదవుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. సదర్ ఉత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. హైదరాబాద్ తర్వాత రెండో రాజధానిగా పేరొందిన వరంగల్‌లో సదర్ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్న యాదవులను అభినందించారు. యాదవుల సంక్షేమం కోసం రాష్ట్రప్రభుత్వం ఎన్నో పథకాలను రూపొందించి అమలు చేస్తోందన్నారు. విశిష్ట అతిథులుగా హాజరైన ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. యాదవుల పట్ల సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవను చూపుతున్నారని అన్నారు. యాదవ కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేస్తూ వారి ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తున్నదని స్పష్టం చేశారు. యాదవులు నిర్వహిస్తున్న సదర్ సమ్మేళనానికి కులమతాలకు అతీతంగా ఎంతో మంది హాజరవ్వడం ఆనందంగా ఉందన్నారు.



దున్నపోతుపై డ్యాన్స్ చేస్తున్న బాలుడు

ఆచార్య అనుగ్రహంతో ఏదైనా సాధ్యమే..



అనుగ్రహ భాషణం చేస్తున్న ఆహోబిల జీయర్ స్వామి

హనుమకొండ కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సద్గురు, ఆచార్యుల అనుగ్రహంతో ఎంత పెద్ద కార్యానైనా అవలీలగా సాధించవచ్చునని త్రిదండి ఆహోబిల రామానుజ జీయర్‌స్వామి అన్నారు. బుధవారం సాయంత్రం హనుమకొండలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వికాస తరంగిణి ఉభయ జిల్లాల సదస్సులో ఆయన పాల్గొని అనుగ్రహ భాషణం చేశారు. ఈ నెల 1 నుంచి 5 తేదీ వరకు హైదరాబాద్‌లోని ముచ్చింతలలో త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి వారి 69వ తిరునక్షత్రోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించుకోవడం ఆచార్యుడి కృపతోనే సాధ్యమైందన్నారు. ఇందులో భాగంగా వరంగల్ వికాస తరంగిణి ఆధ్వర్యంలో తదియారాధన నిర్వహించేందుకు వరంగల్ భక్తులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. చినజీయర్ స్వామి వారికి ఓరుగల్లుతో నాలుగు దశాబ్దాల అనుబంధం ఉందని, వికాస తరంగిణితో పాటు ఆచార్య సేవా యాత్ర లాంటి ఏ కార్యక్రమాన్నైనా విజయవంతంగా నిర్వహించడంలో ఇతరశాఖల కన్నా ముందుండడం ఆనందదాయకమన్నారు. మానవ సేవయే మాధవ సేవగా వికాస తరంగిణి నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఆదర్శప్రాయమన్నారు. ఈ సందర్భంగా భక్తులకు తిరునక్షత్రోత్సవ ప్రసాదాలను పంపిణీ చేశారు. వికాస తరంగిణి ఉమ్మడి జిల్లా చైర్మన్ డాక్టర్ బచ్చు రాధాకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్య క్రమంలో ఉపాధ్యక్షుడు చాడా సుభాష్‌రెడ్డి, ప్ర. దాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి, కోశాధికారి ముర ళీధర్‌రెడ్డిలతో పాటు సుమతి వరదారెడ్డి, తను జారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ముక్తీశ్వరాలయంలో లక్ష దీపోత్సవం

మహదేవపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో కార్తీక శోభ సంతరించుకుంది. బుధవారం లక్ష దీపోత్సవంతో పాటు భక్తులు లక్షపత్రి పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఉదయం నుంచే గోదావరిలో కార్తీక స్నానాలు ఆచరించి.. గోదావరి మాతకు పాలు, పసుపు, కుంకుమ, చీర సారెలతో పూజలు చేశారు.

ఆరోగ్య పరిరక్షణకు ఆయుష్మాన్ భవ

మీకోసం



- వయో వృద్ధుల కోసం అమల్లోకి తెచ్చిన కేంద్ర ప్రభుత్వం
- కార్డుల జారీకి కసరత్తు
- ఉమ్మడి జిల్లాలో 70ఏళ్లు పైబడినవారు 2.69 లక్షల మంది

హనుమకొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వయోవృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం 'ఆయుష్మాన్ భవ' పథకాన్ని అమల్లోకి తెచ్చింది. ప్రస్తుతం నిరుపేదలకు ఉచిత వైద్యం కోసం కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ కార్డులు ఇస్తున్న రీతిలోనే ప్రత్యేకంగా 70ఏళ్లు పైబడిన వారి ఆరోగ్య రక్షణ కోసం కూడా కార్డులను ఇవ్వబోతోంది. ఈ కార్యక్రమం గత నెల 29వ తేదీ నుంచి అమలు చేస్తుండగా.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వర్చువల్‌గా ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా ప్రారంభించారు. ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా 70ఏళ్లు పైబడిన వృద్ధులకు రూ.5లక్షల మేరకు ఉచిత ఆరోగ్య పథకాన్ని ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీపీఎంజేఏవై) అందుబాటులోకి తీసుకొచ్చారు.

రూ.5లక్షల వరకు ఉచిత వైద్యం

ఉమ్మడి జిల్లాలో సుమారు 2.69లక్షల మందికి 70ఏళ్లు పైబడిన వారు ఈ ఆయుష్మాన్ భవ పథకం కింద లబ్ధి పొందే అవకాశం ఉంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా అన్ని వయసుల వారికి రూ.10 లక్షల వరకు వైద్య సేవలను అందిస్తోంది. ఈ పథకం కింద 1,835 రకాల వ్యాధులకు చికిత్స అందిస్తున్నారు. కేంద్రం ప్రస్తుతం ప్రారంభించిన ఆయుష్మాన్ భవ పథకాన్ని వృద్ధులకు కేంద్రం అందజేస్తోంది. దీంతో ఈ పథకం కింద ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు, చికిత్స, ఇంటెన్సివ్ కేర్ తదితర సేవలను పొందవచ్చు. ఉచితంగా మందులు, పోషకాహారం సైతం అందజేస్తారు. ఈ పథకం కోసం వృద్ధులు పూర్తి వివరాలతో వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది.

హెల్త్ ఇన్సూరెన్స్ కలిగిన వారికి కూడా..

ఇప్పటికే ఆయుష్మాన్ కార్డు కలిగి ఉన్న వృద్ధులు ఆయుష్మాన్ పోర్టల్ లేదా యాప్‌లో మళ్లీ దరఖాస్తు చేసుకొని కొత్త కార్డు కోసం ఈకేవైసీ పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రైవేటు హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలు లేదా ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ స్కీమ్‌ను పొందు తున్న సీనియర్ సిటిజన్లు కూడా ఈ పథకం కింద ప్రయోజనాలు పొందేందుకు అర్హులు. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్ ఎస్), ఎక్స్ సర్వీస్‌మెన్ కాంట్రిబ్యూటరీ హెల్త్ స్కీం (ఈసీహెచ్ ఎస్), ఆయుష్మాన్ సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీసు ఫోర్సు (సీఏపీఎఫ్) వంటి ఇతర పబ్లిక్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్‌లను ఉపయోగిస్తున్న 70 ఏళ్లపైబడిన సీనియర్ సిటిజన్లు ప్రస్తుత పథకం లేదా ఆయుష్మాన్ భారత్ స్కీంలలో ఏదో ఒకదాన్ని ఎంచుకోవాల్సి ఉంటుంది.

2.69 లక్షల మంది..

హనుమకొండ జిల్లాలో 56,656 మంది, వరంగల్ జిల్లాలో 58,995, జనగామ జిల్లాలో 42,277, మహబూబాబాద్ జిల్లాలో 47,833, ములుగు జిల్లాలో 31,622, జయశంకర్ భూపాపల్లి జిల్లాలో 32,599 మంది ఉన్నారు. కాగా ఉమ్మడి జిల్లాలో ఆయుష్మాన్ భారత్ కింద వరంగల్ జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 11,14,841 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వీరిలో వరంగల్ జిల్లాలో 1,75,682 మంది, హనుమకొండ జిల్లాలో 2,90,664, మహబూబాబాద్ జిల్లాలో 1,97,304, జనగామ జిల్లాలో 1,85,619, ములుగు జిల్లాలో 1,32,783 మంది, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 1,32,789 మంది ఉన్నారు. వీరందరికి గుర్తింపు కార్డులు జారీ అయ్యాయి.



ఇళ్ల వద్దే ఆరోగ్య పరీక్షలు

ఆయుష్మాన్ భారత్ కింద పేర్లు నమోదైన వయోవృద్ధుల ఇళ్లకు వెళ్లి వైద్య సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షల వివరాలను ఆయుష్మాన్ భవ ఖాతాలో నమోదు చేస్తారు. ఆసుపత్రికి వెళితే వాటిని పరిశీలించి డాక్టర్లు వైద్యం అందజేస్తారు. ఏదైనా సందర్భంలో వేరే ఆసుపత్రులకు వెళ్తే రోగుల వద్ద పాత వైద్య రిపోర్టులు లేకపోయినా ఆయుష్మాన్‌భవ హెల్త్ ఖాతా సంఖ్య ఆధారంగా వైద్యులు చికిత్స అందజేస్తారు.

ఆన్‌లైన్‌లో ఆరోగ్య వివరాలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్య వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసి గుర్తింపు కార్డులను కేటాయించింది. ఆరోగ్య శ్రీ, ఆధార్ కార్డు మాదిరిగా ఆరోగ్య గుర్తింపు కార్డు పనిచేస్తుంది. అలాగే ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం కింద 70 ఏళ్ల వయసుపైబడిన వారికి కూడా ఇలాగే కార్డులను జారీ చేస్తారు. వారి ఆరోగ్య వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఈ కార్డు ద్వారా దేశంలోని ఏ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రిలోనైనా వైద్య సేవలు పొందవచ్చు.

ఇంట్లోనే మొక్కలు పెంచేద్దాం

ఇంటి చుట్టూ అందమైన మొక్కలు పెంచితే చూడడానికి బాగుంటుంది. పెద్దగా ఖాళీ స్థలం లేకపోయినా చిన్న కుండీలు ఏర్పాటు చేసుకుని వాటిలో రకరకాల మొక్కలు పెంచుకోవచ్చు. ఎక్కువ శ్రమ పడకుండా కుండీల్లో త్వరగా పెరిగే మొక్కల గురించి తెలుసుకుందాం!

- రంగు రంగుల పూలను చూస్తే మనసు అహ్లాదకరంగా ఉంటుంది. గులాబీ, మల్లె, కనకాంబరాలు, బంతి, చేమంతి వంటి పూల మొక్కలతోపాటు టమాటా, పచ్చిమిర్చి, కొత్తిమీర, కరివేపాకులను కూడా కుండీల్లో పెంచవచ్చు. వీటిని పెంచే కుండీల్లో ఎర్రటి మట్టి నింపాలి. తగినంత



నీటిని అందిస్తూ వాడేసిన టీ పొడి. గుడ్డు పెంకులు, ఉల్లి పొట్టు కూడా వేస్తుంటే అవి ఎరువులా పనిచేసి మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతాయి.

- కాకార కాయ, బెండకాయ, వంకాయ, బీన్స్ విత్తనాలు బజారులో దొరుకుతాయి. వీటిని తెచ్చి కుండీల్లో చల్లి కొద్దిగా నీళ్లు చల్లుతూ ఎండ తగిలేలా ఉంచితే మొక్కలు బాగా పెరుగుతాయి.
- మనం రోజూ వాడుకునే కూరగాయల తొక్కలను, ఎండిన పూలను కుండీల్లో వేస్తే మట్టిలో ఎక్కువ సేపు తేమ నిలిచి ఉంటుంది. వాటి ద్వారా మొక్కకు పోషకాలు కూడా అందుతాయి.
- మందారం చెట్టు కొమ్మను తీసుకొచ్చి కొద్దిగా కట్‌చేసి కుండీలో నాటాలి. కొద్దిగా నీరు పిచికారీ చేసి ఎండ తగిలేలా ఉంచితే కొమ్మ నాటుకుంటుంది. నెల రోజుల్లో మొక్క పెరుగుతుంది. దీనికి తెల్ల పురుగు చేరకుండా పసుపు నీళ్లు లేదంటే వేపనూనె కలిపిన నీళ్లు మొక్కమీద చల్లుతూ ఉండాలి.

ఇదీ సంగతి

అమెరికాలో ఇలా..!

మీరు రాత్రి ఎన్ని గంటలకు భోజనం చేస్తారు?
బాగా పొద్దు పోయాక.. అంతేగా!
టీ ఎంత తాగుతారు?
ఓ కప్పు... లేదా అర కప్పు... అవునా!
మరి అమెరికన్లు..?
మనతో పోలిస్తే చాలా విషయాల్లో వాళ్ల అలవాట్లు, అభిరుచులు పూర్తి భిన్నంగా ఉంటాయట. అలాంటి కొన్ని ఆసక్తికర అంశాలను సరదాగా నెటిజనులతో పంచుకుంది అమెరికా మహిళ... క్రిస్టెన్ ఫిషర్.





మూడేళ్లుగా భారత్‌లో ఉంటున్న ఆమె... ఇక్కడివారితో తమ దేశవాసుల జీవన శైలిని పోలుస్తూ ఓ రీల్ చేసింది. అందులో తనే ఏకపాత్రాభినయం చేసి, దాన్ని ఇన్‌స్టాలో పెట్టింది. అక్కడి నుంచి వివిధ సామాజిక మాధ్యమాల్లో ఈ వీడియో చక్కర్లు కొడుతోంది. ఇంతకీ ఫిషర్ గమనించిన ఆ తేడాలేంటి? ఆమె మాటల్లోనే...

- మా అమెరికన్లకు వంటలో తాలింపు (సీజనింగ్) అంటే సాధారణంగా ఉప్పు, మిరియాలపొడి... అంతే. అదే భారత్‌లో అయితే పసుపు, ధనియాల పొడి, ఎండు మామిడి పొడి, జీలకర్ర, ఆవాలు, గరంమసాలా... ఇలా రకరకాల మసాలా దినుసులు, సుగంధ ద్రవ్యాలు ఉంటాయి.
- అమెరికన్లు సాయంత్రం ఐదు లేదా ఆరు గంటలకల్లా రాత్రి భోజనం ముగించేస్తారు. కానీ ఎక్కువమంది భారతీయులు ఆలస్యంగా, అంటే రాత్రి తొమ్మిది లేదా పది గంటలకు తింటారు.
- అమెరికాలో కాఫీ కప్పులు చాలా పెద్దవి... మగ్గుల్లా ఉంటాయి. వెంట పెట్టుకుని తరచూ తాగుతుంటారు. భారత్‌లో టీ కప్పులు చిన్నవి. చాయ్‌ని నిదానంగా సిప్ చేస్తూ ఆస్వాదిస్తారు. అదికూడా స్నేహితులతోనో, సన్నిహితులతోనో కలిసి.!
- అమెరికన్లు శాండ్‌విచ్ లాంటివి మినహా మిగిలిన ఆహార పదార్థాలు చాకుతోనో, ఫోర్క్‌తోనో తింటారు. కానీ భారత్‌లో చేత్తో తినడం సర్వసాధారణం.
- అక్కడ క్రమశిక్షణకు అత్యధిక ప్రాధాన్యమిస్తారు. ఇక్కడ గడియారంతో పరిగెత్తే కంటే... మనుషులు, మానవ సంబంధాలకు ఎక్కువ విలువ ఇస్తారు.
- 2017లో మొదటిసారి భారత్‌లో పర్యటించిన ఫిషర్.. ఇక్కడి మట్టి, మనుషులతో ప్రేమలో పడ్డారు. తరువాత రాజధాని ఢిల్లీలో స్థిర నివాసం ఏర్పరచుకున్నారు.



విన్నర్

నాన్న కలను తనదిగా చేసుకుంది. అందుకు కష్టాన్ని పెట్టుబడిగా పెట్టింది. సవాళ్లను స్వీకరించి... రోజుకు మూడు గంటలు బస్సులో ప్రయాణించి... టెన్నిస్ సాధన చేసింది. ఆర్థిక పరిస్థితులు అవరోధంగా మారినా... పట్టుదలతో నేడు భారత నంబర్ వన్ క్రీడాకారిణిగా ఎదిగింది. సానియా మీర్జా తరువాత ఈ ఘనత సాధించిన తెలుగు రాష్ట్రాల క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించిన 24 ఏళ్ల యామలపల్లి సహజ విజయ ప్రస్థానం 'నవ్య'కు ప్రత్యేకం.

సహజ.. నంబర్ వన్

"అమ్మాయిలు కూడా అబ్బాయిల్లానే స్వశక్తితో ఎదిగి, నచ్చిన రంగంలో రాణించాలనేది మా నాన్న భవానీ కుమార్ ఆకాంక్ష. నాన్న ఆశయాలకు అనుగుణంగా ఎదిగి, ఆయనకు మంచి పేరు తేవాలని చిన్నప్పుడే అనుకున్నాను. కానీ నాకేమో కొత్తవారితో మాట్లాడాలన్నా, నలుగురిలోకి వెళ్లాలన్నా బిడియంగా ఉండేది. నాన్న నా నుంచి అవన్నీ దూరం చేసి, నాలో ధైర్యం, ఆత్మవిశ్వాసం నింపారు. ఆయన కష్టం, ప్రోత్సాహమే నన్ను టెన్నిస్‌లో భారత నంబర్ వన్ క్రీడాకారిణిగా తీర్చిదిద్దాయి. నా తొలి కోచ్ నాన్నే. ప్రత్యర్థి, పోటీదారుడు, విమర్శకుడు, దిక్సూచి కూడా ఆయనే. నా ఎదుగుదల కోసం నాన్న చేసిన త్యాగాలు ఎన్నో. మెకానికల్ ఇంజనీరింగ్ చదివిన ఆయన... సరైన ఉద్యోగం దొరక్క తొలినాళ్లలో బస్సు కండక్టర్‌గా చేసేవారు. ఆ పని చేస్తూనే ఎంటెక్, ఎంసీఏ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరేందుకు హైదరాబాద్‌కు వచ్చారు. అప్పట్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు ఇప్పుడున్నంత జీతాలు లేవు. దిల్‌సుఖ్‌నగర్‌లోని ఒక చిన్న ఇంట్లో అద్దెకు ఉండేవాళ్లం. మా స్వస్థలం ఖమ్మం. నేను స్కూల్లో సరదాగా ఆటలు ఆడేదాన్ని. నాలోని ప్రతిభ గమనించిన మా నాన్న నన్ను మంచి క్రీడాకారిణిగా తయారు చేయాలనుకున్నారు.

పాత రాకెట్‌తో మొదలై...

ఒక రోజు మా నాన్న నన్ను సరూర్‌నగర్ స్టేడియంకు తీసుకెళ్లారు. లోపలికి వెళ్లగానే టెన్నిస్ కోర్టు కనిపించింది. టెన్నిస్ రాకెట్, బంతులు నన్ను ఆకర్షించాయి. ఆట నేర్చుకోవాలనుకున్నా. నాన్నకు చెప్పాను. కొత్త టెన్నిస్ రాకెట్ కొనడానికి ఆయన దగ్గర డబ్బులు లేవు. దాంతో ఐదొందల రూపాయలకు పాత రాకెట్ ఒకటి కొని నాకు ఇచ్చారు. దాంతోనే సాధన మొదలుపెట్టా. అక్కడ టెన్నిస్ కోర్టు ఉంది కానీ కోచ్ లేదు. యూట్యూబ్‌లో వీడియోలు చూసి, నాన్న నేర్చుకొని నాకు నేర్పేవారు. అలా నేర్చుకుని స్థానికంగా జరిగే పోటీల్లో పాల్గొని కొన్ని కప్‌లు కూడా గెలిచా.

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలంటే ఈ శిక్షణ సరిపోదు. దాంతో సికింద్రాబాద్ 'సిన్నెట్ టెన్నిస్ అకాడమీ'కి వెళ్లాం. కానీ ఫీజు చాలా ఉంది. అంత మేము కట్టలేమని చెబితే, కోచ్‌లు ప్రహ్లాద్ కుమార్ జైన్, రవి చంద్ర... నా ఆట చూసి నాకు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు అంగీకరించారు. అలా నా ప్రొఫెషనల్ టెన్నిస్ కెరీర్ ప్రారంభమైంది.

మూడు గంటలు బస్సులోనే...

శిక్షణ కోసం రోజూ మూడు గంటలు బస్సులో ప్రయాణించాల్సి వచ్చేది. ఉదయం ఐదున్నరకు ఇంటి దగ్గర బయలుదేరి నిజాం కాలేజీకి వెళ్లేదాన్ని. అక్కడ భాస్కర్‌రెడ్డి సార్ దగ్గర ఫిట్‌నెస్ శిక్షణ ఇచ్చేవారు. అది అవ్వగానే సికింద్రాబాద్‌లోని అకాడమీకి వచ్చి, మూడు గంటల పాటు టెన్నిస్ సాధన ఉండేది. మళ్లీ బస్సులోనే ఇంటికి వచ్చి, కొంచెం తిని కళాశాలకు వెళ్లేదాన్ని. స్నేహితుల నోట్స్ తీసుకుని ఉదయం జరిగిన పాఠాలు రాసుకొనేదాన్ని. సాయంత్రం బస్సు ఎక్కాక సీట్లు దొరికేవి కాదు. ఒకవేళ సీటు దొరికితే అలసటతో నిద్ర పట్టేసేది. అలా మా స్టాప్ దాటి హయత్‌నగర్ వరకు వెళ్లిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఇవన్నీ నాతో కావడం లేదని ఇంట్లో ఏడ్చేశాను. దాంతో నాన్న తన ఉద్యోగం మానేశారు. నా శిక్షణ సమయాలకు అనుగుణంగా ఒక స్కూల్లో టీచర్‌గా చేరారు.

అదే పెద్ద మలుపు...

నా కఠోర సాధన, శ్రమ ఫలితంగా 2015లో రాష్ట్ర, 2016లో జాతీయ జూనియర్ స్థాయి పోటీల్లో విజేతగా నిలిచా. అదే ఏడాది విజయవాడలో జరిగిన ఏజీటీఏ 50కే టోర్నీ ఓపెన్ కేటగిరీలో 15 ఏళ్ల వయసులోనే టైటిల్ కైవసం చేసుకున్నా. ఇక అక్కడ నుంచి వయసుతో సంబంధం లేకుండా జూనియర్ కాకుండా సీనియర్ విభాగంలోనే ఎక్కువగా ఆడడం ప్రారంభించా. మరోవైపు ఇంటర్మీడియేట్ పూర్తయింది. జాతీయ స్థాయి పోటీల్లోనూ సత్తా చాటుతున్నా. ఇక్కడ నుంచి మరో మెట్టు ఎక్కాలంటే ఏం చేయాలనే ఆలోచన మొదలైంది. అమెరికాలోని కొన్ని విశ్వవిద్యాలయాలు ఉచిత విద్యతో పాటు టెన్నిస్‌లో మంచి శిక్షణ కూడా ఇస్తాయని తెలిసింది. టెక్సాస్‌లోని శామ్ హౌస్టన్ యూనివర్సిటీని సంప్రతించాం. వీసా దరఖాస్తుకు కావల్సినంత డబ్బు మా దగ్గర లేదు. నాన్న స్నేహితులు సుబ్రహ్మణ్యం, నీరజ్ కేడియా, మా బంధువులు కొందరు సాయం చేశారు. అందులో సీటు లభించాలంటే అంతర్జాతీయ పోటీలు ఆడిన అనుభవం ఉండాలి. దాని కోసం అదే నెలలో రెండు టోర్నీల్లో ఆడా. ఒక టోర్నీలో క్వార్టర్స్ వరకు వెళ్లా. రెండుసార్లు తిరస్కరణ తరువాత వీసా లభించింది. అప్పటివరకు ఇంట్లోవాళ్లను వదిలి ఎక్కడికీ వెళ్లలేదు. అలాంటిది వేరే దేశం వెళ్లాలంటే ధైర్యం చాల్లేదు. మా అమ్మ సుప్రియ నన్ను ప్రోత్సహించింది. కోచ్ ప్రహ్లాద్ సార్ కిట్ కొనిచ్చారు. అలా తొలిసారి విమానం ఎక్కాను.

అదే లోకం...

అమెరికా వెళ్లాక టెన్నిస్ తప్ప మరో ధ్యాస లేదు. అందరూ మూడు నాలుగు గంటలు సాధన చేస్తే, నేను ఐదారు గంటలు కష్టపడ్డా. నా పట్టుదల చూసి అక్కడున్న కోచ్‌లు నా గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. శిక్షణలో భాగంగా విదేశీ క్రీడాకారిణులతో ఆడడంవల్ల నైపుణ్యం పెరిగింది. శామ్ హౌస్టన్ యూనివర్సిటీ తరఫున వివిధ పోటీల్లో పాల్గొని 10కి పైగా ట్రోఫీలు నెగ్గా. వరుసగా రెండేళ్లపాటు ఉత్తమ క్రీడాకారిణి అవార్డు సాధించా. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి తిరిగి మన దేశానికి వచ్చా.

ఖర్చు ఏడాదికి కోటి...



అంతర్జాతీయ ర్యాంకింగ్‌ను మెరుగు పర్చుకోవాలన్నా, గ్రాండ్‌స్లామ్ వంటి టోర్నీల్లో పాల్గొనాలన్నా ఏడాదిలో కనీసం 25 టోర్నీల్లో ఆడాలి. ఇందులో నాలుగైదు పెద్ద టోర్నీల్లో గెలవాలి. అప్పుడే ర్యాంకింగ్ మెరుగవుతుంది. ఇందుకోసం ఏడాదికి నా శిక్షణ, విదేశాలకు ప్రయాణ ఖర్చులు, కోచింగ్ సిబ్బందికి కలిపి కోటి రూపాయల వరకు ఖర్చు అవుతుంది. ప్రస్తుతం టెక్‌వేవ్ అనే సాఫ్ట్‌వేర్ సంస్థ కొంతమేర సాయం చేస్తోంది. మిగిలిన వాటికి నాన్న కష్టపడాల్సి వస్తోంది. నా పరిస్థితిని గమనించి, ప్రభుత్వం చేయూతనందిస్తే మరిన్ని టోర్నీల్లో ఆడే అవకాశం ఉంటుంది. ఏదిఏమైనా ప్రపంచ మేటి క్రీడాకారుల్లో ఒకరిగా ఎదిగి నాన్న కల నెరవేర్చాలన్నది నా ఆశయం."

వారి తరువాత నేనే...

ఇప్పటివరకు నాలుగు ఐటీఎఫ్ టైటిళ్లు సాధించా. అందులో లాస్‌ఏంజెల్స్ ఐటీఎఫ్ టైటిల్‌ను భారత క్రీడాకారిణుల్లో సానియా మీర్జా, కర్మాన్ కౌర్ తర్వాత గెలిచింది నేను మాత్రమే. గత ఏడాది ప్రతిష్ఠాత్మక బిల్లీ జీన్ కింగ్ కప్ (ఫెడ్ కప్)లో పాల్గొన్న భారత జట్టులో కూడా స్థానం సంపాదించా. ఈ ఏడాది భారత నంబర్ వన్ ర్యాంక్‌ను అందుకున్నా. అంతర్జాతీయ స్థాయిలో 1300కు పైగా ర్యాంక్‌తో మొదలై, కెరీర్ ఉత్తమ 284వ ర్యాంక్‌కు చేరుకున్నా. ఆస్ట్రేలియా, ఫ్రెంచ్, యూఎస్ ఓపెన్ వంటి గ్రాండ్‌స్లామ్‌ల్లో ఆడాలంటే నా ర్యాంక్ 240 దిగువకు రావాలి. వచ్చే నెలలో దుబాయ్‌లో ఒక టోర్నీ ఉంది. అందులో గెలిస్తే జనవరిలో జరిగే ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు అర్హత సాధించే అవకాశం ఉంది. ప్రస్తుతం నా దృష్టి అంతా ఆ టోర్నీపైనే.

• ఎస్ఎస్‌బి సంజయ్

ఏడాదికి 9 కోట్ల వేతనం. ఇంత భారీ వేతనాన్ని అందుకునే మహిళగా, సెలెబ్రిటీ మేనేజర్‌గా గుర్తింపు తెచ్చుకుంది పూజ దడ్లానీ. షారూఖ్ వ్యక్తిగత మేనేజర్‌గా 12 ఏళ్లుగా అతని వ్యక్తిగత, సినీ జీవితాలను నిర్వహిస్తూ అతని కుటుంబంలో సభ్యురాలిగా మారిపోయిన దడ్లానీ గురించిన ఆసక్తికరమైన కథనం.

'సెలెబ్రిటీ' మేనేజర్



నవంబరు 2 షారూఖ్ జన్మదినమే కాదు, అతని మేనేజర్ పూజా దడ్లానీ పుట్టిన రోజు కూడా! వీళ్లిద్దరి పుట్టిన రోజులే కాదు, వీళ్లిద్దరి ఆలోచనా విధానాలు కూడా ఒక్కటే! కాబట్టే 12 ఏళ్లుగా ఆమెనే తన మేనేజర్‌గా కొనసాగిస్తూ, కుటుంబ సభ్యురాలిగా ఆదరిస్తూ వచ్చాడు షారూఖ్. షారూఖ్ జీవితంలోకి పూజ ప్రయాణం రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో మొదలైంది. దాన్లో మేనేజర్‌గా కెరీర్ ప్రారంభించి కొద్ది కాలంలోనే పర్సనల్ మేనేజర్ స్థాయికి ఎదగడమే కాకుండా, షారూఖ్ వరుస అపజయాలతో నాలుగేళ్లు సినిమాలకు దూరంగా ఉన్నపుడు కూడా ఆయన వెన్నంటే ఉంది పూజ.



షారూఖ్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న పలు సంస్థల యాడ్ షూటింగ్‌లు, వాటి డేట్స్, సినిమాలకు సంబంధించి పారితోషికం, దర్శక నిర్మాతలతో సంప్రతింపులు తదితరాలన్నీ పూజనే నిర్ణయిస్తారు. ప్రజలతో, వ్యాపారులతో సమావేశాలు, విదేశీ ప్రయాణాల్లో షారూఖ్ వెంట పూజ ఉండాల్సిందే! మరి అన్ని వేళలా అతని వెన్నంటి ఉంటూ, అన్ని వ్యవహారాలూ చక్కబెట్టే పూజ షారూఖ్ నుంచి ఎంత వేతనం అందుకుంటోందో తెలిస్తే ఎవరికైనా ఆశ్చర్యం కలగక మానదు. రోజుకు పన్నెండు నుంచి పదహారు గంటలు పనిచేస్తున్నందుకుగాను, పూజ, ఏడాదికి అక్షరాలా తొమ్మిది కోట్ల వేతనం తీసుకుంటోంది. ఇది ఓ కంపెనీ సిఇఒ స్థాయికి సమానం.

షారూఖ్ కుటుంబంతో....

పూజ దడ్లానీకి షారూఖ్ కుటుంబంతో మంచి అనుబంధం ఉంది. తనకంటే పద్దెనిమిదేళ్ల చిన్నదైన పూజని తమ కుంటుంబంలో ఒకరిగానే చూస్తాడు షారూఖ్. షారూఖ్ భార్య గౌరీ ఖాన్, కుమారుడు ఆర్యన్ ఖాన్, కుమార్తె సుహానా ఖాన్ వ్యవహారాలను కూడా ఆమే పర్యవేక్షిస్తూ ఉంటుంది. ఆర్యన్ ఖాన్ డ్రగ్స్ కేసులో అరెస్టయినప్పుడు ఆ కుటుంబానికి అండగా నిలుస్తూనే, కోర్టు వ్యవహారాలు చూసుకోవడంతోపాటు మీడియా అడిగే ప్రశ్నలకు సమాధానాలివ్వడంలో ఆమె నిర్వహించిన పాత్ర చెప్పుకోతగ్గది. ప్రస్తుతం ఆర్యన్ నిర్వహిస్తున్న దుస్తుల వ్యాపారానికి కూడా ఆమే ప్రధాన సలహాదారుగా ఉంటోంది. షారూఖ్ ఐపిఎల్ జట్టు కోల్‌కతా నైట్ రైడర్స్ టీమ్‌తో మ్యాచ్‌లకు హాజరవడం, గ్యాలరీలో కూర్చుని జట్టుని ఉత్సాహపరచడం ఆమెకు చాలా ఇష్టం. ఇటీవల ఆమె బాంద్రాలో షారూఖ్ ఇంటికి సమీపంలో నిర్మించుకున్న ఇంటికి గౌరీఖాన్ ఇంటీరియర్ డిజైన్ చేయడం విశేషం.

ఖాళీ సమయాల్లో...

వృత్తిపరంగా ఎంత బిజీగా ఉన్నప్పటికీ కొంత సమయాన్ని కుటుంబానికి కేటాయిస్తుంది పూజ. సామాజిక మాధ్యమాల్లో కూడా యాక్టివ్‌గానే ఉండే పూజకు, విహారయాత్రలకు వెళ్లడం అక్కడి అందమైన చిత్రాలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడం అలవాటు. ఇటీవల షారూఖ్ జన్మదినం సందర్భంగా అతడితో ఉన్న ఫొటోను షేర్ చేస్తూ 'మీవంటి వ్యక్తి దొరకడం నా అదృష్టం. నా గురించి నాకంటే మీకే బాగా తెలుసు. నాపై నాకు నమ్మకం పెరిగేలా దిశా నిర్దేశం చేస్తూ, మార్గదర్శకుడిలా వ్యవహరిస్తూ నాకూ నా కుటుంబానికీ ప్రేమాభిమానాలు పంచుతున్నందుకు కృతజ్ఞతలు మిత్రమా! నీకు పుట్టిన రోజు శుభాకాంక్షలు' అని పోస్ట్ చేసింది.

పూజ దడ్లానీ పుట్టి పెరిగింది ముంబైలోనే! హెచ్ఆర్ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ ఎకనావిక్స్ నుంచి మాస్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ పూర్తిచేసిందామె. 2008లో లిస్టా జ్యువెల్స్ డైరెక్టర్, హితేష్ గుర్నానీని వివాహం చేసుకున్న పూజ, ప్రముఖ నటి దియా మిర్జా భర్త వైభవ్ రేఖికి సమీప బంధువు. పూజకు ఒక పాప. ఆ పాప పేరు రేనా. వృత్తి రీత్యా షారూఖ్‌తో ప్రయాణించేటప్పుడు, పూజ తన వెంట రేనాను తీసుకువెళ్తూ ఉంటుంది. షారూఖ్ చిన్న కొడుకు అబ్రామ్‌తో కూడా రేనాకు మంచి అనుబంధం ఉంది. షారూఖ్ కుటుంబంలో అందరికీ రేనా అంటే ప్రత్యేకాభిమానం.

కౌన్సెలింగ్

డాక్టర్! నా వయసు 55. మెనోపాజ్ దశలో ఉన్నాను. ఈ దశకు చేరుకున్న మహిళల్లో మానసిక, శారీరక సమస్యలు సహజమని విన్నాను. నాలో కూడా మునుపటి సత్తువ ఉండడం లేదు. హుషారు, చురుకుదనం తగ్గిపోయాయి. మునుపటిలా చలాకీగా ఉండగలిగే మార్గాల్ని సూచిస్తారా? - ఓ సోదరి, హైదరాబాద్

ముందస్తుగా మేల్కోవాలి

నడి వయసు మెనోపాజ్‌తో వేధించే ఇబ్బందులను అధిగవించాలంటే, వాటి పట్ల అవగాహనతో మెలగుతూ, లక్షణాల నుంచి దృష్టి మరల్చి, ఆహ్లాదం కలిగించే పనుల మీద మనసు పెట్టాలి. ఆఫీసు పనులు, ఇంటి పనులతో ఉద్యోగినులకు కాలక్షేపం అయిపోతూ ఉంటుంది. గృహిణులు వాళ్ల ఖాళీ సమయాల్లో నచ్చిన వ్యాపకాలను ఎంచుకోవాలి. ఏదో ఒక వ్యాపకం, అభిరుచికి సమయాన్ని కేటాయిస్తే, చిన్నపాటి నొప్పులు, డిప్రెషన్, ఆందోళనలను పట్టించుకునే సమయం ఉండదు. అలా ఉండబట్టే ఉద్యోగినులు చురుగ్గా, ఆరోగ్యంగా కనిపిస్తూ ఉంటారు. అలాగే సామాజిక అనుబంధాలు పెంచుకున్నప్పుడు, స్నేహితులు, సన్నిహితులతో అన్ని విషయాలనూ పంచుకునే అవకాశం ఉంటుంది కాబట్టి వాళ్ల నుంచి అందే ఆలంబనతో మనసు కూడా తేలిక పడుతుంది. కబుర్లతో, నవ్వు తెప్పించే మాటలతో మనసు, శరీరం హుషారుగా మారతాయి. కాబట్టి నడి వయసుకు చేరుకున్న మహిళలు మరీ ముఖ్యంగా మెనోపాజ్ మీద దృష్టి పెట్టకుండా, మునుపటిలా జీవితాన్ని కొనసాగించే పనుల మీద దృష్టి పెట్టాలి.



వ్యాయామం అవసరమే!

50ల ముందున్న శక్తి 50 తర్వాత ఉండకపోవచ్చు. అయితే అదనపు ముందు జాగ్రత్తలు, అవగాహనలతో ఈ అంతరాన్ని తగ్గించుకోవచ్చు. అందుకోసం ఆరోగ్యకరమైన జీవనశైలిని గడపాలి.

- సమతులాహారం తీసుకోవడంతో పాటు క్రమం తప్పక వ్యాయామం చేయాలి. ముందు నుంచీ వ్యాయామాలు అలవాటున్న వాళ్లు అదే తీవ్రతను కొనసాగించవచ్చు. కొత్తగా మొదలు పెట్టిన వాళ్లు వ్యాయామంలో భాగంగా నడకను ఎంచుకోవచ్చు.
- శరీరంలోని కండరాలన్నీ స్ట్రెచ్ అవడం కోసం యోగాను ఎంచుకోవచ్చు.
- రోజుకు పది నిమిషాల ధ్యానంతో మనసును ప్రశాంతంగా ఉంచుకోవచ్చు.

ముందస్తు పరీక్షలతో...

దైనందిన జీవితాన్ని ప్రభావితం చేసే ఏ లక్షణాన్నీ ఈ వయసులో నిర్లక్ష్యం చేయకూడదు. అవి భౌతికమైనవీ కావచ్చు, మానసికమైనవీ కావచ్చు. ఎలాంటి లక్షణాలూ లేకపోయినా, పైబడే వయసులో కొన్ని రుగ్మతలు మొదలయ్యే అవకాశాలుంటాయి కాబట్టి వార్షిక ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటే ప్రారంభంలోనే సమస్యను కనిపెట్టగలుగుతాం.

- పెరిగే వయసుతో ఎముకల సాంద్రత తగ్గి, ఎముకలు తేలికగా విరిగే అవకాశాలు పెరుగుతాయి. కాబట్టి వార్షిక పరీక్షల్లో ఎముకల సాంద్రతను పరీక్షించుకుని, అవసరాన్ని బట్టి క్యాల్షియం, విటమిన్ డిలను పెంచే మందులు వాడుకోవచ్చు.
- పెద్దవాళ్లలో బాత్రూములో జారి పడి తుంటి విరిగే అవకాశాలు లేకుండా అందుకు వీల్లేని ఏర్పాట్లు చేసుకోవాలి. ప్రత్యేకమైన చెప్పులు వాడుకోవాలి.
- అల్ట్రాసౌండ్ అబ్డామిన్, అల్ట్రాసౌండ్ బ్రెస్ట్, సోనో మామోగ్రామ్, పాప్‌స్మియర్ పరీక్షలు తప్పనిసరి. వీటిలో రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌లను ప్రారంభ దశల్లోనే కనిపెట్టవచ్చు.
- 40 ఏళ్లు దాటిన ప్రతి మహిళా ఏడాదికోసారి మామోగ్రామ్, పాప్‌స్మియర్ పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలి.
- ముఖ్యంగా నెలకోసారి రొమ్ములను స్వీయ పరీక్ష చేసుకుని, ఏ స్వల్ప మార్పునైనా వైద్యుల దృష్టికి తీసుకువెళ్లాలి.
- మధుమేహం, క్యాన్సర్ లాంటివి వంశపారంపర్యమైనవి కాబట్టి కుటుంబంలో ఈ రుగ్మతలు ఉన్నప్పుడు వాటిని ముందుగానే పసిగట్టే పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి.
- అమ్మ, పిన్ని, అత్త ఇలా దగ్గరి సంబంధీకులకు బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చి ఉంటే, ఆ కుటుంబంలోని మహిళలు తప్పనిసరిగా బ్రాకా జీన్ టెస్ట్ చేయించుకోవాలి.

డాక్టర్ హిమబిందు వీర్ల, కన్సల్టెంట్ అబ్‌స్టెట్రీషియన్, గైనకాలజిస్ట్ అండ్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్, హైదరాబాద్.

నీళ్లవల్ల ప్రయోజనాలెన్నో

ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి రోజు గరిష్ఠంగా మూడు లీటర్ల నీళ్లు తాగాలని పౌష్టికాహార నిపుణులు సూచిస్తున్నారు. దీని వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని చెబుతున్నారు. ఆ ప్రయోజనాలేమిటో చూద్దాం..

- ఉదయాన్నే లేచి నీళ్లు తాగటం వల్ల మొత్తం రోజంతా చురుకుగా ఉండగలుగుతారు. మెదడు పనితీరు మెరుగుపడుతుంది.
- నీళ్లు తాగటం వల్ల శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుంది.
- జీర్ణ వ్యవస్థ సక్రమంగా పనిచేయటానికి నీళ్లు ఎంతో ఉపకరిస్తాయి. శరీరంలో పేరుకుపోయిన మలినాలను బయటకు పంపటంలో నీళ్లు కీలకమైన పాత్ర పోషిస్తాయి. క్రమం తప్పకుండా ప్రతి రోజూ మూడు లీటర్ల నీళ్లు తాగితే జీర్ణ వ్యవస్థ పనితీరు ఎంతో మెరుగుపడుతుంది.
- శరీరంలోని కణాలకు పోషకాలు, ఆక్సిజన్ వంటివి అందించటంలో నీళ్లు ఉపకరిస్తాయి. తగినన్ని నీళ్లు తాగితే రక్త ప్రసరణ కూడా మెరుగుపడుతుంది.
- నీళ్లు తక్కువగా తాగితే దాని ప్రభావం మన చర్మంపై పడుతుంది. చర్మం పొడిబారిపోతుంది. నీళ్లు ఎక్కువగా తాగితే చర్మం మెరుస్తూ ఉంటుంది.
- రోజుకు మూడు లీటర్ల నీళ్లు తాగితే ఆకలి తగ్గుతుంది. దీని వల్ల ఏదో ఒక ఆహారం తింటూ ఉండాలనే యావ తగ్గిపోతుంది. దీని వల్ల బరువు తగ్గే అవకాశముంటుంది.



వచ్చేనెల నుంచే స్పిరిట్



ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు ప్రభాస్. మారుతి దర్శకత్వంలో 'రాజా సాబ్', ప్రశాంత్ నీల్‌తో 'సలార్ 2', హను రాఘవపూడి సినిమాల షూటింగ్స్‌లో ఆయన పాల్గొంటున్నారు. అలాగే బాలీవుడ్‌లో సందీప్ రెడ్డి వంగాతో 'స్పిరిట్' చిత్రం కూడా ప్రభాస్ ఖాతాలో ఉంది. అయితే ఇన్ని చిత్రాల నడుమ 'స్పిరిట్' సెట్స్‌పైకి వెళ్లడం చాలా ఆలస్యం అవుతుందని అంతా అనుకున్నారు. అయితే అలాంటిదేం లేదనీ, ఈ సినిమా వచ్చే నెల్లోనే సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత భూషణ్ కుమార్ తెలిపారు. త్వరలోనే నటీనటుల ఎంపిక ప్రారంభించనున్నట్లు ఆయన చెప్పారు. 'స్పిరిట్' షూటింగ్ ప్రారంభమైన ఆర్నెల్ల తర్వాత 'యానిమల్ పార్క్'ను సెట్స్‌పైకి తీసుకెళ్తామని తెలిపారు. మానవ అక్రమ రవాణా నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రంలో తొలిసారి ప్రభాస్ పోలీసాఫీసర్ పాత్ర పోషిస్తున్నారు. ఇప్పటికే మ్యూజిక్ సిట్టింగ్స్ ప్రారంభమయ్యాయి. హర్షవర్ధన్ రామేశ్వర్‌తో కలసి సందీప్‌రెడ్డి సంగీత సన్నాహాలు చేస్తున్న వీడియోను చిత్రబృందం షేర్ చేసింది.

శివ కార్తికేయన్ తెలుగు హీరో అయ్యారు


నితిన్

"అమరన్ చిత్రం చూస్తూ చాలా మంది తెలుగు ప్రేక్షకులు కంటతడి పెడుతున్న వీడియోలు చూశాను. మా సినిమా ప్రేక్షకులకు ఇంతలా చేరువైనందుకు సంతోషంగా ఉంది. విడుదలైన ప్రతి చోటా ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది. తెలుగులో మంచి వసూళ్లతో పాటు ప్రేక్షకుల ప్రశంసలు లభిస్తున్నందుకు ఆనందంగా ఉంది' అని శివ కార్తికేయన్ అన్నారు. ఆయన హీరోగా సాయిపల్లవి హీరోయిన్‌గా నటించిన 'అమరన్' చిత్రం ఇటీవలే విడుదలై ప్రేక్షకాదరణ పొందుతోంది. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన సక్సెస్‌మీట్‌లో సాయిపల్లవి మాట్లాడుతూ "అమరన్ చిత్రంతో తెలుగు ప్రేక్షకుల ప్రేమను మరోసారి పొందాను. నా గత చిత్రాల్లోని భానుమతి, వెన్నెల పాత్రల తరహాలో ఈ సినిమాలోని ఇందు పాత్రకు కూడా గొప్ప స్పందన రావడం ఆనందాన్నిచ్చింది. మీ ప్రేమకు ఎప్పటికీ రుణపడి ఉంటాను' అని చెప్పారు. దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి మాట్లాడుతూ 'మంచి చిత్రాలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారని మరోసారి 'అమరన్'తో రుజువైంది. సాయిపల్లవి, శివకార్తికేయన్ నటన ప్రేక్షకులను ఆకట్టుకుంది' అని తెలిపారు. "ఈ సినిమాతో శివకార్తికేయన్ మా తెలుగు హీరో, తెలుగు అబ్బాయి అయిపోయారు" అన్నారు హీరో నితిన్. నిర్మాత సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ "అమరన్'ను రిలీజ్ చేసే అవకాశం ఇచ్చిన కమల్‌హాసన్, మహేంద్ర గారికి ధన్యవాదాలు. ఇప్పటికే తెలుగునాట రూ. 20 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. జాతీయ పురస్కారాలు ఈ సినిమాను వరిస్తాయి' అన్నారు.



రెండు భాగాలుగా రామాయణ

రణబీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీత, యశ్ రావణుడిగా నటిస్తున్న 'రామాయణ' చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. ఈ సినిమాను ప్రకటించిన సంవత్సరం తర్వాత ఎట్టకేలకు బుధవారం నాడు దాని వివరాలను నిర్మాత నమిత్ మల్హోత్రా అధికారికంగా వెల్లడించారు. ఈ సినిమా రెండు భాగాలుగా చిత్రాన్ని రూపొందిస్తున్నామనీ, తొలి భాగం 2026 దీపావళికి, రెండో భాగం 2027 దీపావళికి విడుదల అవుతాయనీ సోషల్ మీడియా వేదికగా నమిత్ వెల్లడించారు. నితీశ్ తివారి రూపొందిస్తున్న ఈ సినిమాలో టీవీ రాముడు అరుణ్ గోవిల్ దశరథుని పాత్రను, లారా దత్తా కైక పాత్రను పోషిస్తున్నారు. హనుమంతుడిగా సన్నీ డియోల్ నటిస్తున్నారు. శూర్పణఖగా రకుల్ ప్రీత్‌సింగ్ నటిస్తారని అంటున్నారు. రాముడి పాత్ర కోసం రణబీర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. మందు తీసుకోవడం మానేసిన రణబీర్ నిష్ఠగా ఉంటున్నానని, సంభాషణలలో స్పష్టత కోసం శిక్షణ పొందుతున్నాననీ ఆయన చెప్పారు. ఓ భక్తురాలుగా సీత పాత్రను పోషిస్తున్నట్లు సాయిపల్లవి ఇప్పటికే ప్రకటించారు.



సరదాగా రానా.. ఘాటుగా హరీశ్‌శంకర్!

రానా మంచి నటుడే కాదు మంచి వ్యాఖ్యాత కూడా. తన దైన శైలిలో జోక్స్, పంచెస్ వేస్తూ ఆసక్తికరంగా కార్యక్రమాన్ని నిర్వహించడం ఆయనకు అలవాటు. ఇటీవల అబుదాబిలో జరిగిన ఐఫా అవార్డుల వేడుకకు రానా వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఆయనకు యువ హీరో తేజా సజ్జా తోడయ్యారు. ఇద్దరూ కలసి చాలా సరదాగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హీరోల చిత్రాల గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. రామ్‌చరణ్ 'గేమ్ ఛేంజర్' డిలే గురించి, అల్లు అర్జున్ 'పుష్ప 2' కాదు.. 'పుష్ప టూ లేట్' అంటూ రానా, తేజ సరదాగా చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో ట్రోల్ అవుతున్నాయి. అలాగే ఈ కార్యక్రమంలోనే రానా మాట్లాడుతూ 'ఈ ఏడాది అమితాబ్ కెరీర్‌లోనే అతి పెద్ద ఎత్తుని, లోతును చూశా' అని అనగానే, ఎత్తు ఏమిటని తేజ ప్రశ్నించారు. 'కల్కి' అని సమాధానం చెప్పారు రానా. మరి లోతు అని తేజా అడగ్గానే ' రీసెంట్‌గా రిలీజ్ అయింది కదా.. అదే 'మిస్టర్..' అని రానా ఏదో చెప్పబోతుంటే 'ఇప్పుడొద్దులే' అని తేజ మాట దాటేశారు. తమ హీరో రవితేజ నటించిన 'మిస్టర్ బచ్చన్' సినిమానే ఉద్దేశించే ఇలా అన్నారని హర్ట్ అయిన ఓ అభిమాని రానా మాట్లాడిన వీడియోని జత చేస్తూ ట్వీట్ చేశాడు. దర్శకుడు హరీశ్‌శంకర్‌కి ట్యాగ్ చేశాడు. వెంటనే ఆయన స్పందించి 'ఎన్నో విన్నాను తమ్ముడు.. అందులో ఇదొకటి. అన్ని రోజులూ ఒకేలా ఉండవు. నాకైనా.. ఎవరికైనా' అంటూ రిప్లై ఇచ్చారు.

రామ టాకీస్ ర్యాంప్ సాంగ్



కరుణ కుమార్ దర్శకత్వంలో విజయేందర్‌రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మించిన సినిమా 'మట్కా'. వరుణ్ తేజ్ , మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి ప్రధాన పాత్రల్లో నటించారు. ఈనెల 14 గ్రాండ్ రిలీజ్‌కి సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో రామ టాకీస్ ర్యాంప్ సాంగ్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు. భవానీ రాకేశ్ అదిరిపోయే బీట్స్‌తో అడిక్టివ్ ఫోక్ నంబర్‌గా ఈ పాటని కంపోజ్ చేశారు. డైరెక్టర్ కరుణ కుమార్ స్వయంగా రాసిన జానపద సాహిత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కాగా, ఈ చిత్రానికి జి.వి.ప్రకాశ్ కుమార్ మ్యూజిక్, కిశోర్ కుమార్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు.

నారా రోహిత్ యాక్షన్



విజయ్ కనకమేడల దర్శకత్వంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మనోజ్ మంచు, నారా రోహిత్ నటిస్తున్న చిత్రం 'భైరవం'. కె.కె.రాధామోహన్ నిర్మాత. రీసెంట్‌గా విడుదలైన బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ఫస్ట్ లుక్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. కాగా, నారా రోహిత్ ఫెరోషియస్ అవతార్‌ని ప్రజెంట్ చేస్తూ ఇంటెన్స్ ఫస్ట్ లుక్‌ను మేకర్స్ బుధవారం రివీల్ చేశారు. అగ్నితో నిండిన టెంపుల్ బ్యాక్‌డ్రాప్‌లో రోహిత్ యాక్షన్ సీన్‌లో కనిపించారు.

ఓ ప్రేమమూర్తి కథ



ప్రేమమూర్తి అయిన ఓ తల్లి తన జీవిత గమనంలో ఎలాంటి భావోద్వేగాలకు గురైంది అన్న ఇతివృత్తంతో రూపొందిన చిత్రం 'తల్లి మనసు'. రుచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రల్లో నటించారు. వి. శ్రీనివాస్ దర్శకుడు. సీనియర్ డైరెక్టర్ ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ఆయన తనయుడు ముత్యాల అనంత కిశోర్ నిర్మిస్తున్న చిత్రమిది. ఈ నెలలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా ముత్యాల సుబ్బయ్య మాట్లాడుతూ 'మాకు చాలా సంతృప్తిని ఇచ్చిన ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకులను అలరింపచేస్తుందన్న నమ్మకం ఉంది' అని అన్నారు.

సత్తా చాటితేనే!

● దృష్టంతా రాహుల్‌పైనే
● ఆసీస్-భారత్ ఎ జట్ల టెస్ట్ నేటి నుంచి



మెల్‌బోర్న్: వరుస వైఫల్యాలతో జట్టులో స్థానాన్నే ప్రశ్నార్థకం చేసుకొన్న కేఎల్ రాహుల్‌కు.. మళ్లీ టీమిండియాలో చోటు దక్కించుకొనే సువర్ణావకాశం లభించింది. గురువారం నుంచి జరిగే రెండో అనధికార టెస్ట్‌లో ఆస్ట్రేలియా-ఎతో భారత్-ఎ తలపడనుంది. మరికొద్ది రోజుల్లో సీనియర్ జట్టు ఐదు టెస్ట్‌ల సిరీస్ కోసం ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. కాగా, ఆసీస్‌తో పెర్త్‌లో జరిగే తొలి టెస్ట్‌కు కెప్టెన్ రోహిత్ శర్మ దూరమవుతాడన్న ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. దీంతో జైస్వాల్‌కు తగిన జోడీ కోసం.. రాహుల్, అభిమన్యు ఈశ్వరన్‌లపై సెలెక్టర్లు దృష్టి సారించారు. అందులో భాగంగా న్యూజిలాండ్‌తో సిరీస్ మధ్యలోనే జట్టులో చోటు కోల్పోయిన రాహుల్‌తోపాటు రిజర్వ్ కీపర్ ధ్రువ్ జురెల్‌ను తగిన ప్రాక్టీస్ కోసం ముందుగానే ఆస్ట్రేలియాకు పంపారు. పైగా వచ్చే నెల 26న ఇక్కడే బాక్సింగ్ డే టెస్ట్ జరగనుండడంతో.. ఒకవేళ రాహుల్ సత్తాచాటితే జట్టులో స్థానం నిలబెట్టుకొనే అవకాశం ఉంది. అంతేకాకుండా భారత్-ఎ లైనప్‌లో ఇక్కడి పిచ్‌పై గతంలో ఆడిన అనుభవం ఒక్క రాహుల్‌కే ఉండడం కొంత కలిసివచ్చే అంశం. కంగారూ సీనియర్ పేసర్ స్కాట్ బోలాండ్‌ను అతడు ఎలా ఎదుర్కొంటాడన్న దాన్ని కూడా సెలెక్టర్లు నిశితంగా గమనించనున్నారు. కాగా, ఈశ్వరన్‌తో కలిసి చేసిన ప్రాక్టీస్‌లో రాహుల్ చక్కని టచ్‌లో కనిపించాడు. ఓపెనర్‌గా రాహుల్‌ను దించితే.. రుతురాజ్ మిడిలార్డర్‌లో ఆడాల్సి ఉంటుంది. తొలి మ్యాచ్‌లో ఓటమి నేపథ్యంలో జట్టులో కొన్ని మార్పులు చేసే అవకాశం ఉంది. బాబా ఇంద్రజిత్ స్థానంలో రాహుల్ ఎంట్రీ ఇవ్వనుండగా.. కీపర్‌గా ఇషాన్ కిషన్ స్థానంలో జురెల్ రాక ఖాయమైంది. పేసర్ నవ్‌దీప్ సైనీ ఆకట్టుకోలేకపోవడంతో లెఫ్టామ్ పేసర్ ఖలీల్ అహ్మద్, స్పిన్నర్ మానవ్ సుతార్ స్థానంలో తనుష్ కోటియన్‌కు తుది జట్టులో చోటుదక్కవచ్చు. సాయి సుదర్శన్, దేవ్‌దత్ పడిక్కల్‌తో పాటు తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ ప్రదర్శనను కూడా సెలెక్టర్లు పరిశీలించే అవకాశం ఉంది. పేసర్లు ముకేశ్ కుమార్, ప్రసిద్ధ్ కృష్ణ జట్టుకు కీలకం కానున్నారు.

భారత్-ఎ నిరసనపై స్పష్టతనివ్వాలి: వార్నర్

అనధికార తొలి టెస్ట్ నాలుగో, ఆఖరి రోజు ఆట ఆరంభానికి ముందు బంతిని మార్చడం వివాదాస్పదమైంది. బంతిని మార్చడంపై భారత్-ఎ ఆటగాళ్లు నిరసన వ్యక్తం చేశారు. అయితే, బంతిని మార్చినందుకు భారత ప్లేయర్లు అభ్యంతరం చెప్పలేదని.. దెబ్బతిన్న బంతికి బదులుగా ఇచ్చిన బాల్‌పై మాత్రమే వారు వాగ్వాదానికి దిగారని సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్ రాసింది. ఈ నేపథ్యంలో జరిగిన నాటకీయ పరిణామాలపై క్రికెట్ ఆస్ట్రేలియా స్పష్టత ఇవ్వాలని ఆసీస్ మాజీ ఓపెనర్లు డేవిడ్ వార్నర్, ఎడ్ కోవాన్ డిమాండ్ చేశారు. త్వరలో భారత సీనియర్ జట్టు రానున్న నేపథ్యంలో ఎటువంటి అనుమానాలకు తావులేకుండా ఉండేందుకు వీలైనంత తొందర్లో ఈ వివాదానికి ముగింపు పలకాలని వార్నర్ సూచించాడు. భారత్ కాకుండా మరోజట్టు ఆ స్థానంలో ఉండి ఉంటే.. తమ స్పందన మరో విధంగా ఉండేదని కోవాన్ అన్నాడు. ఊహాగానాలకు తెరదించేందుకు బీసీసీఐ కూడా చొరవ చూపాలని కోరాడు.

రాహుల్ అదుర్స్

హైదరాబాద్ 261/5 ● రాజస్థాన్‌తో రంజీ

జైపూర్: ఎలీట్ గ్రూప్-బి రంజీ మ్యాచ్‌లో హైదరాబాద్ తొలిరోజు సత్తా చాటింది. రాజస్థాన్‌తో ఇక్కడ బుధవారం మొదలైన మ్యాచ్‌లో కెప్టెన్ రాహుల్ సింగ్ గెహ్లాట్ (66) అర్ధ శతకంతో అదరగొట్టడంతో హైదరాబాద్ మొదటి ఇన్నింగ్స్‌లో 88 ఓవర్లలో 5 వికెట్లకు 261 పరుగులు చేసింది. తొలి రోజు ఆట ముగిసేసరికి రాహుల్ రాదేశ్ (43), అజయ్‌దేవ్ గౌడ్ (34) క్రీజులో ఉన్నారు. రాజస్థాన్ బౌలర్లలో అజయ్ సింగ్ మూడు వికెట్లు పడగొట్టాడు. ఇక ఆంధ్ర జట్టుతో జరుగుతున్న మ్యాచ్‌లో మొదటి రోజు ఆట కల్లా ఉత్తరాఖండ్ 232/1తో భారీస్కోరు దిశగా దూసుకెళ్తోంది. ప్రియాన్షు ఖండూరి (107 నాటౌట్) సెంచరీ చేశాడు.

రాజభోగాలు వీడండి.. రంజీలు ఆడండి

● విరాట్, రోహిత్‌కు కైఫ్ సూచన

న్యూఢిల్లీ: న్యూజిలాండ్‌తో టెస్ట్ సిరీస్‌లో పేలవ ప్రదర్శన కనబరచిన సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేశవాళీ క్రికెట్ ఆడకపోవడం వల్లే వాళ్లు వరుసగా విఫలమవుతున్నారని కొందరు మాజీలు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో రోహిత్, విరాట్ లాంటి స్టార్లు రాజభోగాలను వదిలి.. రంజీలు ఆడాలని మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ సూచించాడు. 'రంజీల్లో రాణిస్తే ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతుంది. 2020 టూర్ ముందు పంత్ దేశవాళీ మ్యాచ్ ఆడి జట్టులోకి వచ్చాడు. అతడు ఎంతటి చరిత్రకు కారణమయ్యాడో చూశాం కదా' అని కైఫ్ అన్నాడు.



కోహ్లీ.. పదేళ్లలో తొలిసారి

దుబాయ్: న్యూజిలాండ్‌తో మూడు టెస్ట్‌ల సిరీస్‌లో ఘోరంగా విఫలమైన విరాట్ కోహ్లీ ర్యాంకింగ్స్‌లో మరింత పడిపోయాడు. బుధవారం ప్రకటించిన ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్ బ్యాటర్ల జాబితాలో విరాట్ 8 స్థానాలు కోల్పోయి 22వ స్థానానికి దిగజారాడు. టెస్ట్ ర్యాంకింగ్స్‌లో కోహ్లీ టాప్-20లో లేకపోవడం గత పదేళ్లలో ఇదే తొలిసారి. ఇక, రెండు స్థానాలు చేజార్చుకున్న రోహిత్ శర్మ 26వ ర్యాంక్‌కు పడిపోయాడు. రిషభ్ పంత్ ఐదు స్థానాలు మెరుగు పరచుకొని 6వ ర్యాంక్‌కు చేరగా.. యశస్వీ జైస్వాల్ ఓ స్థానం కోల్పోయినా 4వ ర్యాంక్‌తో భారత్ నుంచి టాప్ బ్యాటర్‌గా ఉన్నాడు. ఇక జో రూట్ టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. బౌలర్లలో అశ్విన్ ఓ స్థానం చేజారి 5వ ర్యాంక్‌లో, బుమ్రా 3వ స్థానంలో ఉన్నారు. ఆల్‌రౌండర్లలో జడేజా నెంబర్‌వన్ ర్యాంక్‌ను కాపాడుకున్నాడు.

టాప్‌సీడ్‌కు రిత్విక్ జోడీ షాక్

మెట్జ్ (ఫ్రాన్స్): తెలుగు ఆటగాడు రిత్విక్ చౌదరి బొల్లిపల్లి మోసెల్లె ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో డబుల్స్ టైటిల్ సాధించే దిశగా ముందంజ వేశాడు. పోర్చుగల్‌కు చెందిన ఫ్రాన్సిస్కో కాబ్రల్ జతగా రిత్విక్ పురుషుల డబుల్స్‌లో సెమీఫైనల్ చేరాడు. బుధవారం ఇక్కడ జరిగిన క్వార్టర్‌ఫైనల్లో రిత్విక్-ఫ్రాన్సిస్కో ద్వయం 7-6(1), 6-4తో టాప్‌సీడ్ జంట శాంటియాగో (మెక్సికో)-ఎడ్వర్డ్ రోజర్ వాసెలిన్ (ఫ్రాన్స్)కు షాకిచ్చి సంచలనం సృష్టించింది. హైదరాబాద్‌కు చెందిన రిత్విక్ ఓ ఏటీపీ టూర్ ఈవెంట్‌లో సెమీఫైనల్ చేరడం ఇదే తొలిసారి.

కిరణ్ జార్జ్ శుభారంభం

కొరియా మాస్టర్స్

ఇక్సాన్ సిటీ (కొరియా): భారత యువ షట్లర్ కిరణ్ జార్జ్ కొరియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ సూపర్ 300 టోర్నమెంట్‌లో శుభారంభం చేశాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ మొదటి రౌండ్లో 24 ఏళ్ల కిరణ్ 15-21, 21-12, 21-15తో వియత్నాంకు చెందిన కువాన్ లిన్ కుయోపై విజయం సాధించాడు.


సెమీస్‌కు గాఫ్

● డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో స్వియటెక్‌కు షాక్
● సీజన్‌ను నెం.1తో ముగించనున్న సబలెంక



రియాద్: ప్రతిష్ఠాత్మక సీజన్ ముగింపు టోర్నమెంట్ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో అమెరికా స్టార్ కొకొ గాఫ్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్‌లో గాఫ్ 6-3, 6-4తో ఇగా స్వియటెక్ (పోలెండ్)ను చిత్తుచేసింది. దీంతో రెండో విజయంతో కొకొ సెమీస్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. అయితే, ప్రస్తుతం ర్యాంకింగ్స్‌లో నెంబర్ వన్‌గా ఉన్న సబలెంక.. స్వియటెక్ ఓటమితో ఈ సీజన్‌ను టాప్‌ర్యాంక్‌తో ముగించనుంది. స్వియటెక్ రెండో ర్యాంక్‌లోనే కొనసాగనుంది.

లెవాన్‌ను నిలువరించిన అర్జున్



చెన్నై: తెలుగు జీఎంలు ఇరిగేసి అర్జున్, ద్రోణవల్లి హారికకు చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్ టోర్నీ రెండోరోజు పోటీల్లో మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. బుధవారం జరిగిన రెండో రౌండ్‌లో లెవాన్ అరోనియన్ (అమెరికా)తో తలపడిన అర్జున్ డ్రా చేసుకున్నాడు. ఇక, చెన్నై చాలెంజర్స్ ఓపెన్ టోర్నీలో ఆడుతున్న హారిక రెండో రౌండ్‌లో ల్యూక్ మెండోంకా (భారత్) చేతిలో ఓటమి పాలైంది.

గ్రాండ్ ప్రీ చెస్‌లో హంపి డ్రాతో సరి

షైంకెంట్ (కజకిస్థాన్): ఫిడే మహిళల గ్రాండ్ ప్రీ రెండో అంచె పోటీల్లో కోనేరు హంపి తప్పక గెలవాల్సిన మ్యాచ్‌ను డ్రాతో సరిపెట్టుకుంది. ఈ ఫలితంతో హంపి టైటిల్ అవకాశాలు సన్నగిల్లాయి. బుధవారం ముగిసిన ఏడో రౌండ్‌లో ఎలిజబెత్ పేహ్ట్‌తో తలపడిన హంపి 14 ఎత్తుల తర్వాత డ్రాకు అంగీకరించింది. దీంతో ఏడు రౌండ్లు ముగిసేసరికి హంపి 3.5 పాయింట్లతో ఆరోస్థానానికి పరిమితమైంది. కజకిస్థాన్ జీఎం బిబిసారాతో తలపడిన మరో భారత జీఎం దివ్యా దేశ్‌ముఖ్ 41 ఎత్తుల తర్వాత తన గేమ్‌ను డ్రాగా ముగించింది.

ఆఖర్లో టైటాన్స్ పట్టేసింది

పాయింట్ తేడాతో తలైవాస్‌పై గెలుపు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రో కబడ్డీ లీగ్‌లో బుధవారం తమిళ్ తలైవాస్‌తో అత్యంత ఉత్కంఠగా జరిగిన పోరులో తెలుగు టైటాన్స్ పాయింట్ తేడాతో విజేతగా నిలిచింది. ఆఖర్లో తలైవాస్ ఆటగాళ్లపై పట్టు సాధించిన టైటాన్స్ 35-34తో గెలిచింది. టైటాన్స్ కెప్టెన్ పవన్ సెహ్రావత్ 12 పాయింట్లతో చెలరేగగా.. అతడికి ఆశిష్ నర్వాల్ (9 పాయింట్లు) సహకారం అందించాడు. మరో మ్యాచ్‌లో యు ముంబా 42-40తో పట్నా పైరేట్స్‌పై విజయం సాధించింది.

వేలానికి స్టోక్స్ దూరం

● రూ. 2 కోట్ల జాబితాలో పంత్, అయ్యర్, షమి


స్టోక్స్


పంత్

న్యూఢిల్లీ: ఇంగ్లండ్ టెస్ట్ కెప్టెన్ బెన్ స్టోక్స్ ఐపీఎల్‌కు దూరం కానున్నాడు. ఐపీఎల్ మెగా వేలం కోసం రిజిస్టర్ చేసుకొన్న 1574 మంది ఆటగాళ్ల జాబితాలో స్టోక్స్ పేరు లేదు. అయితే, ఆశ్చర్యకరంగా అతడి మాజీ సహచరుడు, వెటరన్ పేసర్ జిమ్మీ అండర్సన్ వేలానికి రావడం విశేషం. మెగా వేలం ఈ నెల 24, 25 తేదీల్లో సౌదీ అరేబియాలోని జెడ్డాలో జరగనుంది. ఫ్రాంచైజీలు అట్టిపెట్టుకొనే ఆటగాళ్లను ఖరారు చేయడంతో.. కుదించిన జాబితాను బీసీసీఐ విడుదల చేసింది. ప్రతి ఫ్రాంచైజీ 25 మంది సభ్యుల జట్టును తయారు చేసుకోనుంది. ఇందులో భాగంగా 10 జట్లు 46 మందిని రిటైన్ చేసుకోగా.. 204 మందిని వేలంలో కొనుగోలు చేయనున్నాయి. గాయాలు, పని భారం కారణంగా స్టోక్స్ గతేడాది లీగ్‌కు దూరమయ్యాడు.

రూ. 2 కోట్లలో మనోళ్లు..: భారత ఆటగాళ్లు రిషభ్ పంత్, శ్రేయాస్ అయ్యర్, రాహుల్, అశ్విన్, చాహల్ రూ. 2 కోట్ల కనీస ధర జాబితాలో పేర్లను నమోదు చేసుకొన్నారు. షమి, అర్ష్‌దీప్‌తోపాటు సిరాజ్, ఖలీల్ అహ్మద్, ముకేశ్ కుమార్, వెంకటేశ్ అయ్యర్, అవేశ్ ఖాన్, దీపక్ చాహర్, ఇషాన్ కిషన్, భువనేశ్వర్‌లు కూడా ఈ జాబితాలో రిజిస్టర్ చేసుకొన్నారు. కాగా సర్ఫరాజ్ ఖాన్, పృథ్వీ షా తమ పేర్లను రూ. 75 లక్షల కనీస ధర జాబితాలో నమోదు చేసుకొన్నారు.

అండర్సన్ తొలిసారి..: అండర్సన్ తొలిసారి ఐపీఎల్ వేలంలో రిజిస్టర్ చేసుకోవడం విశేషం. 42 ఏళ్ల జిమ్మీ ఈ ఏడాది టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఒక్క ఫ్రాంచైజీ లీగ్ కూడా ఆడని అండర్సన్ రూ. 1.25 కోట్ల కనీస ధరకు తన పేరును నమోదు చేసుకొన్నాడు. టీ20 వరల్డ్‌కప్‌లో అందరి దృష్టినీ ఆకర్షించిన అమెరికా పేసర్ సౌరభ్ నేత్రావల్కర్, ఇటలీ పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ థామస్ డ్రాకా రూ. 30 లక్షల కనీస ధర జాబితాలో రిజిస్టర్ చేసుకొన్నారు. గతేడాది అమ్ముడుపోని ఆస్ట్రేలియా స్పిన్నర్ లియాన్‌తోపాటు రూ. 24.5 కోట్లు పలికిన పేసర్ మిచెల్ స్టార్క్, ఇంగ్లండ్ పేసర్ ఆర్చర్ కూడా రూ. 2 కోట్ల జాబితాలో వేలానికి రానున్నారు.

ట్రంపంప రంపంపం!

బిజినెస్

మార్కెట్‌కు ట్రంప్ జోష్.. సెన్సెక్స్ 901 పాయింట్లు అప్

24,500 స్థాయికి చేరువైన నిఫ్టీ.. ఐటీ, ఫార్మా రంగ షేర్లు జిగేల్

2 రోజుల్లో రూ.10.47 లక్షల కోట్ల సంపద వృద్ధి



ముంబై: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం.. స్టాక్‌మార్కెట్ వర్గాల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. ఐటీ, ఫార్మా షేర్లలో ఇన్వెస్టర్లు భారీగా కొనుగోళ్లు జరపడంతో సెన్సెక్స్ మళ్లీ 80,000 మైలురాయిని దాటగా.. నిఫ్టీ 24,500 స్థాయికి చేరువైంది. సెన్సెక్స్ ఒకదశలో 1,093 పాయింట్ల వరకు పుంజుకున్నప్పటికీ, చివరికి 901.50 పాయింట్ల లాభంతో 80,378.13 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 270.75 పాయింట్ల వృద్ధితో 24,484.05 వద్ద ముగిసింది. సూచీలు లాభపడటం వరుసగా ఇది రెండో రోజు. ఈ రెండ్రోజుల్లో ఈక్విటీ మదుపరుల సంపద రూ.10.47 లక్షల కోట్లు పెరిగి రూ.452.58 లక్షల కోట్లకు (5.37 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.

● సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 25 రాణించాయి. టీసీఎస్ 4.21 శాతం, ఇన్ఫోసిస్ 4.02 శాతం, హెచ్‌సీఎల్ టెక్ 3.71 శాతం, టెక్ మహీంద్రా 3.68 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్లుగా నిలిచాయి. రిలయన్స్ షేరు 50 శాతం ఎగబాకింది.

● బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 2.28 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.96 శాతం పుంజుకున్నాయి. రంగాలవారీ సూచీలన్నీ పాజిటివ్‌గా ముగిశాయి. బీఎస్ఈ ఐటీ 4.04 శాతం, టెక్ 3.37 శాతం ఎగబాకాయి.

బిట్‌కాయిన్ @ 75,000 డాలర్లు

ట్రంప్ విక్టరీ క్రిప్టో మార్కెట్లో జోష్ పెంచింది. బిట్‌కాయిన్ విలువ ఒకదశలో 8 శాతం మేర పెరిగి 75,384 డాలర్ల స్థాయిలో సరికొత్త ఆల్‌టైం రికార్డును నమోదు చేసింది. మిగతా వర్చువల్ కరెన్సీలైన ఈథర్, ఎక్స్‌ఆర్‌పీ, లైట్‌కాయిన్, డోజీకాయిన్, షీబాఇను కాయిన్ సైతం 4-9 శాతం మేర పుంజుకున్నాయి. గతంలో ట్రంప్ క్రిప్టో కరెన్సీలపై అయిష్టంగానే ఉన్నప్పటికీ, ఎన్నికల ముందు అనూహ్యంగా తన మనసు మార్చుకున్నారు. అమెరికాను క్రిప్టోల రాజధానిగా తీర్చిదిద్దుతానని, బిట్‌కాయిన్‌ల వ్యూహాత్మక నిల్వలను ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. అంతేకాదు, ఎన్నికల ప్రచార కార్యక్రమాలకు అవసరమైన విరాళాలను క్రిప్టోల్లోనూ స్వీకరించారు. ట్రంప్ సానుకూల వైఖరితో ఈ వర్చువల్ కరెన్సీల విలువ మున్ముందు మరింత పెరగవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. బిట్‌కాయిన్ విలువ 1,00,000 డాలర్లకు చేరుకోవచ్చన్న అంచనాలున్నాయి.

సాయి లైఫ్ సైన్సెస్ ఐపీఓకు సెబీ ఆమోదం

హైదరాబాద్‌కు చెందిన సాయి లైఫ్ సైన్సెస్‌తోపాటు మరో మూడు కంపెనీల ఐపీఓలకు సెబీ ఆమోదం తెలిపింది. ఫార్మాస్యూటికల్ ఫార్ములేషన్స్ కంపెనీ రూబికాన్ రీసెర్చ్, యార్న్ తయారీదారు సనాతన్ టెక్స్‌టైల్స్, వాహన పరికరాల తయారీదారు మెటల్‌మ్యాన్ ఆటో ఈ జాబితాలో ఉన్నాయి. సాయి లైఫ్ సైన్సెస్ ఐపీఓలో భాగంగా రూ.800 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్, ఇతర ఇన్వెస్టర్లకు చెందిన 6.15 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయించనుంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధుల్లో రూ.600 కోట్లు రుణ బకాయిలు తీర్చేందుకు, కొంత సొమ్మును వ్యాపార అవసరాలకు ఉపయోగించుకోనున్నట్లు సాయి లైఫ్ సైన్సెస్ వెల్లడించింది.

అమెరికా మార్కెట్ జూమ్

బుధవారం అమెరికన్ స్టాక్ మార్కెట్ సూచీలు కూడా భారీ లాభాలతో సరికొత్త రికార్డు గరిష్ఠాలకు ఎగబాకాయి. డోజోన్స్ ఏకంగా 1,300 పాయింట్లు పుంజుకోగా.. ఎస్ అండ్ పీ 1.85 శాతం, నాస్‌డాక్ 2.11 శాతం పెరిగాయి. ట్రంప్‌కు బలమైన మద్దతుదారైన ఎలాన్ మస్క్‌కు చెందిన టెస్లా కంపెనీ షేరు ఒకదశలో 14 శాతం ఎగబాకింది. అలాగే, టెక్నాలజీ రంగ షేర్లలో భారీగా కొనుగోళ్లు జరిగాయి. డాలర్ కూడా బలం పుంజుకుంది. పదేళ్ల బాండ్ రేటు సైతం 4.46 శాతానికి ఎగబాకింది. ఈక్విటీల జోరులో బులియన్ జోష్ కోల్పోయింది. ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర ఒక దశలో 70 డాలర్ల మేర తగ్గి 2,680 డాలర్లకు పడిపోయింది. వెండి 31.40 డాలర్లకు దిగివచ్చింది.

అత్యంత విలువైన కంపెనీగా ఎన్‌విడియా

ఏఐ చిప్‌ల తయారీ దిగ్గజం ఎన్‌విడియా కంపెనీ యాపిల్‌ను అధిగమించి ప్రపంచంలో అత్యంత విలువైన లిస్టెడ్ కంపెనీగా అవతరించింది. మంగళవారం ట్రేడింగ్ నిలిచేసరికి ఎన్‌విడియా షేరు 2.9% పెరిగి 139.93 డాలర్లకు చేరుకుంది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ 3.43 లక్షల కోట్ల డాలర్లకు ఎగబాకింది. కాగా, యాపిల్ మార్కెట్ క్యాప్ 3.38 కోట్ల డాలర్లకు పరిమితమైంది. బుధవారం ట్రేడింగ్‌లోనూ ఎన్‌విడియా షేరు ఒకదశలో 2.82% లాభంలో 143.86డాలర్ల స్థాయిలో ట్రేడైంది. అప్పటికి మార్కెట్ క్యాప్ 3.53 లక్షల కోట్ల డాలర్లుగా నమోదైంది.

సరికొత్త కనిష్ఠానికి రూపాయి

భారత కరెన్సీ విలువ సరికొత్త జీవనకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 22 పైసలు క్షీణించి 84.31 వద్ద ముగిసింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విజయం సాధించడం డాలర్‌కు భారీగా బలాన్ని చేకూర్చింది. దాంతో ఫారెక్స్ మార్కెట్లో డాలర్ విలువ గణనీయంగా పెరిగింది. యూఎస్ కరెన్సీతోపాటు ఆ దేశ బాండ్ల రిటర్నుల రేట్లు కూడా పుంజుకున్న నేపథ్యంలో మన మార్కెట్ నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు పెట్టుబడులను ఉపసంహరించుకోవడం కూడా రూపాయి విలువకు గండికొట్టిందని ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి. స్వల్పకాలంపాటు రూపాయికి ప్రతికూలతలు తప్పకపోవచ్చని, డాలర్‌తో ఎక్స్ఛేంజ్ రేటు 84.10-84.40 స్థాయిలో ట్రేడయ్యే అవకాశాలున్నాయని వారు భావిస్తున్నారు.

భారత్‌పై సుంకాల కత్తి

హెచ్-1బీ వీసాలకూ చెక్.. ఐటీ రంగం బిత్తర చూపులు

న్యూఢిల్లీ: నాకు అన్నింటి కన్నా అమెరికా ప్రయోజనాలే ముఖ్యం' (అమెరికా ఫస్ట్) అని ఎన్నికలకు ముందే ట్రంప్ కుండ బద్దలు కొట్టినట్టు చెప్పారు. ఇందుకోసం 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' పేరుతో ఓటర్లను ఆకర్షించి మరోసారి శ్వేతసౌధాధిపతి కాబోతున్నారు. దీంతో ట్రంప్ ద్వితీయ పట్టాభిషేకం ప్రభావం భారత ఎగుమతులు, ఆర్థిక వ్యవస్థపై ఎలా ఉండబోతోందో పరిశీలిద్దాం.

సుంకాల ముప్పు

ప్రస్తుతం అమెరికా మన దేశానికి అతి పెద్ద వాణిజ్య భాగస్వామి. గత ఏడాది రెండు దేశాల ద్వైపాక్షిక వాణిజ్యం వస్తు, సేవలతో కలిపి 19,000 కోట్ల డాలర్లకు (సుమారు రూ.16.01 లక్షల కోట్లు) చేరింది. ఇందులో మన దేశానికే మిగులు ఉంది. ప్రధాని మోదీతో ఎంత దోస్తానా ఉన్నా 'తమ్ముడు తమ్ముడే, పేకాట పేకాటే' అనేలా భారత్ నుంచి వచ్చే దిగుమతులపైనా సుంకాల (టారిఫ్) పెంపు తప్పదని ట్రంప్ ఇప్పటికే తేల్చేశారు. దీంతో మన దేశానికి చెందిన టెక్స్‌టైల్, ఆటోమొబైల్, ఫార్మా కంపెనీలు బిక్కు బిక్కు మంటున్నాయి.

'ఐటీ'కీ కష్టాలే!

మన ఐటీ కంపెనీల ఆదాయాల్లో 80 శాతానికి ఇప్పటికీ అమెరికానే దిక్కు. మన ఐటీ కంపెనీలు హెచ్-1బీ వీసాలపై అనేక మంది భారత ఐటీ నిపుణులను అమెరికా పంపించి, అక్కడి ప్రాజెక్టులు పూర్తి చేస్తుంటాయి. స్థానిక అమెరికన్లతో పోలిస్తే వీరికి చెల్లించే జీతాలు తక్కువ. ఈ వీసాలతో స్థానిక అమెరికన్లకు పెద్దగా ఉద్యోగాలు దొరకడం లేదని ఎప్పటి నుంచో విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఈ వీసాల జారీని కట్టుదిట్టం చేయడంతో పాటు, జీతాల వ్యత్యాసాన్నీ రూపుమాపుతానని ట్రంప్ ఎన్నికల ప్రచారంలో హామీలు గుప్పించారు. ఇదే జరిగితే భారత ఐటీ నిపుణులకు అమెరికా ఒక కలగానే మిగిలి పోతుంది. అధిక జీతాల భారంతో భారత ఐటీ కంపెనీల ఖర్చులు పెరిగిపోయి వాటి ఆదాయాలు, లాభాలకూ గండి పడే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. అదే జరిగితే ఐటీ రంగంలో మరిన్ని కొలువుల కోతలు తప్పక పోవచ్చు.

అవకాశాలూ ఉన్నాయ్

అమెరికా ఫస్ట్ అని ట్రంప్ ఎంతగా అరిచి గీపెట్టినా, వాస్తవ పరిస్థితులు అందుకు పూర్తిగా కలిసి రాకపోవచ్చు. భారత్‌కు మరింత దగ్గర కావడం ద్వారా చైనాకు సైనికంగానే గాక, ఆర్థికంగానూ చెక్ పెట్టాలనేది అమెరికా వ్యూహం. చైనా అంటేనే పగబట్టిన తాచులా లేచే ట్రంప్, ఈ వ్యూహానికి మరింత పదును పెడతారని భావించవచ్చు. దీంతో అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం మరింత ముదరడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే అనేక అమెరికా కంపెనీలు తమ చైనా+ వ్యూహంలో భాగంగా భారత్, వియత్నాం, థాయ్‌లాండ్, ఇండోనేషియా వైపు చూస్తున్నాయి. యాపిల్ కంపెనీ ఇప్పటికే తన అన్ని మోడళ్ల ఐ ఫోన్లను భారత్‌లో అసెంబ్లింగ్ చేయించుకుంటోంది. ఇక అమెరికా ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్, చైనాకు గుడ్‌బై చెప్పి భారత్‌లో తన వ్యాపారాన్ని పెద్ద ఎత్తున విస్తరిస్తోంది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకునేందుకు మన కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలూ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. దీంతో ట్రంప్ భారత దిగుమతులపై సుంకాల పెంపు విషయంలో ఎన్నికల ప్రచారంలో చెప్పినంత కఠినంగా ఉండకపోవచ్చని భావిస్తున్నారు.

ప్రతీకార చర్యలు

ఒకవేళ ట్రంప్ ఎన్నికల ప్రచారంలో చెప్పినట్టు భారత దిగుమతులపైనా సుంకాల పెంపుకు సిద్ధమైతే, ఆ దేశం నుంచి వచ్చే దిగుమతులపై సుంకాలు పెంచడం భారత్‌కూ తప్పదు. అమెరికాలో ఔషధాల ధరలు తక్కువగా ఉండడానికి ప్రధాన కారణం మన ఫార్మా కంపెనీలే. ట్రంప్ ఎన్ని ప్రోత్సాహకాలు, రాయితీలు ఇచ్చినా అమెరికా ఫార్మా కంపెనీలు, మన కంపెనీలంత చౌకగా జెనరిక్ ఔషధాలు అందించలేవు. 'అధ్యక్ష ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా, మన దేశం అందించినంత సమర్థవంతంగా మరే దేశం అమెరికా కంపెనీలకు ఐటీ సేవలు అందించలేదు' అని నాస్కామ్ కొత్త చైర్‌పర్సన్ సింధు గంగాధరన్ చెప్పడం విశేషం.

అపోలో హాస్పిటల్స్ లాభం రూ.379 కోట్లు

న్యూఢిల్లీ: అపోలో హాస్పిటల్స్ సెప్టెంబరు త్రైమాసికానికి అనుబంధ కంపెనీలతో కలిసి (కన్సాలిడేటెడ్) రూ.5,589 కోట్ల ఆదాయంపై రూ.816 కోట్ల స్థూల లాభం, రూ.379 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 15 శాతం, స్థూల లాభం 30 శాతం, నికర లాభం 63 శాతం పెరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలలను పరిగణనలోకి తీసుకున్నా రూ.10,675 కోట్ల ఆదాయంపై రూ.1,491 కోట్ల స్థూల లాభం, రూ.684 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 15 శాతం, స్థూల లాభం 31 శాతం, నికర లాభం 71 శాతం పెరిగాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	80,350 ▲	73,650 ▲	1,05,000 ▲
ముంబై	78,140 ▼	71,570 ▼	92,900 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



7వ తేదీ			
హైదరాబాద్	550	విజయవాడ	565
వరంగల్	552	గోదావరి	560
చిత్తూరు	593	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	128	విజయవాడ	125
వరంగల్	128	గుంటూరు	126
కరీంనగర్	128	ఒంగోలు	126
మహబూబ్‌నగర్	128	చిత్తూరు	120
కర్నూలు	128	నెల్లూరు	120
విశాఖపట్నం	111	అనంతపురం	120
గోదావరి	125		


ట్రంప్ విగ్రహానికి పూలమాల వేస్తున్న గ్రామస్థులు

• జనగామ జిల్లాలో ట్రంప్ విగ్రహానికి క్షీరాభిషేకం

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించడంతో బుధవారం జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామానికి చెందిన పలువురు యువకులు సంబురాలు చేసుకున్నారు. ఈ గ్రామానికి చెందిన బుస్సా కృష్ణ 2019లో తన ఇంటి ఆవరణలో ట్రంప్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు చేసేవాడు. ట్రంప్‌కు భారతదేశం, తెలంగాణ అంటే విపరీతమైన అభిమానమని, అందుకే తాను ఆయన్ను దేవుడిలా పూజిస్తానని కృష్ణ పలు సందర్భాల్లో చెప్పారు. 2020 అక్టోబరు 12న అనారోగ్యంతో కృష్ణ చనిపోయాడు. తాజాగా ట్రంప్ ఎన్నికల్లో విజయం సాధించిన నేపథ్యంలో పలువురు గ్రామస్థులు ఆయన విగ్రహాన్ని శుభ్రం చేసి క్షీరాభిషేకం చేశారు.

- బచ్చన్నపేట (ఆంధ్రజ్యోతి)

ప్రజాప్రతినిధుల సభకు 20వ సారి ఎన్నికైన నాన్సీ పెలోసీ

వాషింగ్టన్, నవంబరు 6: అమెరికా మాజీ స్పీకర్, డెమొక్రటిక్ పార్టీ సీనియర్ నాయకురాలు నాన్సీ పెలోసీ రికార్డు స్థాయిలో 20వ సారి ప్రజాప్రతినిధుల సభకు ఎన్నికయ్యారు. కాలిఫోర్నియాలోని 11వ కాంగ్రెస్సనల్ డిస్ట్రిక్ నుంచి ఆమె మళ్లీ విజయం సాధించారు. నాన్సీ పెలోసీ 1987లో తొలిసారిగా కాలిఫోర్నియా నుంచే ప్రజా ప్రతినిధుల సభకు ఎన్నికయ్యారు. ఆమె 2007లో స్పీకర్‌గా ఎన్నికై అమెరికా మొట్టమొదటి మహిళా స్పీకర్‌గా రికార్డులకెక్కారు. 2007-13, 2019-23 మధ్యలో ఆమె రెండు పర్యాయాలు స్పీకర్‌గా పనిచేశారు.

భారత్-అమెరికా బంధంపై

ప్రభావమెంత..?

ప్రధాని మోదీతో ట్రంప్‌కు మంచి సాన్నిహిత్యం



వాషింగ్టన్, నవంబరు 6: రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ మరోసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ట్రంప్ 'అమెరికా ఫస్ట్' విధానాన్ని గట్టిగా సమర్థిస్తున్నారు. ఈ క్రమంలో భారత్-అమెరికా మధ్య సంబంధాలను ఆయన ఎలా ముందుకు తీసుకెళ్తారనే అంశం ఇప్పుడు ఆసక్తిగా మారింది. భారత ప్రధాని నరేంద్ర మోదీతో ట్రంప్‌కు మంచి సాన్నిహిత్యమే ఉంది. గతంలో 'హౌడీ మోదీ', 'నమస్తే ట్రంప్' వంటి హైప్రొఫైల్ కార్యక్రమాల్లో ఇరువురు నేతలూ తమ స్నేహాన్ని చాటుకున్నారు. అయితే.. ట్రంప్ మాత్రం భారత వాణిజ్య విధానాలను 'టారిఫ్ కింగ్'గా అభివర్ణిస్తూ విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలో ఆయన రెండో దఫా పాలన భారత్‌కు కొత్త సవాళ్లను, అవకాశాలను తెచ్చిపెడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అవేమిటో చూద్దాం..

అమెరికా ఫస్ట్ విధానంతో సవాలే..

ట్రంప్ అనుసరిస్తున్న 'అమెరికా ఫస్ట్' విధానం భారత్‌కు సవాల్‌గా మారనుంది. ట్రంప్, కమలా హ్యారిస్‌లో ఎవరు గెలిచినా అమెరికా మరింత ఒంటరిగా మారే అవకాశం ఉందని భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఇది ఇరుదేశాల వాణిజ్యంపై ప్రభావం చూపనుంది. తాను అధికారంలోకి వస్తే.. తమ దేశ ఉత్పత్తులపై అధిక సుంకాలు విధిస్తున్న దేశాలపై తిరిగి పన్ను విధిస్తానని గతంలో ట్రంప్ వ్యాఖ్యానించారు. ఆయన ఆ దిశగా చర్యలు తీసుకుంటే.. భారత ఎగుమతులపై ముఖ్యంగా.. ఐటీ, ఫార్మా, టెక్స్‌టైల్ రంగాలపై అధిక సుంకాలు విధించే అవకాశం ఉంటుంది. అయితే.. చైనాకు చెక్ పెట్టేందుకు ట్రంప్ చేసే ప్రయత్నాలు భారత్‌కు అవకాశంగా మారొచ్చు. అమెరికా వ్యాపారాల్లో చైనాను దూరం పెడితే.. దానికి భారత్ ప్రత్యామ్నాయ కేంద్రంగా మారగలదు.



ఇమిగ్రేషన్‌పై ప్రభావం..

ఇమిగ్రేషన్ విషయంలో ట్రంప్ అనుసరించే కఠిన వైఖరి భారత్‌పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. భారత్ నుంచి అనేక వేలమంది ఉద్యోగాల కోసం హెచ్-1బీ వీసాలపై అమెరికాకు వెళ్తుంటారు. ముఖ్యంగా ఐటీ రంగం నుంచి ఎక్కువ మంది వెళ్తుంటారు. ట్రంప్ గతంలో పదవిలో ఉన్నప్పుడు ఈ వీసాలపై కఠిన వైఖరి అవలంబించారు. రెండో దఫా పాలనలో కూడా ఆ చర్యలు కొనసాగిస్తే.. అవి నైపుణ్యం కలిగిన భారతీయులకు అమెరికా కలను దూరం చేసే అవకాశం ఉంది.

పిల్లలకు ఆటోమ్యాటిక్ పౌరసత్వం రద్దు

ట్రంప్ ప్రాధాన్యతల్లో ఒకటి అమెరికాలో డిపెండెంట్లుగా ఉన్న పిల్లలకు ఆటోమ్యాటిక్ పౌరసత్వాన్ని రద్దు చేయడం. ఎన్నికల ప్రచారంలో కూడా ట్రంప్-వాన్స్ ఇదే అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. తాము గెలిస్తే తొలిరోజే ఈ ఆర్డినెన్స్‌పై సంతకం చేస్తామని చెప్పారు. ఈ ముసాయిదా ప్రకారం.. అమెరికాలో స్థిరపడిన వారి పిల్లలకు ఆటోమ్యాటిక్ పౌరసత్వం లభించాలంటే.. వారి తల్లిదండ్రుల్లో ఒకరు అమెరికా శాశ్వత నివాసి అయి ఉండాలి.

క్యూలో 10 లక్షలకు పైగా భారతీయులు

ట్రంప్ ప్రతిపాదన ఆమోదం పొందితే ప్రవాస భారతీయులకు భారీ ఎదురుదెబ్బ తగలనుంది. భారతీయ దంపతుల పిల్లలు గ్రీన్‌కార్డుకు అనర్హులుగా మారతారు. 2022 లెక్కల ప్రకారం అమెరికాలో సుమారు 4.8% మంది భారతీయ అమెరికన్లు ఉన్నారు. వారిలో 34% లేదా 16 లక్షల మంది అమెరికాలోనే జన్మించారు. ఇప్పటికే అమెరికాలో హెచ్-1బీ వీసాపై పనిచేస్తున్న చాలామంది దశాబ్దాలుగా గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్నారు. ఒక అధ్యయనం ప్రకారం గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్న భారతీయుల సంఖ్య గత ఏడాది మార్చి నాటికే 10 లక్షలు దాటింది.

ఇటీవలి కాలంలో భారత్-అమెరికా సంబంధాల్లో రక్షణ సహకారం కీలకమైన అంశంగా నిలిచింది. జో బైడెన్ హయాంలో ఇనిషియేటివ్ ఆన్ క్రిటికల్ అండ్ ఎమర్జింగ్ ఎక్నాలజీ (ఐసెట్), జెట్ ఇంజన్ తయారీ కోసం జీఈ-హాల్ మధ్య కుదిరిన ఒప్పందాలు ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేశాయి. అయితే కొత్త

సైనిక సహకారం.. రక్షణ సంబంధాలు

బహుళపక్ష ఒప్పందాల విషయంలో ట్రంప్ మరింత జాగ్రత్తగా ఉండొచ్చని భావిస్తున్నారు. ఏదేమైనప్పటికీ.. ఇండో పసిఫిక్ ప్రాంతంలో పెరుగుతున్న చైనా ప్రభావానికి చెక్ పెట్టాలంటే భారత్, అమెరికా వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించవచ్చు. ఇది ఇరుదేశాల మధ్య నిరంతర సైనిక సహకారానికి దారితీయవచ్చు. రెండో దఫా పాలనలోనూ ట్రంప్.. ఆయుధ అమ్మకాలు, సాంకేతికత బదిలీతోపాటు రక్షణ సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు కృషి చేసే అవకాశం ఉంది.

మనోళ్ల హవా

అమెరికా ఎన్నికల్లో ఆరుగురు భారత సంతతి నేతల గెలుపు


న్యూఢిల్లీ, నవంబరు 6: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో(ప్రతినిధుల సభ) భారత సంతతి పౌరులు ఘన విజయం దక్కించుకున్నారు. అంచనాలకు అనుగుణంగానే ఓట్ల వేటలో దూసుకుపోయారు. ఈ సారి ఎన్నికల్లో 9 మంది పోటీ చేయగా.. ఆది నుంచి కూడా ఆరుగురు గెలుపుగుర్రం ఎక్కడం ఖాయమని సర్వేలు చాటిచెప్పాయి. ఈ సర్వేల అంచనాలకు అనుగుణంగానే ఆరుగురు భారత సంతతి అభ్యర్థులు విజయం అందుకున్నారు. మరో అభ్యర్థి అమిష్ షా అరిజోనాలో లీడింగ్‌లో ఉండడం గమనార్హం. ఈయన కూడా విజయం సాధిస్తే ఏడుగురు అభ్యర్థులు ప్రతినిధుల సభలో అడుగు పెట్టినట్టు అవుతుంది. ఇక, ఇప్పటి వరకు వచ్చిన ఫలితాన్ని చూస్తే ఆరుగురు అభ్యర్థులు గెలుపు గుర్రం ఎక్కారు. దీంతో ఇప్పటి వరకు ప్రతినిధుల సభలో ఐదుకే పరిమితమైన భారత సంతతి నేతల సంఖ్య ఆరుకు పెరిగింది.


సుహాస్ సుబ్రమణ్యం

సుహాస్ సుబ్రమణ్యం: వర్జీనియా స్టేట్ సెనేటర్‌గా ఉన్న ఈయన తొలి సారి 10వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి ప్రతినిధుల సభకు పోటీ చేశారు. అరంగేట్రంలోనే అద్భుతమైన విజయాన్ని అందుకుని వర్జీనియా నుంచి గెలిచిన తొలి భారత సంతతి నేతగా చరిత్ర సృష్టించారు. సుహాస్ డెమొక్రాటిక్ పార్టీ తరఫున పోటీ చేయగా, రిపబ్లికన్ పార్టీ నుంచి పోటీ చేసిన మైక్ క్లాన్సీ పరాజయం పాలయ్యారు. "వర్జీనియా ప్రజల తీర్పును అత్యంత గౌరవంగా స్వీకరిస్తున్నా. వారికి సేవ చేసేందుకు అహరహం శ్రమిస్తా" అని సుహాస్ పేర్కొన్నారు. వర్జీనియాను తన సొంత ఇల్లుగా ఆయన తెలిపారు. "నా వివాహం ఇక్కడే జరిగింది. ఇక్కడి సమస్యలను నా సొంత కుటుంబ సమస్యలుగా భావించి పరిష్కరిస్తా" అని పేర్కొన్నారు. సుహాస్ గతంలో బరాక్ ఒబామా ప్రభుత్వం వైట్ హౌస్ సలహాదారుగా వ్యవహరించారు.

మరోసారి సభకు: ఇక, తాజా ఎన్నికల్లో విజయం దక్కించుకున్న భారత సంతతి పౌరుల్లో అమి బెరా, రాజా కృష్ణమూర్తి, రో ఖన్నా, ప్రమీలా జయపాల్, శ్రీథానేదార్‌లు మరోసారి ప్రతినిధుల సభలో అడుగు పెడుతున్నారు.

అమిష్ షా: అరిజోనాలో స్వల్ప ఆధిక్యంలో కొనసాగుతున్నారు. సిట్టింగ్ నేత, రిపబ్లికన్ అభ్యర్థి డేవిడ్‌స్క్వైకెట్‌కు, షాకు మధ్య పోరు హోరా హోరీగా సాగుతోంది. కడపటి వార్తలు అందే సరికి 63 శాతం ఓట్లను లెక్కించగా షాకు 1,32,712 ఓట్లు రాగా, డేవిడ్‌కు 1,28,606 ఓట్లు వచ్చాయి.





డాక్టర్ అమిబెరా: వైద్య వృత్తిలో ఉన్న అమిబెరా భారత సంతతి నేతల్లో సీనియర్ మోస్ట్ నాయకుడు. కాలిఫోర్నియా(6వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్) నుంచి వరుసగా విజయం సాధిస్తున్నారు.



శ్రీథానేదార్: మిచిగాన్(13వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్) నుంచి వరుసగా రెండో సారి ప్రతినిధుల సభకు ఎన్నికయ్యారు. 2023లో తొలి విజయం అందుకున్నారు.



ప్రమీలా జయపాల్: వాషింగ్టన్(7వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్) నుంచి వరుసగా విజయం సాధిస్తున్నారు.



రో ఖన్నా: కాలిఫోర్నియా (17వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్) నుంచి 2013 నుంచి వరుసగా విజయం దక్కించుకుంటున్నారు.



రాజా కృష్ణమూర్తి: ఇల్లినోయిస్(7వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్) నుంచి వరుసగా 5వ సారి విజయం దక్కించుకున్నారు. ఇక్కడ పోటీ చాలా కఠినంగా సాగడం గమనార్హం. ప్రజలు తనపట్ల చూపిన విశ్వాసానికి ఎంతో ముగ్ధుడిని అయ్యానని ఆయన పేర్కొన్నారు. ఇక్కడి ప్రజలకు అన్ని వేళలా అండగా ఉంటానని తెలిపారు. ప్రజల కలలను సాకారం చేసేందుకు నిరంతరం కష్టిస్తానన్నారు.

లోకాయుక్త ఎదుట హాజరైన సిద్దరామయ్య

నా రాజకీయ జీవితంలో ఇదో మరక: సీఎం



బెంగళూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ముడా ఇంటి స్థలాల అవినీతి కేసులో ఏ1 నిందితుడు, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య మైసూరు లోకాయుక్త కార్యాలయంలో బుధవారం విచారణకు హాజరయ్యారు. చన్నపట్టణ ఎన్నికల ప్రచార షెడ్యూల్ రద్దు చేసుకుని ఆయన విచారణకు వెళ్లారు. రెండు గంటలపాటు సిద్దరామయ్యను లోకాయుక్త ఎస్పీ ఉదేశ్ విచారించారు. విచారణ తర్వాత సీఎం సిద్దరామయ్య మీడియాతో మాట్లాడారు. లోకాయుక్త అధికారులు నోటీసులు ఇవ్వడంతో విచారణకు హాజరయ్యాయని, ఇదేమీ తనకు అవమానం కాదన్నారు. రెండు గంటల వ్యవధిలో 30-35 ప్రశ్నలు వేశారని, తనకు తెలిసిన సమాధానాలు ఇచ్చానన్నారు. ఇదో తప్పుడు కేసు అని, తాము ఇంటి స్థలాలను తిరిగి ఇవ్వడమంటే నేరం అంగీకరించడం కాదని సిద్దరామయ్య స్పష్టంచేశారు. ఆరోపణలకు విసుగు చెంది తన భార్య ఆ నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. కోర్టు తీర్పు వచ్చేదాకా ఇదో ఆరోపణ మాత్రమేనని, తన రాజకీయ జీవితంలో ఇది ఓ మరకలాంటిదని పేర్కొన్నారు.

ఆర్టికల్ 370ని పునరుద్ధరించాలి

» జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో తీర్మానం

శ్రీనగర్, నవంబరు 6: జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 పునరుద్ధరణపై కేంద్రప్రభుత్వం చర్చలు జరపాలని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర అసెంబ్లీలో బుధవారం తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. బుధవారం అసెంబ్లీ ప్రారంభమైన వెంటనే ఉపముఖ్యమంత్రి సురేందర్ చౌదరి ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. జమ్మూకశ్మీర్ ప్రజల హక్కులు, భద్రతతోపాటు ఈ ప్రాంత సంస్కృతిని కాపాడుకునేందుకు తమకు ప్రత్యేక హోదా అవసరమని, ఇది రాజ్యాంగం తమకు ప్రసాదించిన హక్కు అని తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న సందర్భంగా సురేందర్ చౌదరి వ్యాఖ్యానించారు. ఈ తీర్మానాన్ని రాష్ట్ర ప్రతిపక్ష నేత సునీల్ శర్మతోపాటు బీజేపీ సభ్యులు వ్యతిరేకించారు. తీర్మాన కాపీలను ముక్కలుగా చింపి అసెంబ్లీలో విసిరేశారు. ఈ గందరగోళం మధ్యే స్పీకర్ తీర్మానంపై అసెంబ్లీలో ఓటింగ్ నిర్వహించారు. మెజారిటీ సభ్యులు దీనికి మద్దతివ్వడంతో తీర్మానాన్ని సభ ఆమోదించింది.

క్షీణిస్తున్న సునీత విలియమ్స్ ఆరోగ్యం..!

న్యూయార్క్: అంతరిక్ష కేంద్రంలో ఎక్కువ రోజులపాటు ఉండటం వల్ల సునీత విలియమ్స్ ఆరోగ్యం క్షీణిస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. అంతరిక్షంలో ఉన్న వ్యోమగాముల ఫొటో ఒకటి వైరల్‌గా మారింది. అందులో సునీత విలియమ్స్ బరువు తగ్గినట్లుగా, బుగ్గలు లోపలికి వెళ్లినట్లుగా కనిపిస్తున్నారు. ఆమె పోషకాహార లోపాన్ని ఎదుర్కొంటున్నారని అందువల్లే బలహీనంగా కనిపిస్తున్నారని అమెరికాకు చెందిన శ్వాసకోశ సంబంధిత వ్యాధుల నిపుణుడు డాక్టర్ గుప్త పేర్కొంటున్నారు. 8 రోజుల మిషన్‌లో భాగంగా జూన్ 6న బోయింగ్ స్టార్‌లైనర్ క్యాప్సూల్‌లో సునీత, విల్‌మోర్ అంతరిక్ష కేంద్రానికి వెళ్లారు. వీరిద్దరూ జూన్ 14న భూమిపైకి తిరిగి రావాల్సి ఉండగా.. వ్యోమనౌకలో హీలియం లీకేజీ కారణంగా రాలేదు. వచ్చే ఫిబ్రవరిలో వారు భూమిపైకి తిరిగి వచ్చే అవకాశం ఉంది.

దేశంలో కుల గణన జరిగి తీరుతుంది: రాహుల్



నాగ్‌పూర్, సాంగ్లి, వయనాడ్, నవంబరు 6 : దేశంలో కులగణన జరిగి తీరుతుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. అంతేకాకుండా తమ పార్టీ రిజర్వేషన్లకు ఉన్న 50 శాతం పరిమితినీ తొలగిస్తుందని స్పష్టం చేశారు. నాగ్‌పూర్‌లో నిర్వహించిన సంవిధాన్ సమ్మాన్ సమ్మేళన్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కులగణన వల్ల జనరల్ కేటగిరీ, దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, మహిళలు.. ఇలా అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. అలాగే వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికల ప్రచారంలో ఉన్న కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ప్రియాంకగాంధీ మలప్పురం జిల్లాలో మాట్లాడుతూ... బీజేపీ, ప్రధాని మోదీ రాజ్యాంగ విలువలను నాశనం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

ఎల్‌ఎంవీ డ్రైవింగ్ లైసెన్స్‌తో రవాణా వాహనం నడపొచ్చు

» ప్రత్యేకంగా అనుమతి అవసరం లేదు

» అయితే వాహనం బరువు 7,500 కేజీలకు మించకూడదు: సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, నవంబరు 6: తేలికపాటి వాహనాల (లైట్ మోటార్ వెహికల్-ఎల్‌ఎంవీ) డ్రైవింగ్ లైసెన్సులు కలిగినవారు రవాణా వాహనాలను కూడా నడపవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇందుకు ఎలాంటి అధికారిక అంగీకారం అవసరం లేదని తెలిపింది. ఎల్‌ఎంవీ లైసెన్స్‌తో 7,500 కిలోల వరకు బరువు ఉన్న వాహనాన్ని నడపవచ్చని తెలిపింది. డ్రైవర్ల జీవనోపాధి దృష్ట్యా కూడా ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు పేర్కొంది. ఈ మేరకు బుధవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ మనోజ్ మిశ్రలతో కూడిన అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ మేరకు తీర్పు చెప్పింది. గతంలో ఇదే అంశంపై త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును ఖరారు చేస్తూ నిర్ణయాన్ని వెలువరించింది. తేలికపాటి మోటారు వాహనం నడిపేందుకు లైసెన్స్ ఉన్న వారు లోడు చేయని 7,500 కేజీల బరువు ఉన్న భారీ వాహనాన్ని నడిపేందుకు ప్రత్యేకంగా అనుమతి తీసుకోవాల్సిన పనిలేదని పేర్కొంది. ఎల్‌ఎంవీ లైసెన్స్‌తో 'లైట్ మోటార్ వెహికల్' వర్గంగా గుర్తింపు పొందిన రవాణా వాహనాన్ని నడపవచ్చని తెలిపింది. ఈ తీర్పుపై 2022లో వేరే కేసును విచారించిన మరో త్రిసభ్య ధర్మాసనాని (కోఆర్డినేట్ బెంచ్)కి అనుమానం రావడంతో పరిశీలనకు అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాయింది. విచారణ జరిపిన రాజ్యాంగ ధర్మాసనం కార్లు వంటి తేలికపాటి వాహనాల డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారు 7,500 కిలోల లోపు ఉన్న రవాణా వాహనాలను నడపవచ్చని తెలిపింది. ధర్మాసనం తరఫున జస్టిస్ రాయ్ తీర్పు రాశారు. లైసెన్సింగ్ విషయానికి వస్తే తేలికపాటి వాహనాలు, రవాణా వాహనాలను రెండు వేరువేరు వర్గాల కింద చూడాల్సిన పనిలేదని తెలిపింది. అటూ ఇటూ ఉపయోగిస్తుంటారని పేర్కొంది. అయితే ఈ-రిక్షాలు, ఈ-కార్ట్స్, ప్రమాదకర వస్తువులు రవాణా చేసే వాహనాలను నడిపే వారు మాత్రం ప్రత్యేకంగా లైసెన్సులు తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

'రణ్‌తంబోర్'లో 25 పులులు మాయం!

విచారణకు ముగ్గురు సభ్యులతో కమిటీ

న్యూఢిల్లీ, నవంబరు 6: రాజస్థాన్‌లోని రణ్‌తంబోర్ టైగర్ రిజర్వులో 25 పులులు కనిపించకుండా పోయాయన్న విషయం కలకలం రేపుతోంది. వీటిలో 14 పులుల ఆచూకీ ఏడాదికిపైగా లేదని, మిగిలిన 11 పులులు కొన్ని నెలలుగా కనిపించడం లేదని తెలుస్తోంది. దీనిపై స్పందించిన అధికార యంత్రాంగం విచారణకు ఆదేశించింది. ఇందుకోసం ముగ్గురు సభ్యులతో ప్రత్యేక కమిటీని కూడా నియమించింది. ఈ మేరకు రెండు రోజుల క్రితమే ఆదేశాలిచ్చిన ప్రధాన వన్యప్రాణి సంరక్షణ అధికారి(సీడబ్ల్యూడబ్ల్యూ) పవన్ కుమార్ ఉపాధ్యాయ... తక్షణం విచారణ జరిపి 2 నెలల్లో నివేదిక ఇవ్వాలని పేర్కొన్నారు.

పీఎం-విద్యాలక్ష్మి

VIDYA LAKSHMI
Fulfilling Educational Aspirations

మొదటిపేజీ తరువాయి

విద్యార్థులు ఈ రుణాలను వినియోగించుకోవచ్చు. ఈ పథకం కోసం రూ.3600 కోట్లు కేటాయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు తెలిపారు. ఏటా 22 లక్షల మంది విద్యార్థులు పీఎం-విద్యాలక్ష్మి పథకం పరిధిలోకి వస్తారన్నారు. 'జాతీయ ర్యాంకింగ్ విధివిధానాల సంస్థ (ఎన్ఐఆర్ఎఫ్)' ఇచ్చే ర్యాంకుల ఆధారంగా క్యూహెచ్ఈఐల జాబితాను రూపొందిస్తారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుల ఆధారంగా ఈ జాబితాను ఏటా అప్‌డేట్ చేస్తారు. ప్రస్తుతం 860 క్యూహెచ్ఈఐల్లో ఈ పథకాన్ని అమలు చేయనున్నట్లు వైష్ణవ్ తెలిపారు. క్యూహెచ్ఈఐల్లో ప్రవేశాలు పొందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ.7.50 లక్షల వరకు రుణం లభించనుందని, అందులో 75 శాతం వరకు బ్యాంకులకు కేంద్ర ప్రభుత్వం గ్యారెంటీ ఇవ్వనుందని చెప్పారు. తద్వారా విద్యార్థులకు ఎడ్యుకేషన్ లోన్లు ఇవ్వడానికి బ్యాంకులకు మద్దతుగా నిలిచినట్లవుతుందన్నారు. వార్షిక ఆదాయం రూ.8 లక్షల్లోపు ఉన్న కుటుంబాల్లోని విద్యార్థులకు ఈ పథకాన్ని వర్తింపజేయనున్నట్లు తెలిపారు. ఇతర ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు, వడ్డీ రాయితీ పథకాలు పొందుతున్నవారు పీఎం-విద్యాలక్ష్మికి అనర్హులని మంత్రి వెల్లడించారు. అలాగే ఏటా లక్ష మంది విద్యార్థులకు వడ్డీ రాయితీ కింద ఆర్థిక సాయం అందించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో సాంకేతిక, వృత్తి విద్యా కోర్సులు చదివే విద్యార్థులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. వడ్డీ రాయితీ పథకం కింద 7 లక్షల మంది విద్యార్థులు లబ్ధి పొందే అవకాశం ఉందని తెలిపారు. ఉన్నత విద్యా శాఖ రూపొందించిన 'పీఎం-విద్యాలక్ష్మి' పోర్టల్‌లో రుణాలు, వడ్డీ రాయితీ పథకాల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రాత్రికిరాత్రే బుల్డోజర్లతో రాలేరు

నోటీసులు ఇవ్వకుండా చాటింపు వేస్తారా?.. ఇది అహంకారం, అరాచకం

» ఆక్రమణల పేరుతో ఇళ్లను కూల్చలేరు

» నిబంధనలు పాటించాల్సిందే

» యూపీ సర్కారుపై సుప్రీంకోర్టు ఆగ్రహం



న్యూఢిల్లీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణల తొలగింపు పేరుతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందంటూ సుప్రీంకోర్టు బుధవారం తీవ్రంగా తప్పు పట్టింది. రాత్రికిరాత్రే బుల్డోజర్లు పంపి అక్రమ నిర్మాణాల పేరుతో ఇళ్లను కూల్చివేయజాలదని స్పష్టం చేసింది. 3.7 చదరపు మీటర్ల స్థలాన్ని ఆక్రమించారన్న కారణంతో ఇల్లును కూల్చివేసినందుకు బాధితునికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఇందుకు బాధ్యులైన అధికారులపై దర్యాప్తు జరపాలని సూచించింది. రోడ్డు విస్తరణ సమయంలో ఎలా వ్యవహరించాలో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు మార్గదర్శకాలు జారీ చేసింది. 2019లో రోడ్డు విస్తరణ పేరుతో.. ఆక్రమణలో ఉందంటూ తన ఇంటిని కూల్చి వేశారని ఉత్తరప్రదేశ్‌లోని మహారాజ్‌గంజ్‌కు చెందిన మనోజ్ తిబ్రేవాల్ ఆకాశ్ 2020 నవంబర్ 7న పిటిషన్ దాఖలు చేశారు. దానిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రల ధర్మాసనం విచారణ జరిపింది. "ఇళ్లను కూల్చివేయడానికి మీరు రాత్రికి రాత్రే రాలేరు. ఖాళీ చేసేందుకు ఆ కుటుంబానికి సమయం కూడా ఇవ్వలేదు. ఇంట్లోని సామాను మాటేమిటి?" అని ధర్మాసనం యూపీ ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించింది. "ఇది అహంకారంతో చేసిన చర్యే తప్ప చట్టబద్ధమైనది కాద"ని స్పష్టం చేసింది. 2019లో మహరాజ్‌గంజ్ జిల్లాలో ఇదే పద్ధతిలో 123 నివాసాలను కూల్చివేశారని తెలిపింది. "ఇలా ఇళ్లను ఎలా కూల్చివేస్తారు? ఇది పూర్తి అరాచకం కాదా? నడుచుకుంటూ వస్తారు... ఎవరో ఒకరి ఇంటిని కూల్చి వేస్తారు... నోటీసు లేదు, ఏమీ లేదు" అని వ్యాఖ్యానించింది. హద్దులు గుర్తించకుండా, నిబంధనలు పాటించకుండా, నోటీసులు ఇవ్వకుండా ఎందుకు ఇలా చేశారని ప్రశ్నించినప్పుడు "తుడుం దెబ్బ (మునాది), లౌడ్ స్పీకర్ ద్వారా చాటింపు వేశామ"ని ప్రభుత్వ న్యాయవాది సమాధానం ఇచ్చారు. "అంటే ఏ వ్యక్తికీ నోటీసు ఇవ్వలేదన్నమాట" అని ధర్మాసనం మళ్లీ ప్రశ్నించింది. దేన్ని ఆధారం చేసుకొని అక్రమ కట్టడంగా గుర్తించారని అడిగింది. రోడ్డు విస్తరణ కోసం ఆ స్థలాలను తీసుకున్నామని న్యాయవాది జవాబిచ్చారు. "అదొక సాకు మాత్రమే. మీ వద్ద నిజమైన కారణాలు ఉన్నట్టు కనిపించడం లేద"ని వ్యాఖ్యానించింది. "తుడుం ద్వారా చాటింపు వేసి ఇళ్లను ఖాళీ చేయండి. మేం కూల్చడానికి వచ్చామని చెప్పలేరు" అని స్పష్టం చేసింది. ఇలాంటి ఇతర సంఘటనలపైనా దర్యాప్తు జరిపి, బాధ్యులైన కాంట్రాక్టరు, అధికారులను గుర్తించాలని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు, అవసరమైతే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సూచించింది.

రాష్ట్రాలకు మార్గదర్శకాలు

- తొలుత మ్యాపులు, రికార్డుల ఆధారంగా సర్వే జరిపి రోడ్డు వెడల్పు ఎంత ఉందో తెలుసుకోండి
- దాని ఆధారంగా ఆక్రమణలను గుర్తించండి
- ఆక్రమణ ఉన్నట్టు గుర్తిస్తే దానిని తొలగించాలంటూ ఆక్రమణదారుకు నోటీసు ఇవ్వండి
- ఈ నోటీసుపై అభ్యంతరాలు ఉంటే దానిని చెప్పేందుకు వీలుగా 'స్పీకింగ్ ఆర్డర్' ఇవ్వండి. సహజ న్యాయ సూత్రాలకు అనుగుణంగా ఇది తప్పనిసరి.
- ఒకవేళ అధికారులు ఆ అభ్యంతరాలను తిరస్కరిస్తే తగిన వ్యవధిలో ఆక్రమణలు తొలగించాలంటూ నోటీసు ఇవ్వాలి
- అప్పటికీ ఆ నోటీసుకు స్పందించకపోతే ఆక్రమణలు తొలగించవచ్చు.
- రోడ్డు విస్తరణ విషయానికి వస్తే.. సంబంధిత రహదారి పక్కన తగినంత స్థలం, ప్రభుత్వ స్థలం లేనప్పుడు మాత్రమే పక్కనున్న జాగాలను భూసేకరణ విధానం ద్వారా తీసుకోవాలి.

గోరక్షణ పేరుతో మూక హత్యలు

» సుప్రీంకోర్టు ఆందోళన

» అఫిడవిట్లు ఇవ్వనందుకు

తెలంగాణ సహా 5 రాష్ట్రాలపై ఆగ్రహం

న్యూఢిల్లీ, నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణతో సహా అయిదు రాష్ట్రాల్లో పెరుగుతున్న మూక హత్యలు, హింసాకాండలపై సుప్రీంకోర్టు బుధవారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా గోరక్షక దళాల పేరుతో జరుగుతున్న దాడులపై ఈ రాష్ట్రాలను తీవ్రంగా హెచ్చరించింది. ఈ దాడులపై కౌంటర్ అఫిడవిట్‌లు దాఖలు చేయనందుకు తెలంగాణ, అస్సాం, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, బిహార్ రాష్ట్రాలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. వాటిని నాలుగు వారాల్లోగా సమర్పించాలని నోటీసులు జారీ చేసింది. కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయకపోతే ఈ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు డిసెంబర్ 10న కోర్టు ముందు హాజరు కావాల్సి ఉంటుందని హెచ్చరించింది. వారిపై చర్యలు ఎందుకు తీసుకోకూడదో వివరించాలని న్యాయమూర్తులు జస్టిస్ బి.ఆర్.గవాయి, జస్టిస్ కె.వి. విశ్వనాథన్‌ల ధర్మాసనం ఆ నోటీసుల్లో పేర్కొంది. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ విమెన్ (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని ఏప్రిల్ 16నే ఆదేశాలు జారీ చేసినా స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

శ్వేతసౌధం మళ్లీ ట్రంప్‌దే

(మొదటి పేజీ తరువాయి)

కేసులు వెంటాడుతున్నా.. ప్రచారంలో హత్యాయత్నాలు జరిగినా.. తెంపరిగా పేరున్న ట్రంప్ ఏమాత్రం వెనక్కి తగ్గకుండా.. వ్యూహాత్మకంగా ముందుకు సాగి.. గమ్యాన్ని ముద్దాడారు. 2020 ఎన్నికల్లో ఓటమి తర్వాత ట్రంప్ మద్దతుదారులు చట్టసభల మీద జరిపిన దాడితో ఆయన రాజకీయ జీవితం ముగిసిందని అంతా భావించారు. మాజీ అధ్యక్షుడు అయి ఉండి నాలుగు క్రిమినల్ కేసుల్లో కోర్టు విచారణలను ఎదుర్కోవడంతో.. ఇక రాజకీయాల నుంచి ట్రంప్ వైదొలగడమే తరువాయి అని విశ్లేషకులు భావించారు. గత ఏడాది రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థులుగా భారత సంతతికి చెందిన వివేక్ రామస్వామితో పాటు.. నిక్కీహేలి పేరు వినిపించినా.. తనను మించి పోటీదారు ఎవరున్నారంటూ ట్రంప్ పదేపదే ప్రకటనలు చేశారు. ఈ ఏడాది మార్చిలో అధికారికంగా ట్రంప్‌నే ప్రకటించినా.. అధ్యక్షుడు జోబైడెన్‌తో డిబేట్‌లో ఆధిపత్యం చూపినా.. డెమొక్రాట్ల తరఫున కమలాహ్యారిస్ బరిలోకి దిగడంతో గట్టిపోటీని ఎదుర్కొన్నారు. స్వింగ్ రాష్ట్రాల్లోనూ ప్రతికూల పవనాలున్నాయని సర్వేలు చెబుతున్నా.. మొక్కవోని ధైర్యంతో ప్రచారాలు చేశారు. రెండు సార్లు జరిగిన హత్యాయత్నాలు సానుభూతిని తీసుకురాగా.. అక్రమ చొరబాట్లకు చెక్, చొరబాటుదారులను వెనక్కి పంపడం, ఉద్యోగాలు, వేతనాల విషయంలో అమెరికా ఫస్ట్ నినాదం, ద్రవ్యోల్బణం తగ్గించడం వంటి హామీలతో ముందుకు సాగారు. ఫలితంగా.. స్వింగ్ రాష్ట్రాల్లోని జార్జియా, నార్త్ కరోలినా, పెన్సిల్వేనియా, మిషిగాన్, విస్కాన్సిన్‌లలో ఏకపక్షంగా ట్రంప్ హవా కొనసాగింది. మిగతా 2 రాష్ట్రాల్లోనూ(ఇంకా ఫలితాలు వెలువడాల్సి ఉంది) ట్రంప్ ఆధిపత్యం కనిపిస్తోంది. ఇజ్రాయెల్-హమాస్, హిజ్బుల్లా పోరు.. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాలను బైడెన్ సర్కారు నియంత్రించే ప్రయత్నం చేయలేదని, ఉక్రెయిన్‌కు ఆయుధ, ఆర్థిక సహకారం అందించి, పోరును కొనసాగించడాన్ని ట్రంప్ తన ప్రచారంలో అస్త్రాలుగా వాడుకున్నారు. తాను అధికారంలో ఉండగా.. అఫ్ఘానిస్థాన్ యుద్ధాన్ని ఆపిన తీరును గుర్తుచేశారు. తాను అధికారంలోకి వస్తే.. అమెరికా ఏ యుద్ధంలో పాల్గొనదని, ఇప్పుడున్న యుద్ధాలను ఆపేస్తుందని హామీ ఇచ్చారు. ఈ హామీలతో జార్జియా వంటి రాష్ట్రాల్లో ఉన్న అరబ్బులు, ముస్లింలు ట్రంప్‌కే జైకొట్టినట్లు ఫలితాలు వెల్లడిస్తున్నాయి. వలస విధానాలపైనా ట్రంప్ హామీలు ఓటర్లను ఆకట్టుకున్నాయి. 1798 నాటి 'ఏలియన్ ఎనిమీస్ యాక్ట్'ను తాను తిరిగి తీసుకొస్తానని హామీ ఇచ్చారు. రెండో ప్రపంచయుద్ధం సమయంలో జర్మనీ, జపాన్, ఇటలీ వాసులను కట్టడి చేయడానికి ఈ చట్టాన్ని ఉపయోగించారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఓటర్లు ట్రంప్‌కే జైకొట్టడంతో ఆయన విజయం మరింత సులువైంది.



ట్రంప్ సరికొత్త చరిత్ర!

రెండోసారి అమెరికా అధ్యక్ష పదవి చేపట్టబోతున్న డొనాల్డ్ ట్రంప్.. సరికొత్త ఘనత సాధించారు. తొలిసారి పోటీలో అధ్యక్షుడిగా గెలిచి.. రెండోసారి ఓడి.. మూడోసారి పోటీలో విజయం సాధించి అధ్యక్ష పీఠం అధిష్ఠించనున్న నాయకుడిగా నిలిచారు. గతంలో ఈ రికార్డు మాజీ అధ్యక్షుడు గ్రోవెర్ క్లీవ్‌ల్యాండ్ పేరిట ఉంది. 131 ఏళ్ల తర్వాత ఆ రికార్డును ట్రంప్ సమం చేశారు. క్లీవ్ ల్యాండ్ 1884 ఎన్నికల్లో గెలిచి తొలిసారి అధ్యక్ష పీఠమెక్కారు. ఆ తర్వాత నాలుగేళ్లకు 1888లో పోటీ చేసి ఓడారు. మళ్లీ 1892లో మూడోసారి పోటీ చేసిన ఆయన.. విజయం సాధించి రెండో సారి శ్వేతసౌధంలోకి అడుగుపెట్టారు. ఇక ట్రంప్ 2016 ఎన్నికల్లో గెలిచి తొలిసారి అధ్యక్షుడయ్యారు. రెండోసారి 2021 ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తాజాగా కమలను ఓడించి అధ్యక్ష పీఠం అధిష్ఠించబోతున్నారు.

బంగారు భవితకు..

అమెరికా కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో తన విజయం ఖరారైనట్లు తేలగానే.. ఫ్లోరిడాలోని వెస్ట్‌పామ్ బీచ్ బంగళా వద్ద ట్రంప్ తన మద్దతుదారులను ఉద్దేశించి మాట్లాడారు. తనను 47వ అధ్యక్షుడిగా ఎన్నుకొన్న అమెరికన్లకు ధన్యవాదాలు తెలుపుతూ.. ట్రంప్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. తన విజయం నభూతో నభవిష్యత్ అని వ్యాఖ్యానించారు. తన ఊపిరి ఉన్నంత వరకు అమెరికా బంగారు భవిత కోసం, అమెరికన్ల కోసం అవిశ్రాంతంగా పనిచేస్తానని ప్రకటించారు. అమెరికాకు సరిహద్దులను నిర్ణయించబోతున్నామని మెక్సికో గోడ అంశాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. తన ప్రసంగంలో ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కానున్న జేడీ వాన్స్, ఆయన భార్య, తెలుగమ్మాయి అయిన ఉష చిలుకూరి వాన్స్‌ను, స్పేస్ ఎక్స్ అధినేత ఈలాన్ మస్క్, స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి, ఆగస్టులో తప్పుకొన్న రాబర్ట్.ఎఫ్.కెన్నడీలను ట్రంప్ పొగడ్తలతో ముంచెత్తారు. ఈలాన్ మస్క్‌ను ఏకంగా ఆకాశానికి ఎత్తారు. "అమెరికా వినీలాకాశంలో సరికొత్త తార ఆయన(మస్క్). అలాంటి మేధావులను మనం మరిచిపోకూడదు" అని ప్రకటించారు. తనపై హత్యాయత్నాలు జరిగాక.. దేవుడు పునర్జన్మనిచ్చారని మిత్రులు అనేవారని.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, అమెరికన్ల శ్రేయస్సుకు పాటుపడతానన్నారు.

ట్రంప్‌కు అభినందనల వెల్లువ

ట్రంప్‌కు వివిధ దేశాల అధినేతల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. అమెరికాతో తమ ప్రత్యేక బంధం కొనసాగుతుందని యూకే ప్రధాని కీర్ స్టార్మర్ పేర్కొన్నారు. ట్రంప్ చరిత్రాత్మక విజయం అమెరికాకు కొత్త ప్రారంభాన్ని ఇస్తుందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు పేర్కొన్నారు. శాంతి, శ్రేయస్సు కోసం అమెరికాతో కలిసి పనిచేస్తామని ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్, ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ పేర్కొన్నారు. సెప్టెంబరులో ట్రంప్‌ను కలిసినప్పుడు.. రష్యా దురాక్రమణకు ముగింపు పలికే అంశంపై చర్చించామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు.



వ్యాపారం నుంచి రాజకీయాల్లోకి..

డొనాల్డ్ ట్రంప్ 1946 జూన్ 14న న్యూయార్క్ నగరంలోని క్వీన్స్‌లో ఫ్రెడ్రిక్ క్రీస్ట్ ఫ్రెడ్ ట్రంప్, మేరీ ట్రంప్ దంపతులకు జన్మించారు. తండ్రికి జర్మనీ మూలాలుండగా.. తల్లి స్కాట్లాండ్ వాసి. 13వ ఏట న్యూయార్క్ సైనిక అకాడమీలో చేరిన ట్రంప్.. ఆ వయసు నుంచే ఆత్మవిశ్వాసం, ధైర్యసాహసాలకు మారుపేరుగా నిలిచేవాడు. ఫోర్డామ్ యూనివర్సిటీలో రెండేళ్లు చదివాక.. పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం నుంచి ఆర్థికశాస్త్రంలో పట్టా పొందారు. తన తాత నిర్వహించే సంస్థ 'ఎలిజబెత్ ట్రంప్ అండ్ సన్స్'లో వ్యాపార మెలకువలు నేర్చుకున్నారు. ఓవైపు వ్యాపార దిగ్గజంగా ఎదుగుతూనే.. నటనపై ఆసక్తితో పలు హాలీవుడ్ చిత్రాల్లో నటించారు. 1977లో ఇవానాను పెళ్లాడగా.. వారి బంధం 1992 వరకు కొనసాగింది. 1993లో మార్లాను పెళ్లాడారు. 1999లో విడాకులు తీసుకున్నారు. ప్రస్తుతం మెలానియాతో కలిసి ఉంటున్నారు. ట్రంప్‌నకు ఐదుగురు పిల్లలు. 1970లోనే వేల కోట్లకు పడగలెత్తిన ట్రంప్.. రాజకీయాల్లో చక్రం తిప్పాలని పలుమార్లు ప్రయత్నించారు. మాజీ అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్‌కు మద్దతుదారుగా పనిచేశారు. 1987లో తనకు తాను రిపబ్లికన్ నేతగా ప్రకటించుకున్నారు. 1988లో ఉపాధ్యక్ష పదవికి పోటీచేద్దామనుకున్నా.. పార్టీలో అంతర్గత విభేదాలతో ఆయనకు అవకాశం దక్కలేదు. తర్వాత పలుమార్లు పార్టీలు మారారు. 2009లో రిపబ్లికన్ అభ్యర్థి జాన్ మెక్-కెయిన్‌కు మద్దతిచ్చారు. 2016లో ప్రతికూలతలను తట్టుకుని.. మొదటిసారి అధ్యక్షుడిగా విజయం సాధించారు.

విజయానికి అడ్డురాని వివాదాలు!

న్యూఢిల్లీ, నవంబరు 6: డొనాల్డ్ ట్రంప్ రాజకీయవేత్తగా ఎంత దూకుడైన నాయకుడో.. ఆయన చుట్టూ వివాదాలు కూడా అంతేస్థాయిలో ఉన్నాయి. చట్టాలను ఉల్లంఘించారని, ఓటమిని అంగీకరించకుండా ఫలితాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారనే ఆరోపణలే కాకుండా.. పలువురు మహిళలతో వివాహేతర సంబంధాలు పెట్టుకున్నారన్న ఆరోపణలు కూడా ట్రంప్‌పై ఉన్నాయి. అయినా.. ఎన్నికల్లో విజయానికి ఇవేవీ అడ్డురాలేదు. ట్రంప్ తమను లైంగికంగా వేధించారంటూ ఇద్దరు మహిళలు కోర్టుకు ఎక్కగా, స్టార్మీ డేనియల్స్ అనే పోర్న్ స్టార్ ఏకంగా మీడియా ముందుకు వచ్చి.. ట్రంప్ తనతో వివాహేతర సంబంధాన్ని కొనసాగించారని, ఆయన తొలిసారి అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసిన 2016లో ఈ విషయాన్ని బయటపెట్టకుండా ఉండేందుకు తనకు లక్షా 30 వేల డాలర్లు ఇచ్చారని వెల్లడించారు. ఈ అంశం పెద్ద దుమారమే రేపింది. ఈ ఆరోపణలపై విచారణ కూడా జరిగింది. కాగా, ఒకప్పటి ప్లేబాయ్ పత్రిక మోడల్ కారెన్ మెక్ డౌగల్.. 2006లో తనతో ట్రంప్ లైంగిక సంబంధం కొనసాగించినట్లు తెలిపారు. వీరే కాకుండా మరికొందరు మహిళలు కూడా ట్రంప్ తమపై లైంగిక దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఇక ట్రంప్ మూడు పెళ్లిళ్ల సంగతి తెలిసిందే. ఇన్ని వివాదాలున్నా ట్రంప్ విజయంపై ఇవేవీ ప్రభావం చూపలేదు.



ట్రంప్ మద్దతుదారుల సంబరాలు

కేసులు నిలుస్తాయా?

వాషింగ్టన్, నవంబరు 6: ట్రంప్ అధ్యక్షుడిగా ఎన్నికైన తరుణంలో.. ఆయనపై గతంలో నమోదైన క్రిమినల్ కేసుల పరిస్థితేంటన్న చర్చ ముందుకొస్తోంది. క్రిమినల్ కేసులు ఎదుర్కొన్న తొలి మాజీ అధ్యక్షుడు ఈయనే. నాలుగు తీవ్ర అభియోగాలపై ఈ ఏడాదే నాలుగు సమాంతర విచారణలు జరిగాయి. ఇందులో పోర్న్ స్టార్ స్టార్మీ డేనియల్స్ కేసు.. 2020లో జార్జియాలో ఎన్నికల తీర్పును ఆయన తారుమారు చేయడానికి ప్రయత్నించారన్న అభియోగం తీవ్రమైనవి. అధికారిక రహస్య పత్రాలను చట్టవిరుద్ధంగా తన ఇంట్లో దాచారని నిరుడు బైడెన్ యంత్రాంగం ఆయనపై ఆరోపణలు చేసింది. ఈ కేసును ఫ్లోరిడా జిల్లా జడ్జి కొట్టివేశారు. దీనిపై ప్రాసిక్యూషన్ అప్పీల్ దాఖలు చేసింది. వాస్తవానికి తనపై ఉన్న ఫెడరల్ కేసులను స్వయంగా మాఫీ చేసుకునే అధికారం అధ్యక్షుడికి ఉంటుంది. కానీ ఇంతవరకు అమెరికా అధ్యక్షుడెవరూ ఇలాంటి పని చేయలేదు. అయితే న్యాయశాఖ ఆ అభియోగాలను ఉపసంహరించుకుంటే మాత్రం ట్రంప్‌కు ఎలాంటి ఇబ్బందులూ ఉండవని అమెరికా న్యాయవాద వర్గాలు అంటున్నాయి.


పెన్సిల్వేనియా సభలో ట్రంప్‌పై హత్యాయత్నం జరిగినప్పటి ఫొటో(ఫైల్)

ట్రంప్ సంపద... రూ.56,502 కోట్లు!

న్యూఢిల్లీ, నవంబరు 6: అమెరికా అధ్యక్ష పీఠాన్ని రెండోసారి అధిరోహించనున్న డొనాల్డ్ ట్రంప్ వ్యాపారం రియల్ ఎస్టేట్ నుంచి మీడియా రంగం వరకూ విస్తరించింది. ఆయన నికర ఆస్తుల విలువ నవంబరు 5 నాటికి 6.7 బిలియన్ డాలర్లకు పెరిగిందని ఫోర్బ్స్ తెలిపింది. ఇది రూ.56,502 కోట్లతో సమానం. డీజేటీ యూఎస్ ఈక్విటీ కింద ట్రేడవుతున్న ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్‌లో ఆయనకు 57శాతం వాటా ఆయనకున్న అతిపెద్ద ఆస్తి. తన తండ్రి ఫ్రెడ్ ట్రంప్ నుంచి వారసత్వంగా చేపట్టిన రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని శరవేగంగా విస్తరించారు. ఎన్నో విలాసవంతమైన భవనాలను నిర్మించారు. క్రిప్టో కరెన్సీ, ఎన్ఎఫ్‌టీ వంటి డిజిటల్ ఆస్తుల్లోనూ ట్రంప్ పెట్టుబడులు పెట్టారు. పుణె, ముంబైలో ఇప్పటికే రెండు ట్రంప్ టవర్లు పూర్తయ్యాయి. కోల్‌కతా, గురుగ్రామ్‌లలోనూ రెండు టవర్లు నిర్మాణంలో ఉన్నాయి. అయితే ట్రంప్ టవర్‌తో పాటు ఇతర ఆస్తులు తాకట్టులో ఉన్నాయని, కోర్టు తీర్పుల తర్వాత కొత్త అప్పులు కూడా వచ్చాయని ట్రంప్ ఎన్నికల సమయంలో ప్రకటించారు.

ట్రంప్ విజయం వెనుక మస్క్

ప్రచారానికి విరాళాలుగా మిలియన్ల డాలర్లు

» స్వింగ్ రాష్ట్రాల్లో మస్క్ వ్యూహాలు విజయవంతం

వాషింగ్టన్, నవంబరు6: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ ఘన విజయం సాధించడంలో ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ కీలకంగా వ్యవహరించారు. ఎన్నికలకు చాలా కాలం ముందు నుంచే ట్రంప్‌ను గట్టిగా వెనకేసుకొచ్చిన ఆయన ఇటీవల రిపబ్లికన్ల తరఫున పొలిటికల్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేసి రూ.1500 కోట్లకు పైగా విరాళాలు ఇచ్చారు. కీలకమైన స్వింగ్ రాష్ట్రాల్లో ఓటర్లను ఆకట్టుకునేందుకు వ్యూహాలు రూపొందించి అమలు చేశారు. వాక్ స్వాతంత్ర్యం, తుపాకీ కలిగి ఉండే హక్కులపై రూపొందించిన పిటిషన్‌పై సంతకాలు చేసే ఓటర్లకు లాటరీ ద్వారా ప్రైజ్‌మనీ ఇచ్చారు. రిపబ్లికన్లకు అనుకూలంగా ఓటర్లను ప్రలోభపెడుతున్నారంటూ డెమోక్రాట్లు ఎంత అభ్యంతరం వ్యక్తం చేసినా లెక్కచేయలేదు. రోజుకు మిలియన్ డాలర్ల చొప్పున ప్రైజ్‌మనీ పంచుతూ పోయారు. స్వింగ్ రాష్ట్రాల్లో ట్రంప్ భారీ విజయంలో మస్క్ లాటరీ పేరిట డబ్బు పంచడం కూడా ప్రధాన కారణమని ప్రచారం జరుగుతోంది. ట్రంప్‌ను గెలిపించడమే ఏకైక లక్ష్యంగా పెట్టుకున్న మస్క్.. ఫిలడెల్ఫియాలో సోలోగా కూడా ప్రచారం చేశారు. ట్రంప్‌పై కాల్పులు జరిగిన పెన్సిల్వేనియా సభకూ హాజరయ్యారు. కాగా, 'విజయం మనదే' అని ట్రంప్ ప్రకటించడానికి కొన్ని నిమిషాల ముందు... అమెరికా రక్షణ దళాలు ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి 'మినిట్‌మ్యాన్ 3' ప్రయోగ పరీక్ష నిర్వహించాయి. కాలిఫోర్నియాలోని 'వాండెన్‌బర్గ్ స్పేస్ ఫోర్స్ బేస్' నుంచి ప్రయోగించిన ఈ క్షిపణి.. పసిఫిక్ మహాసముద్రంపై 6,450 కిలోమీటర్లకు పైగా ప్రయాణించింది.



మస్క్‌కు పదవి

తాను అధికారంలోకి వస్తే మస్క్‌ను కేబినెట్‌లోకి తీసుకుంటానని, లేదంటే సలహాదారుగా నియమించుకుంటానని ట్రంప్ ప్రచార సమయంలోనే ప్రకటించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ విభాగానికి అధిపతిగా చేస్తే ఓకేనని మస్క్ కూడా తన అంతరంగాన్ని బయటపెట్టారు. ఎన్నికల్లో విజయం సాధించాక చేసిన ప్రసంగంలో ట్రంప్ మస్క్‌ను స్టార్‌గా, అద్భుతమైన వ్యక్తిగా అభివర్ణించారు.

మిత్రమా.. కలిసి పని చేద్దాం

» డొనాల్డ్ ట్రంప్‌కు ఫోన్ చేసి ప్రధాని మోదీ శుభాకాంక్షలు

న్యూఢిల్లీ, నవంబరు 6: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన ట్రంప్‌కు భారత ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. ట్రంప్‌తో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి మరీ అభినందనలు తెలిపారు. ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత తనతో మాట్లాడిన తొలి విదేశీ నేత భారత ప్రధాని మోదీ అని ట్రంప్ ఈ సందర్భంగా అన్నారని పీఎంవో పేర్కొంది. అలాగే, భారత్, మోదీ తనకు నిజమైన స్నేహితులని, ప్రపంచమంతా మోదీని ప్రేమిస్తుందని ట్రంప్ అన్నారని వెల్లడించింది. అంతకముందు.. ట్రంప్‌ను 'మై ఫ్రెండ్' అని పేర్కొంటూ ప్రధాని మోదీ ఎక్స్ ద్వారా శుభాకాంక్షలు తెలియజేశారు. "గతంలో మీ పాలనలో సాధించిన విజయాలకు కొనసాగింపుగా భారత్-అమెరికా వ్యూహాత్మక సంబంధాలు మరింత బలోపేతం అయ్యేలా మనం కలిసి పని చేయాలని ఆశిస్తున్నా" అని పోస్ట్ చేశారు. కాగా, ట్రంప్‌కు కాంగ్రెస్ పార్టీ కూడా శుభాకాంక్షలు తెలియజేసింది. ట్రంప్ తన పాలనలో సక్సెస్ కావాలని ఖర్గే, రాహుల్ గాంధీ ఆకాంక్షించారు.



'పెద్దన్న'కు పెను సవాళ్లు!

(సెంట్రల్ డెస్క్)



రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత డొనాల్డ్ ట్రంప్‌కు పెను సవాళ్లే ఎదురు కానున్నాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్-గాజా పోరుతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, నాటో, వివిధ దేశాలకు సాయం, వాణిజ్యం వంటి అనేక సవాళ్లను ఆయన ఎదుర్కోవాల్సి ఉంటుంది. తొలిసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత ట్రంప్.. 'అమెరికా ముందు' అన్న నినాదాన్ని ఎత్తుకున్నారు. దానివల్ల అంతర్జాతీయ వేదికపై అమెరికాకు ఉన్న గౌరవం తగ్గినట్లు కనిపిస్తోందని.. దాన్ని తిరిగి తీసుకొస్తానని ట్రంప్ ప్రచారంలో పేర్కొన్నారు. సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న అమెరికా విదేశాంగ విధానాలను మార్చేయడం, మానవ హక్కుల ఉల్లంఘనలను కొట్టిపారేయడం, నియంతపాలకులతో సన్నిహితంగా మెలగడం వంటి చరిత్ర కలిగిన ట్రంప్ రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టడం కొందరు ప్రపంచ నేతలకు మింగుడుపడని విషయమే. అమెరికా ముందున్న ప్రధాన సమస్యల్లో ఇజ్రాయెల్-గాజా యుద్ధం ఒకటి. ఈ యుద్ధానికి ముగింపు పలకాలని ట్రంప్ ఇప్పటికే సూచించారు. కానీ, దానికి మార్గం ఏంటన్నది మాత్రం చెప్పలేదు. గాజాలో హమాస్‌పై, లెబనాన్‌లో హెజ్‌బొల్లాపై దాడులు చేస్తున్న ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు వ్యక్తిగతంగా మద్దతు తెలిపిన ట్రంప్.. ఇటీవల 'మీరేం చేయాలనుకుంటున్నారో అది చేయండి' అని సూచించడం గమనార్హం. ఇక ట్రంప్ ముందున్న మరో ప్రధాన సమస్య రష్యా-ఉక్రెయిన్ యుద్ధం. బైడెన్ సర్కారు ఉక్రెయిన్‌కు ఆర్థిక సాయం చేయడాన్ని ట్రంప్ బహిరంగంగానే విమర్శించిన సంగతి తెలిసిందే. "ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రతిసారీ అమెరికా వస్తారు. 60 బిలియన్ డాలర్లు తీసుకొని వెళ్తారు. ఆయనో గొప్ప సేల్స్‌మ్యాన్" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. తైవాన్ విషయంలోనూ ట్రంప్ విధానాలు ఆందోళనకరమేనని నిపుణులు చెబుతున్నారు. చైనా నుంచి తైవాన్‌కు రక్షణ కల్పించే విషయంలో ఆయన ముందుకు రారని పేర్కొంటున్నారు. రక్షణ రంగ సాయానికి తైవాన్ సొమ్ములు చెల్లించాలన్న ట్రంప్ వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమంటున్నారు. ఇదిలా ఉండగా, ట్రంప్ ఘన విజయం నేపథ్యంలో ఇరాన్ కరెన్సీ విలువ గతంలో ఎన్నడూ లేనంత కనిష్ఠ స్థాయికి దిగజారి ఒక డాలర్ విలువ 7,03,000 రియాళ్లు అయింది.

వాన్స్ తెలుగింటి అల్లుడే!

అమెరికా ఉపాధ్యక్షుడి సతీమణి తూర్పు గోదావరి అమ్మాయే

వాషింగ్టన్, నవంబరు 6: అమెరికా ఉపాధ్యక్ష పదవిని చేపట్టబోతున్న జేడీ వాన్స్‌కు తెలుగు నేలకు మధ్య ప్రత్యేక సంబంధం ఉంది. ఆయన ఆంధ్రప్రదేశ్ అల్లుడు. వాన్స్ భార్య ఉష చిలుకూరి ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా, నిడదవోలు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఉండ్రాజవరం మండలం వడ్లూరు. ఉషను వాన్స్ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఉష భర్త అమెరికా ఉపాధ్యక్షుడు కాబోతుండడంతోపాటు ఉష సెకండ్ లేడీ ఆఫ్ అమెరికా కాబోతున్న నేపథ్యంలో వడ్లూరు ప్రజలు సంబరాలు చేసుకున్నారు. కాగా, అమెరికా 'సెకండ్ లేడీ'గా వ్యవహరించనున్న తొలి భారత సంతతి మహిళ కూడా ఉషే కావడం విశేషం. ఉష తాతముత్తాతల స్వగ్రామం వడ్లూరు. అయితే, తర్వాత కాలంలో వారు ఉపాధి, ఉద్యోగాల నిమిత్తం పలు ప్రాంతాలకు వలస వెళ్లారు. ఈ క్రమంలో ఉష తల్లిదండ్రులు కృష్ణాజిల్లాలోని ఉయ్యూరు సమీపంలో ఉన్న సాయిపురంలో ఉండేవారు. ఆ తర్వాత వారు అమెరికా వెళ్లి అక్కడే స్థిర పడ్డారు. ఉష అక్కడే జన్మించారు. ఆమె బాల్యం అంతా శాన్‌ఫ్రాన్సిస్కోలోనే గడిచింది. యేల్ యూనివర్సిటీ నుంచి హిస్టరీలో బ్యాచిలర్ డిగ్రీ పట్టాపుచ్చుకున్న ఆమె.. కేంబ్రిడ్జి యూనివర్సిటీలో ఎంఫిల్ పూర్తిచేశారు. తర్వాత లా కెరీర్ ప్రారంభించారు. సుప్రీం కోర్టు జడ్జీలు జాన్ రాబర్ట్స్, బ్రెట్ కవనాగ్ వద్ద సహాయకురాలిగా పనిచేసి మంచి పేరు సంపాదించారు. యేల్ లా స్కూల్‌లో ఉన్నప్పుడే వాన్స్‌తో ఉషకు పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. 2014లో వారు హిందు సంప్రదాయంలో పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇవాన్, వివేక్ అనే ఇద్దరు అబ్బాయిలు, మిరాబెల్ అనే అమ్మాయి ఉన్నారు. కాగా, వాన్స్ బాల్యం అంతా కష్టాల మధ్య గడిచింది. బేవర్లీ కరోల్, డొనాల్డ్ రే బౌమాన్ దంపతులకు 1984, ఆగస్టు 2న వాన్స్ ఓహియోలో జన్మించారు. ఆయన చిన్నప్పుడే తల్లిదండ్రులు విడాకులు తీసుకోవడంతో కష్టాలు మొదలయ్యాయి. వాన్స్ 17వ ఏట క్యాషియర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. అయితే 2003లో గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత యూఎస్ మెరైన్ కార్ప్స్‌లో చేరి నాలుగేళ్ల పాటు సేవలు అందించారు. ఆ తర్వాత యేల్ లా స్కూల్‌లో చేరారు.


ఉష చిలుకూరి, జేడీ వాన్స్

మా ఊరికి గర్వకారణం

నిడదవోలు నియోజకవర్గం, వడ్లూరు గ్రామానికి చెందిన చిలుకూరి వారి ఆడపడుచు ఉష అమెరికా రెండో మహిళ కావడం ఆనందంగా ఉంది. మా గ్రామానికి ఒక్కసారిగా ప్రపంచ గుర్తింపు రావడం సంతోషంగా ఉంది. ఉష తాతముత్తాతలు ఉన్న గ్రామంలో వారికి చెందిన ఇంటిస్థలం నేడు ప్రజలకు ఉపయోగ పడేలా తీర్చిదిద్దాం. ఉష కుటుంబం మూలాలు ఇక్కడ ఉండటం మా ఊరికి గర్వకారణం.

- పెన్మత్స శ్రీనివాసరాజు, మాజీ సర్పంచ్, వడ్లూరు

వాన్స్ గెలుస్తారని ముందే అనుకున్నా!

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తన మనుమరాలి భర్త జేడీ వాన్స్ అమెరికాకు ఉపాధ్యక్షుడు కావడం పట్ల విశాఖపట్నంలో ఉండే ఉష సమీప బంధువు శాంతమ్మ సంతోషం వ్యక్తం చేశారు. ఆయన విజయాన్ని ముందే ఊహించానని చెప్పారు. 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో శాంతమ్మ అనేక విషయాలు పంచుకున్నారు. "ఉదయం నుంచి గెలుపు ఖరారయ్యే వరకు టీవీ చూస్తూనే ఉన్నాను. ఇప్పటివరకూ ఉషతో, ఆమె భర్తతో మాట్లాడలేదు. విజయోత్సవాలు ముగిసిన తర్వాత మాట్లాడతాను భారత్, అమెరికా మధ్య సత్సంబంధాలు బలోపేతం చేసేలా చూడాలని వాన్స్‌ను కోరతాను" అని ఆమె అన్నారు.

ఫలించని పోరాటం!

ట్రంప్‌పై విజయానికి శాయశక్తులా కృషి చేసినా కమలకు తప్పని ఓటమి

వాషింగ్టన్, నవంబరు 6: ట్రంప్‌పై మూడు నెలల క్రితం బరిలోకి దిగే వరకూ కమల పట్ల ఎవరికీ పెద్దగా అంచనాలు లేవు. కానీ, ఒకసారి రంగంలోకి దిగిన తర్వాత ట్రంప్‌నకు కమల చెమటలు పట్టించారనటం అతిశయోక్తి కాదు. ప్రెసిడెంట్ బైడెన్ మీద అలవోకగా విజయం సాధించే అంచనాల్లో ఉన్న ట్రంప్.. ఒక్కసారిగా వాస్తవంలోకి వచ్చారు. కమలతో జరిగిన డిబేట్‌లో ట్రంప్ పూర్తిగా తేలిపోయారు. దాంతో, ఇకమీదట ఆమెతో మరో డిబేట్‌లో పాల్గొనని చేతులెత్తేశారు.అయితే, ప్రారంభంలో ఉన్న కమల దూకుడు క్రమంగా తగ్గుముఖం పట్టింది. సర్వేల్లో ట్రంప్‌పై ఆధిక్యత చూపిన కమల మెల్లగా వెనుకబడిపోయారు. ధీరోదాత్తమైన పోరాటం జరిపిన కమల ఓటమి పాలయ్యారు. ఇంతకూ కమలా హ్యారిస్ ఓటమికి కారణాలేమిటి???

వ్యవధి: అన్నింటికన్నా పెద్ద కారణం.. ఆమెకు లభించిన స్వల్ప వ్యవధి. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో బరిలో ఉండే అభ్యర్థులు సంవత్సరాల ముందుగానే ప్రణాళికలు రచించుకొని, సాధనసంపత్తిని సమకూర్చుకుంటారు. కానీ, కమలకు ఆ అవకాశం లభించలేదు. అధ్యక్షుడిగా ఉన్న జో బైడెన్.. ఈసారి కూడా తానే బరిలో ఉంటానని చివరివరకూ భీష్మించుకొని కూర్చున్నారు. వయసు మీద పడిన బైడెన్ ఆరోగ్యంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నప్పటికీ.. ఆయన కుర్చీని వదులుకోవటానికి సిద్ధపడలేదు. చివరికి జూలై 21న తాను అధ్యక్ష రేసు నుంచి తప్పుకొంటున్నట్లు ప్రకటించారు. ఆయన స్థానంలో కమల ముందుకొచ్చారు. అంటే, ట్రంప్‌తో తలపడటానికి కమలకు కేవలం 3 నెలల సమయం మాత్రమే లభించింది.


తమిళనాడులో కమల పూర్వీకుల ఊరు తులసేంద్రపురంలో అమెరికా ఎన్నికల ఫలితాలను టీవీలో ఆసక్తిగా చూస్తున్న గ్రామస్థులు



జాతి వివక్ష: అగ్రరాజ్యం అమెరికాలో శ్వేత జాతి ఆధిపత్య ఛాయలు పోలేదు. నల్లవారిపై అప్పుడప్పుడూ జరిగే దారుణమైన దాడులే దీనికి నిదర్శనం. ట్రంప్‌ను ఈ శ్వేతజాతి ఆధిపత్యవాదానికి ప్రతీకగా జరిపిన ప్రచారం శ్వేతజాతీయుల్లో ఆయన పట్ల గణనీయమైన మద్దతు పెంచింది. ఇదే అంశం ఆఫ్రికా, ఆసియా వారసత్వం కలిగి ఉన్న కమలకు ప్రతికూలంగా పరిణమించింది. దీంతోపాటు, అమెరికా రాజకీయాల్లో పురుషాధిక్యతే అక్కడ రాజ్యమేలుతోంది. దీనివల్లే ఆ దేశంలో ఇప్పటికీ ఒక మహిళ అధ్యక్షురాలు కాలేకపోయారు. వైస్ ప్రెసిడెంట్ పదవిని ఒక మహిళ తొలిసారిగా చేపట్టటం.. కమలా హ్యారిస్‌తోనే ప్రారంభమైంది.

కీలక రాష్ట్రాల్లో కిందికి

'స్వింగ్ స్టేట్స్'గా పేరొందిన 7 రాష్ట్రాలు చివరి క్షణం వరకూ ఎటు వైపు ఉంటాయో తెలియని పరిస్థితి ఈసారి నెలకొంది. ఈ రాష్ట్రాలను ఎవరు కైవసం చేసుకుంటే వారే అధ్యక్ష పదవిని చేపడతారని విశ్లేషణలు వచ్చాయి. దీనికి తగినట్లుగానే, ఈ స్వింగ్ స్టేట్స్‌లో ట్రంప్ గెలిచి అధ్యక్ష ఎన్నికల్లో విజేతగా నిలిచారు. ఈ రాష్ట్రాల్లో కమల ఎందుకు ఓడిపోయారన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది. పోలైన ఓట్ల తాలూకు పూర్తి సమాచారం వెల్లడైన తర్వాతే కారణాలేమిటో తెలుస్తాయి.

పార్టీపై అసంతృప్తి

డెమోక్రటిక్ పార్టీలో గత నాలుగేళ్లుగా పటిష్ఠమైన నాయకత్వం లేకపోవటంతో.. ఆ పార్టీ అభిమానుల్లో, ఓటర్లలో కొంత నిస్తేజం నెలకొంది. మరోవైపు, ట్రంప్ దూకుడు వైఖరి రిపబ్లికన్ ఓటర్లలో ఉత్సాహం నింపింది.

రాహుల్‌ది ఏ కులమో.. ఏ మతమో చెప్పాలి

» రాజకీయ లబ్ధి కోసమే కులగణన: బీజేఎల్పీ నేత ఏలేటి

హైదరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీది ఏ కులమో.. ఏ మతమో స్పష్టం చేయాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. తనది ఏ కులమో చెప్పకుండా కుల గణనకు బ్రాండ్ అంబాసిడర్‌లా రాహుల్ మాట్లాడుతున్నారని విమర్శించారు. రాహుల్ అసలు హిందువా? కాదా? అన్నది స్పష్టత ఇవ్వాలని కోరారు. "మాకున్న సమాచారం ప్రకారం.. రాహుల్ తాత పేరు ఫిరోజ్ జహంగీర్ గండీ. హిందూ సంప్రదాయం ప్రకారం ఆయన తండ్రి పేరు రాజీవ్ జహంగీర్ గండీ కావాలి. రాజీవ్ కుమారుడి పేరు రాహుల్ జహంగీర్ గండీ కావాలి. కానీ.. గండీ బదులు గాంధీగా వారు ప్రచారం చేసుకుంటున్నారు" అని ధ్వజమెత్తారు. స్వార్థ ప్రయోజనాలు, రాజకీయ లబ్ధి కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన చేపట్టిందని ఆరోపించారు. కులగణన పూర్తి చేసి ఏం చేస్తారో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు.

రాహుల్‌గాంధీ కులమేంటో అప్పుడు తెలియదా..?

» మహేశ్వర్‌రెడ్డిపై టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఫైర్

హైదరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): "రాహుల్‌గాంధీ పదవి ఇస్తే తీసుకున్నప్పుడు.. ఆయన్ను నిర్మల్‌కు పిలిచి పెద్ద ఎత్తున పాదయాత్ర చేయించినప్పుడు.. ఆయన కులమేంటో మీకు తెలియదా?" అంటూ బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డిపై టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ మండిపడ్డారు. రాహుల్ కులమేంటని అడుగుతున్న బీజేపీ నేతలు, దమ్ముంటే జనగణనలో ఓబీసీ గణననూ చేర్చాలంటూ కేంద్రాన్ని అడగాలని, అప్పుడు రాహుల్ కులమేంటో తెలుస్తుందని అన్నారు. బీజేఎల్పీ పదవి ఉంటుందో ఊడుతుందో తెలియక తికమకకు గురై మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతున్నారని విమర్శించారు. రాహుల్‌గాంధీ కులం భారతదేశమని అన్నారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా అందరూ ఒప్పుకునే నాయకుడు రాహుల్ అని, మహేశ్వర్ రెడ్డి ఇది తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు.

రాహుల్ కులంతో బీజేపీకి ఏం పని?: సురేఖ

హైదరాబాద్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): 'రాహుల్‌గాంధీ కులం ఏంటన్నది తెలియాలంటే దేశంలో కులగణన చేయండి. కులగణన పత్రంతో రాహుల్ ఇంటికి వెళితే.. తన కులమేదో ఆయనే చెబుతారు' అంటూ బీజేపీ నేతలకు మంత్రి కొండా సురేఖ సలహా ఇచ్చారు. రాహుల్ కులంతో బీజేపీ వాళ్లకు ఏం పనంటూ ప్రశ్నించారు. కొన్ని వర్గాలకు మాత్రమే మేలు చేసే పార్టీ బీజేపీ అన్నారు. మంత్రితో ముఖా ముఖి కార్యక్రమంలో భాగంగా బుధవారం గాంధీభవన్‌లో పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజల నుంచి వివిధ సమస్యలపైన వినతిపత్రాలు, ఫిర్యాదులను కొండా సురేఖ స్వీకరించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆమె మాట్లాడుతూ.. కుల వివక్షను రూపు మాపేందుకే కులగణన సర్వేను ప్రభుత్వం చేపట్టిందన్నారు. కాగా, రాహుల్ గాంధీది బ్రాహ్మణ కులం.. హిందూ మతమని బీజేపీ నేతలకు అది కూడా తెలియదా అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి. హన్మంతరావు ప్రశ్నించారు. కులగణన చేయాలన్న గొప్ప నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి.. విమర్శలు దేనికని ప్రశ్నించారు.

ఆశ్రమ పాఠశాలలో 12 మంది విద్యార్థినులకు అస్వస్థత

» ఆసుపత్రికి తరలింపు... కలుషిత ఆహారమే కారణం

» మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సాయికుంటలో ఘటన

మంచిర్యాల అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సాయికుంటలో గల గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 12 మంది విద్యార్థినులు బుధవారం అస్వస్థతకు గురయ్యారు. ఉదయం హాస్టల్‌లో విద్యార్థినులకు కిచిడీ, చారు తయారు చేసి అందించగా 160 మంది విద్యార్థినులు తిన్నారు. అనంతరం పదో తరగతికి చెందిన 12 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ విషయమై హాస్టల్ వార్డెన్ లక్ష్మిరాజంను వివరణ కోరగా హాస్టల్‌లో విద్యార్థినులతోపాటు తాము కిచిడీ తిన్నామని, 12 మంది మాత్రమే అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. ఘటన అనంతరం ఆరోగ్యశాఖ అధికారులు హాస్టల్‌లో వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించారు.కాగా, అస్వస్థతకు గురైన విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. విద్యార్థినులు ఇంటి నుంచి తెచ్చుకున్న పచ్చడి తినడం వల్ల అస్వస్థతకు గురయ్యారని ఫుడ్‌సేఫ్టీ అధికారులు నిర్ధారించారని పేర్కొన్నారు.

కోలుకుంటున్న వాంకిడి విద్యార్థినులు

వాంకిడి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురైన ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు కోలుకుంటున్నారు. మంచిర్యాల, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, వాంకిడి ఆసుపత్రుల్లో చికిత్స పొందిన విద్యార్థినులు కోలుకోవడంతో డిశ్చార్జి చేసి పాఠశాలకు పంపించారు. హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ముగ్గురు విద్యార్థినుల్లో ఇద్దరి ఆరోగ్యం నిలకడగా ఉండగా శైలజ అనే విద్యార్థిని పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. శైలజకు మెరుగైన వైద్యం అందిస్తున్నారని బాలికా సంక్షేమాధికారి శకుంతల తెలిపారు.

పీజీ మెడికల్ 'స్థానికత'పై వివరణ కోరిన హైకోర్టు

హైదరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మెడికల్ కాలేజెస్ రూల్స్- 2021లోని రూల్ 8 (1) (2)ల చట్టబద్ధతపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం, కాళోజీ వైద్య విశ్వవిద్యాలయాలకు హైకోర్టు నోటీసులు జారీచేసింది. మెడికల్ పీజీ కోర్సులకు ముందు నాలుగేళ్లు తెలంగాణలో చదవలేదని పేర్కొంటూ ఈ రూల్స్ కింద తమను స్థానిక కోటాకు అనర్హులుగా పరిగణించడాన్ని సవాల్ చేస్తూ డాక్టర్ ఎస్ సత్యనారాయణ, డాక్టర్ వి.రజిత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తెలంగాణ వెలుపల ఉన్నప్పటికీ సిద్ధార్థ మెడికల్ కాలేజీ తదితర కాలేజీల్లో చదివిన వారికి స్థానిక కోటా కింద అవకాశం ఇస్తున్నారని, వారితో సమానంగా తమను గుర్తించకపోవడం అక్రమం, వివక్ష చూపడం కిందికి వస్తుందని పేర్కొన్నారు. వాదనలు విన్న చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుల ధర్మాసనం ప్రతివాదులకు నోటీసులు జారీచేసింది.

పోటీలు పడి శ్రీశైలం ఖాళీ

» కృష్ణా బోర్డు మాట వినని తెలుగు రాష్ట్రాలు

తాగు, సాగునీటి అవసరాల్లేకుండా జలాలను తరలించరాదని కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) తెలుగు రాష్ట్రాలకు సూచించినా ఫలితం లేకుండా పోయింది. కృష్ణాబోర్డు తెలుగు రాష్ట్రాలకు లేఖ ద్వారా సూచించిన మరుసటి రోజే బుధవారం శ్రీశైలం జలాశయం నుంచి జలవిద్యుత్ ఉత్పాదనతో 19,820 క్యూసెక్కులను తెలుగు రాష్ట్రాలు పోటీపడి తరలించాయి. మరో 16 వేల క్యూసెక్కుల దాకా ఏపీ.. పోతిరెడ్డిపాడు నుంచి తరలించింది. ప్రస్తుతం పెన్నా బేసిన్‌లో జలాశయాలన్నీ నిండుగా ఉన్నప్పటికీ భవిష్యత్తు అవసరాల కోసం శ్రీశైలంలో నిల్వలు కొనసాగించాలనే సూచనలను తెలుగు రాష్ట్రాలు పక్కనపెడుతున్నాయి. దాంతో శ్రీశైలంలో నిల్వలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. బుధవారం ఈ ప్రాజెక్టుకు 8895 క్యూసెక్కుల వరద రాగా.. 38 వేల క్యూసెక్కులు జలాశయం నుంచి మాయమయ్యాయి. శ్రీశైలం పూర్తిస్థాయి సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా... ఇందులో 182.99 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే ఉంది. వాస్తవానికి ఆల్మట్టి నుంచి ఔట్‌ఫ్లో ఉంటేనే శ్రీశైలంలో జలవిద్యుత్ ఉత్పాదనచేయాలి. ప్రస్తుతం ఆల్మట్టి నుంచి ఆశించిన స్థాయిలో ఇన్‌ఫ్లోలు లేవు. అయినా తెలుగు రాష్ట్రాలు పోటీపడి ఖాళీ చేయడం రైతాంగాన్ని ఆందోళనకు గురిచేస్తోంది.

గుట్టలో కుంగిన ఫ్లోరింగ్!

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. గత ప్రభుత్వం 2016లో ఆలయ ఉద్ఘాటన చేయాలని నిర్ణయించింది. ప్రధానాలయం పునర్నిర్మాణంతో పాటు ఆలయ విస్తరణకు దాదాపు రూ.1300 కోట్లతో పనులు చేపట్టారు. ఆరేళ్ల పాటు ఈ పనులు కొనసాగగా, 2022 మార్చి 28న ఉద్ఘాటన జరిగింది. ఆలయం పునర్నిర్మాణానికి ముందు 1.20 ఎకరాలు ఉన్న కొండను పూర్తిగా చదును చేయడంతో ప్రధానాలయ ప్రాంగణం 4.20 ఎకరాలకు చేరింది. ఈ ప్రాంగణంలో స్వామివారి ప్రధానాలయంతో పాటు సప్తగోపురాలను నిర్మించారు. ఆలయం దక్షిణ భాగంలోని ప్రాకార మండపంలో వేసవిలో భక్తుల కాళ్ల కింద వాడిన మ్యాట్లు, వంట చెరకు వేయడంతో చెత్త పేరుకుపోయింది. దీనికి తోడు ఇసుక నిండిపోయి కోతులకు ఆవాసంగా మారింది. అదేవిధంగా రిటైనింగ్ వాల్‌కు ఒక చోట బండలు ఊడిపోయాయి. ఆలయ పునర్నిర్మాణంలో దక్షిణ భాగంలో మట్టితో విస్తరించగా ప్రాకార మండపం వెలుపల ఉన్న ఫ్లోరింగ్ (నల్లరాతి శిలలు) సుమారు 50 మీటర్ల పొడవున రెండు అంగుళాల లోతుకు కుంగింది. విస్తరణ సమయంలోనూ ఇదే ప్రదేశంలో కుంగిపోగా అప్పట్లో మరమ్మతులు చేపట్టారు. మళ్లీ అక్కడే కుంగి కొన్ని నాపరాళ్లు పగిలిపోయాయి.



రిటైనింగ్ వాల్‌కు ఊడిన బండలు

సేవల్లో సంప్రదాయానికి తిలోదకాలు

ఆలయంలో నిత్య కల్యాణోత్సవం, వెండి జోడు సేవలు నిర్వహించే క్రమంలో సంప్రదాయాలకు తిలోదకాలిస్తున్నారు. భక్తులతో నిర్వహించే ఆర్జిత సేవలకు ఆలయం చుట్టూ తిరగాల్సి ఉంది. ఆలయం విస్తరణకు ముందు దక్షిణ భాగంలో సేవలతో పాటు భక్తులకు వెళ్లేందుకు వీల్లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా దక్షిణ భాగాన్ని విస్తరించారు. అయినా ఆలయ సంప్రదాయం ప్రకారం సేవలు నిర్వహించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఆలయంలోకి దిగే మెట్లు కూడా ఎక్కువగా ఉన్నందున సేవలను తరలించేందుకు అవకాశం తక్కువగా ఉంది. దీంతో సంప్రదాయబద్ధంగా స్వామివారి సేవలు ఆలయం చుట్టూ తిరగాల్సి ఉన్నప్పటికీ అమలు కావడం లేదు.



మండపంలో వేసిన వంట చెరుకు

గతంలో కురిసిన వర్షాలకు..

2022 మేలో కురిసిన భారీ వర్షాలకు ఆలయ పునర్నిర్మాణ పనుల్లో లోపాలు బయటపడ్డాయి. తిరువీధుల్లో కొన్ని ప్రాంతాల్లో ముఖ్యంగా దక్షిణ దిశలోని ఫ్లోరింగ్ దెబ్బతింది. ఈ ప్రాంతంలో సిమెంటు, మైనంతో పాటు కొన్ని చోట్ల సీసం నింపారు. రెండో ఘాట్‌కు అనుబంధంగా నిర్మించిన రోడ్డు కుంగింది. అష్టభుజి ప్రాకార మండపంలో వర్షపు నీటితో లీకేజీ ఏర్పడింది. లీకేజీలకు ఆస్కారం లేకుండా సిమెంటు, రసాయనాల మిశ్రమంతో గ్యాపులను పూడ్చారు. నిర్మాణ లోపాలను సరిదిద్దేందుకు చర్యలు చేపట్టినప్పటికీ మరోసారి నాణ్యతా లోపం బయటపడడం గమనార్హం.

మరమ్మతులు చేపడతాం

దక్షిణ భాగంలో ఫ్లోరింగ్ కుంగిన ప్రాంతానికి వెంటనే మరమ్మతులు చేపడతాం. ప్రధానాలయం దక్షిణ రాజగోపురం ప్రాకారానికి, కుంగిన ప్రదేశానికి సంబంధం లేదు. దక్షిణ తిరువీధుల్లో డ్రైనేజీ, ఇతర పైపులైన్లు కోసం వేసిన అదనపు కట్టడాల వల్ల కుంగింది. ఆ ప్రాంతాన్ని పూర్తిగా తొలగించి మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం లేదు. - సునీల్, వైటీడీఏ ఇన్‌చార్జి ఈఈ

వైటీడీఏ పనులు అర్ధాంతరంగా ఎందుకు ఆపారు?

భూ సేకరణ, పరిహారంపై నివేదిక ఇవ్వండి

అధికారులకు మంత్రి సురేఖ ఆదేశం



హైదరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): యాదగిరి గుట్టలో గత ప్రభుత్వ హయాంలో 'యాదాద్రి ఆలయ అభివృద్ధి సంస్థ (వైటీడీఏ)' చేపట్టిన అభివృద్ధి పనులను అర్ధాంతరంగా ఎందుకు నిలిపివేశారని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ప్రశ్నించారు. వైటీడీఏ చేపట్టిన అభివృద్ధి పనులు, బిల్లుల చెల్లింపు, భూ సేకరణ, నష్టపరిహారం తదితర అంశాలపై సమగ్ర వివరాలు అందించాలని ఆదేశించారు. బుధవారం ఆమె సచివాలయంలో వైటీడీఏ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వైటీడీఏ సమర్పించిన అసమగ్ర సమాచారంపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. సమగ్ర సమాచారాన్ని గురువారంలోగా అందజేయాలని వైటీడీఏ వైస్‌చైర్మన్ కిషన్ రావును ఆదేశించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హంగు, ఆర్భాటాలకు పోయిందే తప్ప సామాన్య భక్తులు ఎదుర్కొంటున్న కష్టాలను పట్టించుకోలేదన్నారు. తమ ప్రభుత్వం ఆలయ ప్రాముఖ్యతను పెంచడంతోపాటు సాధారణ భక్తులకు సదుపాయాల కల్పనపై దృష్టి సారించిందని చెప్పారు.

జనాభా దామాషాలో వనరుల పంపిణీకే..

అందుకే కులగణన : డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన కులగణన... రేషన్ కార్డులనో, పథకాల లబ్ధిదారులను తగ్గించడానికో కాదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఈ సర్వే జరగొద్దని కొంతమంది కుట్ర చేస్తున్నారని, అందుకే అపోహలు సృష్టిస్తున్నారని పరోక్షంగా బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి ఆరోపించారు. నిజానికి సమాజంలోని వివిధ వర్గాలకు వారి జనాభా దామాషా పద్ధతిన రాష్ట్ర సంపద అందాలన్న ఉద్దేశంతోనే సర్వే చేపట్టామని వివరించారు. బుధవారం భట్టి ప్రజా భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. భవిష్యత్తులో ప్రభుత్వం చేపట్టే అన్ని రకాల ప్రణాళికలకు ఈ సర్వే దోహదపడుతుందన్నారు. ఇది ఒక విప్లవాత్మక కార్యక్రమమని, దేశానికి దిశ దశ చూపబోతోందన్నారు. ఈ సర్వే పత్రంలో ఏ ప్రశ్నలు ఉండాలన్న విషయంపై వివిధ వర్గాలు, మేధావుల అభిప్రాయాలు తీసుకున్నామని తెలిపారు. సర్వే పేరుతో సమాజంలో చీలికలు తెచ్చే ప్రమాదముందన్న కొందరి ఆరోపణలు కూడా వాస్తవం కాదన్నారు. గతంలో బీఆర్ఎస్ దేని కోసం కుటుంబ సర్వే చేపట్టిందో వారికే తెలియదన్నారు. దానిని ఎందుకు వాడారో కూడా తెలియదన్నారు. ఆ సర్వే, తమ సర్వేలోని సమాచారం పూర్తి భిన్నంగా ఉంటుందని, తమ సర్వే పూర్తిగా ప్రజా సంక్షేమాన్ని కాంక్షించి చేపడుతున్నదని, సమగ్రంగా ఉంటుందన్నారు. ఈ సర్వేకు ప్రత్యేక బీసీ కమిషన్‌కు సంబంధం లేదన్నారు. కాగా, ప్రజలపై భారం మోపకుండా ఆర్థిక వనరుల సమీకరణపై అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని భట్టి ఆదేశించారు. వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్లు, రవాణా, భూగర్భ గనులు, ఖనిజాల శాఖల ఉన్నతాధికారులతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. సిమెంట్, స్టీల్, స్క్రాప్ వ్యాపారులు ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నుల విషయమై స్పెషల్ డ్రైవ్ చేపట్టాలన్నారు. సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సయ్యద్ ముర్తుజా రిజ్వీ పాల్గొన్నారు.

ముగ్గురూ కలిసి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు

» కాంట్రాక్టులన్నీ ఆ రెండు సంస్థలకే కట్టబెడతారా?

» 'కొడంగల్'లో సీఎం వాటా ఎంత? ఢిల్లీ వాటా ఎంత?

» రేవంత్‌రెడ్డి చెప్పినట్లు చేస్తే.. ఉద్యోగాలు ఊడుతాయ్ : కేటీఆర్



హైదరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి, మేఘా అధినేత కృష్ణారెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. ఈ ముగ్గురూ కలిసి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఆంధ్రా కంపెనీ, ఈస్ట్ ఇండియా అరాచక కంపెనీ అని గతంలో విమర్శించిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు అదే మేఘా కంపెనీకి పలు కాంట్రాక్టులు ఎలా కట్టబెట్టారని ప్రశ్నించారు. దొంగలు, దొంగలు కలిసి ఊళ్లు పంచుకున్నట్లు రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నింటినీ పొంగులేటికి చెందిన సంస్థ, మేఘా సంస్థకు కట్టబెడుతున్నారని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారులు, ఇంజనీర్లు రేవంత్‌రెడ్డి చెప్పినట్లు సంతకం పెడితే మేము అధికారంలోకి వచ్చాక విచారణ ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో రేవంత్ ఉద్యోగం ఊడిపోతుందని, ఆ తర్వాత అధికారుల ఉద్యోగాలూ ఊడుతాయని వ్యాఖ్యానించారు. మూసీ ప్రాజెక్టు కోసం రేవంత్ ఆగమాగం అవుతున్నారని, ఇప్పటికిప్పుడు కాంట్రాక్టులు అప్పజెప్పి.. అక్రమంగా డబ్బులు రాబట్టాలని చూస్తున్నారన్నారు. కొడంగల్ ఎత్తిపోతల పథకానికి వెచ్చించనున్న రూ.4,350కోట్లలో రేవంత్ వాటా ఎంత? ఢిల్లీ వాటా ఎంత? అని నిలదీశారు. అమృత్ టెండర్లను సీఎం తన బావమరిదికి ఇచ్చిన విషయంలో కేంద్ర సంస్థలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ కలిసి పని చేస్తున్నాయని, వాటి బాగోతాలను ఒక్కొక్కటిగా బయటపెడతానని అన్నారు. "వాళ్ల, వీళ్ల జైలుకుపోతారని చెప్పడానికి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఎవరు? ఆయనేమైనా హోంమంత్రా..? పోలీస్ ఉన్నతాధికారా..? బాంబులు పేల్చడం కాదు.. ముందు ఆయనే జైలుకు పోవడానికి సిద్ధంగా ఉండాలి. ఎవర్ని, ఎప్పుడు అరెస్ట్ అవుతారో మంత్రి చెబుతారా? వీళ్లు ప్రభుత్వం నడుపుతున్నారా..? సర్కస్ నడుపుతున్నారా?" అని ఎద్దేవా చేశారు. కాగా, ఢిల్లీ ముందు మోకరిల్లడం కాదు.. పండించిన పంటకు భద్రత లేక గొల్లుమంటున్న రైతన్నల మొహం వైపు చూడాలని సీఎం రేవంత్‌ను ఉద్దేశించి ఎక్స్ వేదికగా కేటీఆర్ వ్యాఖ్యానించారు. రైతన్నల కన్నీళ్లు తుడిచే ప్రయత్నం చేయాలని సూచించారు. కాగా, ఈనెల 9న జరిగే మలేషియా తెలంగాణ అసోసియేషన్ దశాబ్ది ఉత్సవాలకు కేటీఆర్ హాజరుకానున్నారు. ఈ ఉత్సవాల పోస్టర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు.

కేశవాపురం వద్దు.. మేఘా కాంట్రాక్టు రద్దు

(మొదటిపేజీ తరువాయి)



తాగునీటిని అందించే ఉద్దేశంతో కేశవాపురం రిజర్వాయర్‌ను నిర్మించాలని నిర్ణయించింది. గోదావరి ఫేజ్-2 ప్రాజెక్టు కింద 10 టీఎంసీల సామర్థ్యంతో దీనిని నిర్మించేలా చర్యలు చేపట్టింది. కొండపోచమ్మ సాగర్ నుంచి కేశవాపురం జలాశయానికి, అక్కడి నుంచి హైదరాబాద్ నగరానికి నీటిని తరలించేలా ప్రాజెక్టు రూపకల్పన జరిగింది. ఇందుకోసం రూ.4777.59 కోట్ల అంచనాలతో కేశవాపురం వద్ద నిర్మించాలనుకున్న జలాశయ నిర్మాణానికి 2018 ఫిబ్రవరి 3న అప్పటి ప్రభుత్వం పరిపాలనా అనుమతులు ఇచ్చింది. దీంతో టెండర్లను ఆహ్వానించగా.. మేఘా ఇంజనీరింగ్ కంపెనీ రూ.3918 కోట్లకు పనులు దక్కించుకుంది. హైబ్రిడ్ యాన్యుటీ పద్ధతిలో పదేళ్ల పాటు రూ.6891 కోట్లకు పైగా చెల్లింపులు చేసేందుకు వాటర్ బోర్డుతో ఒప్పందం కూడా చేసుకుంది.

ఆరేళ్లుగా పనులు చేపట్టని సంస్థ..

గత ప్రభుత్వంలో ప్రతిపాదించిన డిజైన్ల ప్రకారం ప్రాజెక్టు అమలు చేయాలంటే అటవీ భూములు, రక్షణ భూములను సేకరించాల్సి రావడం, అలైన్‌మెంట్ సమస్యలు, భూసేకరణ చిక్కులు ఉండటంతో ఆరేళ్లుగా ప్రాజెక్టు పనులు చేపట్టలేని పరిస్థితి ఏర్పడింది. వాటర్‌బోర్డు, రెవెన్యూ అధికారులు సకాలంలో భూసేకరణ పూర్తి చేయలేదు. పైగా అప్పటి ప్రభుత్వం కూడా రిజర్వాయర్ నిర్మాణానికి పెద్దగా ఆసక్తి చూపలేదు. కేంద్ర ప్రభుత్వం 1011ఎకరాల భూములిచ్చినా.. అందులో నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించలేదు. భూసేకరణ చిక్కులతో పాటు అనాలోచితమైన అలైన్‌మెంట్ కారణంగా పనులు ముందుకు సాగలేదు. టెండర్ ఖరారయ్యాక కూడా మేఘా ఇంజనీరింగ్ కంపెనీ ఆరేళ్లుగా ఎలాంటి పనులు చేపట్టలేదు. ఈ క్రమంలో 2017 నాటి ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం పనులు చేపట్టలేమని, 2024 ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం అంచనాలను సవరించాలని ఆ కంపెనీ ఇటీవలే ప్రభుత్వానికి లేఖ రాసింది. అయితే ప్రభుత్వం రేట్ల పెంపును తిరస్కరించటంతో పాటు ఇప్పటివరకు పనులు చేపట్టని కారణంగా మేఘా కంపెనీకి కేటాయించిన టెండర్లను రద్దు చేసింది. కేశవాపురం జలాశయం నిర్మాణం ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో పాత ప్రతిపాదనలను పక్కన పెట్టి, తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనాలు ఉండేలా కొత్త ప్రాజెక్టును రూపొందించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది.

కొత్త ప్రాజెక్టుతో రూ.2 వేల కోట్ల ఆదా..

కొత్త ప్రతిపాదనల ప్రకారం హైదరాబాద్ నీటి అవసరాలను తీర్చడం కోసం చేపట్టిన గోదావరి ఫేజ్-2 పథకంలోని మల్లన్నసాగర్ ,హిమాయత్ సాగర్‌లకు గోదావరి నీటిని మళ్లిస్తారు. హైదరాబాద్‌కు 10 టీఎంసీలు, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాలకు 5 టీఎంసీల నీరు అందించడంతో పాటు ఇతర అవసరాలు తీర్చడానికి మల్లన్నసాగర్ నుంచి 15 టీఎంసీల నీటిని తరలించేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలకు ఇటీవలే క్యాబినెట్ ఆమోదం కూడా తెలిపింది. ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వానికి సుమారు రూ.2 వేల కోట్ల ఆదా అవుతుందని అంచనా వేశారు. గత ప్రభుత్వ డిజైన్ ప్రకారం ఆరు సార్లు నీటిని ఎత్తిపోసి హైదరాబాద్‌కు నీటిని తరలించాల్సి ఉండగా.. గోదావరి ఫేజ్-2 ప్రతిపాదన ప్రకారం కేవలం రెండుసార్లు మాత్రమే నీటిని ఎత్తిపోస్తే సరిపోతుంది. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లను నింపేందుకు ఎక్కువ భాగం గ్రావిటీతో నీరు రానుంది. దీంతో నిర్వహణ వ్యయం, విద్యుత్ భారం కూడా తగ్గుతాయి. ఇప్పటి వరకు వెయ్యి లీటర్ల నీటికి వాటర్‌బోర్డు రూ.48 ఖర్చు చేస్తుండగా.. గోదావరి ఫేజ్-2తో ఈ ఖర్చు రూ.44కు తగ్గనుంది. హైదరాబాద్ మహా నగర తాగునీటికి కీలకంగా భావిస్తున్న గోదావరి ఫేజ్-2 పనులకు త్వరలోనే రూ.5560 కోట్లతో టెండర్లను పిలిచేందుకు వాటర్‌బోర్డు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

కులగణన ప్రక్రియ ప్రారంభం

రాష్ట్రంలో తొలి రోజు ఇంటింటికీ సర్వే స్టిక్కర్లు అతికించిన ఎన్యుమరేటర్లు

» రేపటి వరకు జాబితాల తయారీ, స్టిక్కర్లు అంటించే ప్రక్రియ..

» 9 నుంచి సమగ్ర ఇంటింటి సర్వే

హైదరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన కులగణన ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. ఈ సర్వేలో భాగంగా రాష్ట్ర ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల తదితర వివరాలను సేకరించనున్నారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాలను బ్లాకుల వారీగా విభజించారు. సర్వేలో మొదటిరోజైన బుధవారం ఆయా గ్రామాలు, వార్డులు, బస్తీల్లోని బ్లాకులకు ఎన్యుమరేటర్లు వెళ్లి ప్రతి ఇంటిలో ఉన్న కుటుంబాలను నమోదు చేశారు. ఇంటి నంబరు, కుటుంబ యజమాని పేరుతో జాబితాను తయారుచేసి ఆ ఇంటికి స్టిక్కర్‌ను అతికించారు. జాబితాల తయారీ, స్టిక్కర్లు అంటించే ప్రక్రియను 8వ తేదీ వరకు నిర్వహించనుండగా.. ఈనెల 9 నుంచి సమగ్ర ఇంటింటి సర్వేను చేపట్టనున్నారు. క్షేత్రస్థాయిలో సర్వే మొత్తం పూర్తయిన తర్వాత ఆ వివరాలను మండల, జిల్లా స్థాయిలో కంప్యూటరీకరించనున్నారు. ఈ ప్రక్రియను జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్, మండల, మునిసిపాలిటీల్లో నోడల్ అధికారిగా నియమితులైన జిల్లా స్థాయి అధికారులు పర్యవేక్షిస్తారు. సర్వే వాస్తవ పురోగతిని నిరంతరం జిల్లా, రాష్ట్ర స్థాయిలో డ్యాష్ బోర్డు ద్వారా పర్యవేక్షించనున్నారు. సర్వేలో సేకరించిన కుటుంబాల సమాచారమంతా అత్యంత గోప్యంగా ఉంచడంతోపాటు సర్వే షెడ్యూల్‌ను భద్రపరచనున్నారు. 9 నుంచి మొదలయ్యే సర్వేలో వివరాలను తెలిపేందుకు ఆయా కుటుంబ సభ్యులందరి ఆధార్ కార్డులు, భూమి పాసుపుస్తకాలు, రేషన్‌కార్డులను ప్రజలు సిద్ధంగా ఉంచుకుంటే వివరాలను త్వరగా తెలిపే అవకాశం ఉంటుందని అధికారవర్గాలు సూచిస్తున్నారు. సర్వే సమాచారం మొత్తం ప్రణాళికా శాఖకు చేరనుండగా ఆ సమాచారాన్ని బీసీ కమిషన్‌కు అందించనున్నారు.



ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో సర్వేను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

సర్వే ఇలా..

- సర్వేలో 56 ప్రధాన, 19 అనుబంధ ప్రశ్నలు కలిపి మొత్తం 75 ప్రశ్నలుంటాయి.
- ప్రతి ఎన్యుమరేషన్ బ్లాక్‌లో సుమారు 150 నుంచి 175 కుటుంబాలుంటాయి.
- ప్రతి 10 మంది ఎన్యుమరేటర్లను పర్యవేక్షించేందుకు ఒక సూపర్‌వైజర్ ఉంటారు.
- ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 1,17,44,954 కుటుంబాలు ఉన్నాయి.
- మొత్తం 87,092 ఎన్యుమరేషన్ బ్లాక్‌లు గుర్తించారు. వీటిలో జీహెచ్ఎంసీ పరిధిలో 19,328, ఇతర ప్రాంతాల్లో 67,764 ఉన్నాయి.
- సర్వే కోసం రాష్ట్రవ్యాప్తంగా 94,750 మంది ఎన్యుమరేటర్లను ఎంపిక చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.